

ఆమె జీవితంలో స్థిరపడాలంటే డబ్బు కూడ ఎంతో అవసరమౌతుంది.

మీ పాప పేరిట ప్రతినెలా ఒక్క 160 రూపాయలు 10 ఏళ్ల పాటు మా క్యుములేటివ్ డిపాజిట్ స్కీంలో పొదుపు చేస్తే ఆమెకు మొత్తంగా రూ.34,835.20 అందుతుంది.

ఈ మొత్తం నుండి 33,790 రూపాయలను మరో 10 ఏళ్ళకు మా అక్షయ డిపాజిట్ స్కీంలో ఆమె పేరిట పొదుపు పెట్టారంటే ఆసైకముతో ఆమె లక్షాధికారి కాగలదు. మా క్యుములేటివ్ మరియు అక్షయ డిపాజిట్ స్కీంలో మీ పొదుపు ఎలా అభివృద్ధి చెందుతుందో గమనించండి.

క్యుములేటివ్ డిపాజిట్				అక్షయ డిపాజిట్		
నెలసరి జమా రూ.	కాల పరిమితి	కూడబెట్టుకున్న మొత్తము రూ.	మేము మీకివ్వబోయే మొత్తము	తిరిగి పెట్టుబడి పెట్టబోయే మొత్తము రూ.	కాల పరిమితి	మేము మీ కివ్వబోయే మొత్తము రూ.
160/-	120 నెలలు	19,200/-	34,835.20	33,790/-	120 నెలలు	1,00,000/-


ఇంకా ఎక్కువ వివరాలకు మీ సమీపంలోని మా బ్రాంచిలో విచారించండి.



ది వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీసు : అవెన్యూరోడ్, బెంగుళూరు-560 002.
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు : 72 సెయింట్ మార్క్సరోడ్, బెంగుళూరు-560 001.
ఛైర్మన్: రమేశ్‌గల్లి

కలసి అభివృద్ధి సాధిస్తాం




స్థాపకుడు
వి.వి.రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
లీలాపతి రాఘవయ్య

సంపుటి 22 సెప్టెంబరు 84 సంచిక 8

ఇదీ వరస



ఈ నెల నవలానుబంధం

పసుపులేటి మల్లికార్జునరావు ఉదయం

ముఖచిత్రం : రేఖ

జ్యోతి. పి.బి.నెం. 1824, హైదరాబాద్-20. ఫోన్. 61180

జ్యోతికే మళ్లీ అగ్రతాంబూలం

ఇండియన్ మార్కెట్ రిసెర్చి బ్యూరో వారు జరిపిన సర్వే (1984) లో ఈసారి కూడా జ్యోతినే పాఠకులు ఎక్కువ ఆదరిస్తున్నారన్న విషయం వెల్లడైంది. తెలుగులో వెలువడే మాసపత్రిక లన్నిటిలోకి జ్యోతికే అగ్ర తాంబూలం!!! రెండో స్థానం మద్రాసునుండి వెలువడే విజయచిత్రకి వచ్చింది. ఇంకొక అభినందనీయమైన విషయం ఏమిటంటే జ్యోతిని చదివే పాఠకుల్లో ఎక్కువమంది 25-34 వయసు మధ్యవారట. అందరి అభిరుచుల మేరా-సత్సాహిత్యాన్నీ, హుషారు షారు హ్యూమర్‌నీ, వినరంతరో మాన్సని మిళితంచేని, అనాటినుంచి ఈనాటివరకూ ఆ సంప్రదాయాల్ని నిలబెట్టుకుంటూ వస్తూన్నది జ్యోతి. సిన్సియారిటీకి గొప్ప బహుమతి గుర్తింపు. ఈ సంతోష సమయంలో మా రచయితలకీ, పాఠకులకీ, ఏజెంట్లకీ కృతజ్ఞతలు. మీ అండా ఆదరణా వుంటే జ్యోతి నిండా నూరేళ్ళు ఇలాగే ప్రథమ స్థానంలో అఖండంగా వెలుగుతుందని హామీ ఇస్తూ...సవినయంగా శుభవి వేసుకుంటూ—

జ్యోతి

తొలిమాట


కేవలం లబ్ధప్రతిష్ఠులైన రచయిత(త్రు)లే రాజ్యం ఏలుతున్న
ఈ సాహితీ ప్రపంచంలో కొత్తవాళ్ళకి కూడా చోటు
కల్పించాలని చాలా రిస్క్ తీసుకుని జ్యోతి 'తియ్యటి బహుమతి'
క్రింద కొత్త రచయిత(త్రు)లని ప్రోత్సహించటం మీద
అభినందనల ఉత్తరాలు చాలా వస్తున్నాయి.
కృతజ్ఞతలు!

ఈ సంచికలో ఐదు కొత్తరచయితల కథలున్నాయి.
ఇవి ఎలా ఉన్నాయో మీరే చెప్పాలి
పోతే_
ఈ కొత్త రచయితల కథలన్నిటినీ ఛాలెన్స్ చేస్తూ
ముగ్గురు ప్రముఖ రచయితలు_ చాగంటి సోమయాజులు,
రాచమల్లు రామచంద్రారెడ్డి సదానంద్ శారద గార్ల కథలు
ఇందులో ప్రచురిస్తున్నాం.


పాఠకులకు మనవి:
కొత్త రచయితలకి మీరిచ్చే చేయూత ఒక్కటే!
దయచేసి వాళ్ళు చేసిన తప్పులు,
వాళ్ళు గుర్తు పెట్టుకోవలసిన విషయాలు
ఏవైనా ఉంటే రచయిత పేరు రాసి కేరాఫ్ జ్యోతికి
పంపించండి ఆ రచయితకి మేము పంపిస్తాం.
భవిష్యత్తులో కాబోయే ఒక గొప్పరచయితకి మీ సూచన
ఎంతో ఉపయోగపడవచ్చు!

The Star Performers


Bringing to you the spectacular performance of world class athletes, without interruption. Live or on tape, ECtv performs the way a tv should.




MINISUPER



SPECTRA SUPER



PREMIER



Ajanta

ECtv

made to work as a tv should.

ASP/ECIL/8413

ఉత్తరాలు

కార్టూన్లూ, జోకులూ అన్నీ బాగుంటున్నాయి. "రాక్షసుడు" సస్పెన్స్‌తో ప్రాణం తీస్తున్నాడు. జ్యోతి ఇలాగే ఎప్పుడూ క్రొత్తదనాలతో అందిస్తారని ఆశిస్తాము.

—కె. హెచ్. రామచంద్రం, తెనాలి.

* మళ్ళీ థాంక్స్!

"ఆ రోజు రాత్రి" కథ చదివి థ్రిల్ అయ్యాము. శంకరమంచి పార్థసారధి గారికి ఇంత మంచికథ అందించినందుకు ధన్యవాదాలు.

ఫోటోలు, కవితలు చాలాచాలాబావున్నాయి కానీ ఇంకొంచెం మంచి ఫోటోలయితే (ఒకవేళ ప్రింట్ సరిగ్గా లేదా?) ఇంకా బాగుంటుంది

—ఏమ్.ఎస్. లక్ష్మి, తిరుపతి

* అవును! ప్రింటింగ్ విషయంలో మరింత జాగ్రత్త పడతాం.

ఎడిటర్ గార్కి నమస్కారములు,

ఆగష్టు 84 జ్యోతిలో ఆరెకపూడి వారి "విముక్తి" కథల్లో ముఖ్యంగా కావిలిపాటి విజయలక్ష్మిగారి "జీవితం వెక్కిరిస్తే" మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఇటువంటి కథలు, వాస్తవానికి దగ్గరగానున్న రచనలు ప్రచురిస్తున్న "జ్యోతి"కి మా కృతజ్ఞతాభివందనాలు.

—బి శీతారామయ్య మరియు
కె. వి. రావు, కుటుంబ సభ్యులు.


"జ్యోతి" చాలా నీట్‌గా, అందంగా వస్తోన్నందుకు మా అభినందనలు. అలాగే కథలస్థాయినికూడా మరికొంచెం పెంచగలిగితే....

—రావిచర్ల సుమలత, దేవికారాణి
విశాఖపట్నం

'స్థాయి' చాలా రిలెటివ్ టర్మ్ కదా! ప్రయత్నిస్తాం



నవ్వులకు ఒకనాడు పేరుపొందిన జ్యోతి మళ్ళీ ఆస్థాయితో అద్భుతమయినజోకులు కార్టూన్లూ అందించడం నాలాటి హాస్యప్రియులకు ఎంతో ఆనందం కలిగిస్తోంది విజ్ఞానజ్యోతి నిజంగానే విజ్ఞానధాయకంగా ఉంది.—జయదేవ్, విజయవాడ




"రైల్వేజంక్షన్"లో మహీధర్, తులసి అలా ఫోన్‌లో మాటలాడుకోవడమేనా, సైక్లోన్ ముగిసేలోపల కలుసుకుంటారా? చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం.

—మన్నెపూడి విమల, మదనపల్లి

* తుఫాను తగ్గితేగాని ఏ విషయం తెలీదంటే విమలగారూ.

కొన్ని, కొన్ని, మన జీవనంతో అలా ముడివడిపోతాయి...
నూరేళ్ళు గడచినా అలాగే నిలిచిపోతాయి!



నూరేళ్ళ క్రితం ఒక సంప్రదాయం వెలసింది,
దాన్ని అందరూ సన్‌లైట్ అన్నారు. ప్రపంచమంతటా,
ఇంటింటా అమ్మ అమ్మాయికి అందించడం
ఆ సంప్రదాయం. రోజులు మారాయి. అయితేనేం, శుద్ధమైన,
మృదుత్వంగల సన్‌లైట్ యొక్క సంప్రదాయం మాత్రం
చెక్కు చెదరకుండా నిలిచేవుంది ఈ నాటికీ. అలా
అనేక శతాబ్దాలు నిలబెట్టాలనే మా దృఢసంకల్పం!

సన్‌లైట్ సబ్బు 100 సంవత్సరాలుగా విశ్వసనీయమైన సంప్రదాయం

LINTAS SUN 11 1811 TL హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

ఉత్తరాలు



ఆగస్టునెల "జ్యోతి" చాలాబాగుంది, "జ్యోతి" తెలుగు పత్రికలలో నిజంగా "కొని" చదవదగ్గ పత్రిక అనిపించు కుంది. ఈ సంచికలో నవలానుబంధం లోని రెండుకథలు "స్ట్రిగుల్" "గుండె గది ఖాళీ" నిజంగా మంచికథలు. "మానవుడు" నవల తర్వాత శ్రీ రాధాకృష్ణ మూర్తిగారి కలం అందించిన మంచికథ "స్ట్రిగుల్", ఇక కొత్త రచయిత్రి (అనుకుంటాను) అయినా కె. మాధురిగారి "గుండెగది ఖాళీ" గుండె లోతుల్ని స్పృశించగల కథ. "రాక్షసుడు" ఈనెల చప్పగా ఉంది. కొంపదీసి నాలుగు సీరియల్‌ల మహత్యం కాదుకదా(?!) జాగ్రత్తపడరూ వీరేన్‌గారూ.——

పొట్నూరు రజనీకాంత్, పార్వతీపురం.

* ఈ నెల చదివి చెప్పండి.

ఉత్తరాలు




ఎడిటర్ గారికి,

జ్యోతి-నిజంగా-సరిగ్గా ఇరవయ్యేళ్ళ క్రిందటి పరిమళాలతో వస్తోంది. అభినందన అందించటానికి వెంటనే ఉత్తరం రాయాలనిపించింది. కవరు పేజీ మాత్రం మరికాస్త శ్రద్ధతీసుకోవాలి. ఏజెంట్లూ పాఠకులుకూడా-పొంగిపోతున్నారు ప్రతి కను చూసి. జ్యోతి అఖండంగా అలాగే వెలగాలని ఆశిస్తూ-

——ఎమ్వీయల్. నూజివీడు

థాంక్స్ ఎమ్వీయల్ గారూ. మరి మీ కాంట్రిబ్యూషన్?



ఎడిటర్ గారికి వందనాలు,

మీ గళ్ళ నుడికట్టు మరికొంచెం కష్టతరంగావుంటే బావుణ్ణు. పాఠకుడు అన్ని గళ్ళు పూర్తి చేయగల్గితే అందులో తృప్తి పొందలేడు. ఒకటి రెండు ఆధారాలైనా అంకకుండా రెండు మూడు రోజుల వరకైనా మురిపించాలి. అంచేత దోసు పెంచాలి. మాకు పదజాలం వెతుక్కునేఆరాటం పెరగాలి.

గళ్ళ నుడికట్టు ప్రతినెలా అందిస్తున్నందుకు మీకూ, జ్యోతివారికి కృతజ్ఞతలు. —— కె. వి. రమణ
జయపురం (ఒరిస్సా)

బహుమతి పొందిన ఉత్తరం:

క్రితం సంచికలో "సస్పెన్స్ అంటే..." అన్న ప్రశ్నకు పదహార్ పేజీ చూడండి—అని పూరించారు. అందులో ఏమీ లేదు! ఇది ఎవరి తప్పు ఎడిటర్జీ గారూ!

యస్. చటర్జీ, మద్రాసు-17

** ఊరించి ఊరించి ఏమీ చెప్పకపోవటమే ప్రస్తుతం సాహిత్యంలో నడుస్తూన్న సస్పెన్సు చటర్జీ గారూ!*


VESTS
BRIEFS
CASUALS
KIDSWEAR
YOU
PANTIES
Imageads M 194 4 Tel

అతడు విజయ్‌కి ఫోన్ చేశాడు. "విజయ్"

"...మాట్లాడుతున్నాను"

"నేనే విజయ్. ఆగు. ఫోన్ పెట్టెయ్యకు. నేనింతవరకూ నా జీవితంలో ఎవరికీ క్షమాపణలు చెప్పుకోలేదు విజయ్! మొట్టమొదటిసారి నీకే చెప్పుకుంటున్నాను. ఐ యామ్ సారీ నాకు తెలీదు-నీకూ మీ నాన్నకీ పడదనీ, నువ్వు ఇంటి నుంచి విడివడి వేరేగా వుంటున్నావనీ...."

ఈ ఆకస్మాత్తు ఫోన్‌కాల్‌ని ఊహించని విజయ్ వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కొంచెం సేపటికి తేరుకుని "ఇట్సాల్ రైట్-" అన్నాడు. "-కానీ నేను మా నాన్న నుంచి విడిపోవటానికీ, నువ్వు నా ఉద్యోగం తీసేయించినందుకు బాధపడటానికీ సంబంధం ఏమిటో నాకు అర్థం కావటంలేదు. నా ఉద్దేశ్యంలో నువ్వు నామీద "కసి" తీర్చుకోవటానికి కారణం కేవలం నేను మానాన్నని అరెస్టు చేయలేదని-"

"నిజమే. కానీ దాని కన్నా ముఖ్యకారణం మీ నాన్నని-ఐమీన్, వంకచెక్కా రామ్మూర్తిని దెబ్బకొట్టటం... నీకు ఉద్యోగంపోతే బాధపడతాడనుకున్నాను."

"బాధా..." అట్నుంచి విరునవ్వు వినిపించింది. "సంతోషిస్తాడు"

"అవును. నాకు ఇప్పుడే తెలిసిందా విషయం. విజయ్ నాకో అరగంట టైమివ్వు. నీ సస్పెన్షన్ కాన్సిల్ చేయించి నీకు తిరిగి ఆర్డరు వేయించే బాధ్యత నాకు వదిలిపెట్టు. అక్కడే వుండు . అరగంటలో ఆర్డరు పట్టుకొస్తాను..."

అట్నుంచి జవాబు లేదు

"ఏం మాట్లాడవు"

విజయ్ కంఠం నెమ్మదిగా వినిపించింది "పోలీస్ స్టేషన్‌ని బాంబులతో బ్రద్దలుకొట్టిన నేరానికి అరెస్టు కావలసిన రాక్షసుడు,– అతడు తల్చుకుంటే అదే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అరగంటలో ఉద్యోగం–ఏం మాట్లాడను? నాకు నోటి వెంట మాట రావటంలేదు." వ్యంగ్యంగా అన్నాడు.

"అవును విజయ్! భారతమాతని చెక్కపెట్టెతో మేకులు కొట్టి బంధించి వుంచినందుకు అరెస్టుకావలసిన రాక్షసుడు-

అదే పెట్టెని అమ్మితానూ అంటే, టోకున అమ్ముతావా చిల్లరగా ముక్కలు చేసైనా ఫర్వాలేదు-అని బేరమాడే రాజకీయ నాయకులు ఉన్న దేశం ఇది. ఉద్యోగానిదెంత. చాలా సుళువం" ఫోన్ పెట్టేసాడు.

o o o o

పురోహితన్!

చీఫ్ ఆఫ్ పోలీస్ డిపార్టుమెంట్.

కొంకిణి జాతికి సంబంధించినవాడు. అందులో వెనుకబడ్డ తెగ! ఐ. పి. యస్. లో అందుకే సులభంగా సెలెక్టు అయ్యాడు. మిగతా వాళ్ళందర్లాగే అతడూ ఒకసారి ఈ గౌరవప్రదమైన ఉద్యోగంలోకి రాగానే తన కులాన్ని-'వెనకబడ్డ' తన వాళ్ళనీ మర్చిపోయి, హై సొసైటీ మెంబర్ అయ్యాడు. ఒకప్పుడు తను నివశించిన ఊరి చివర "వాడ" అంటేనే అసహ్యం అతడికి. అయినా ఇదంతా ఎప్పుడో ఇరవై సంవత్సరాల క్రితం మాట.

తరువాత అతడు తన రాష్ట్రాన్ని వదిలి ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాడు. అప్పటి ముఖ్యమంత్రికి ఇతడికి 60 : 40 షేర్లు ఉండేవి. కాలం హాయిగా సాగిపోయింది. కానీ తరువాత చిన్న దెబ్బ తగిలింది కొత్తగా వచ్చిన ముఖ్యమంత్రికి ఇతడికీ సరిఅయిన టర్మ్స్ కుదర్లేదు. ఫలితంగా అతడు సస్పెండ్ అయ్యాడు.

కానీ పురోహితన్ కూడా సామాన్యమైనవాడేమీకాదు. ప్రజల్లో ముఖ్యమంత్రికి పలుకుబడి వుండవచ్చుగాక. కానీ "సర్కిల్స్"లో అతడికి పలుకుబడి వుంది. హైకోర్టు జడ్జిని "కానేసి" ఉద్యోగానికి స్టే తెప్పించుకున్నాడు. సస్పెన్షన్‌కి సరి అయిన కారణాలులేవని కోర్టు అభిప్రాయపడింది.

అంతే...

ఈఅవకాశం తీసుకుని ముఖ్యమంత్రికి వ్యతిరేకపత్రికలు ఇది ఆయన తొందరపాటు చర్య అని ఏకిపారేసాయి. ఇక్కడ పురోహితన్ నిజాయితిపరుడా కాదా అన్నది కాదు సమస్య. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఒకడు గెలిచాడు. అది పత్రికలకు కావలసినది.

ముఖ్యమంత్రి అహం దెబ్బతిన్నది. అతడిని మరిలేవకుండా స్మాష్ చేయా లనుకున్నాడు. రాజకీయాల్లో ఎత్తులకి కొదవేముంది. పురోహితన్‌కి తిరిగి చీఫ్ ఆఫ్ పోలీస్ పదవి ఇవ్వబడింది. మొదట్లో పురోహితన్‌కి అనుమానం వచ్చింది. కానీ రెండు మూడు నెలలు తిరిగేసరికల్లా సర్దుకున్నాడు. ముఖ్యమంత్రి తనతో అప్పు డప్పుడు సలహా సంప్రదింపులు జరిపేవాడు. తిరిగి తన పొజిషన్ తనకి వచ్చింది. దాంతో ముఖ్యమంత్రి తనతో రాజీకి వచ్చాడు అనుకున్నాడు. నెమ్మదిగా చేతులు సాచటం మొదలు పెట్టాడు. అతడి చుట్టూ పదికళ్ళు గమనిస్తున్నాయని అతడికి తెలుసు. ఈసారి మరింత పకడ్బందీగా అతడి చుట్టూ వల బిగిసింది. అతడి ఆస్తుల దగ్గర్నుంచీ, అతడి మామ, తమ్ముడి భార్య, నాన్న ఆస్తి వరకూ ఎ. సి. బి. సీక్రెట్‌గా వివరాలు సంపాదించింది.

ఒక శుభ ముహూర్తాన, అతడు పొద్దున్నే లేచి బ్రష్‌మీద పేస్టు పెట్టుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోతున్న సమయాన ఎ.సి.బి. అధికారులు అతడి ఇంటిమీద రైయిడ్ జరిపారు. అతడు దొరికి పోయాడు.

అక్కడితో ఈ ఆట పూర్తి కావల్సిందే.

కానీ ఆరోజు ముఖ్యమంత్రి ఊర్లోలేడు. దాంతో మరింత ముందుకు సాగింది ఎ. సి. బి. అధికారికి ముఖ్యమంత్రికన్నా తన కొడుకులూ, కూతుళ్ళూ

ముందు దగా, వెనుక దగా, కుడిఎడమల దగా దగా!

ముఖ్యం. ~~ రిటైరయ్యేలోపులో వారి ఆస్తుల్ని కనీసం రెట్టింపుచేసే ప్రయత్నం లో వున్నాడు. పురోహితన్‌కి రహస్యంగా ఫోన్ చేసాడు.

"ఎంత"

"పాతిక లక్షలు"

"మైగాడ్. అంతా"

"నేనొక్కణ్ణేకాదు. మీ ఇంటిని రైడ్‌చేసిన ఇనస్పెక్టర్లందరికి తలో రెండు లక్షలు ఇవ్వాలి. అదీగాక చాలా రిస్కు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా ఇందులో ఇంటరెస్టుతో వున్నాడు"

పురోహితన్ అనుమానంగా "ఆయన అంత ఇంటరెస్టుతో వున్నాడంటున్నారు. తీరా ఇంత ఖర్చు పెట్టాక పని అవుతుందా? ఆయన స్టేట్‌మెంట్ ఇస్తే ప్రజలు వూరు కుంటారా?" అన్నాడు.

అట్నుంచి నవ్వు వినబడింది. "మీకు మా డిపార్టుమెంటు సంగతి ప్రజల గొప్ప తనమూ తెలియదులా ఉంది. ముఖ్యమంత్రి స్వయంగా మనిషిని పంపించి ఒక మంత్రి తీసుకున్న లంచం తాలూకు వివరాలు టేప్ రికార్డు చేయించినా, ఆ తరువాత మేమేమీ చెయ్యకపోతే ప్రజలూ ఆ సంగతి మర్చిపోతారు. అయినా ఏమి దొరకలేదంటే ఆయన మాత్రం ఎందుకు స్టేట్‌మెంట్ ఇస్తాడు?

"కానీ పాతిక లక్షలంటే..."

"మిష్టర్ పురోహితన్...మీరూ.పోలీస్ డిపార్ట్‌మెంట్ మనిషే. ఒకసారి అరెస్ట్ అవుతే ఎంత పరువునష్టమో మీకూ తెలుసు. రేప్రొద్దున్నే విమానంలో ముఖ్యమంత్రి దిగుతున్నారు. రాత్రికి రాత్రి రికార్డులన్నీ మార్చెయాలి. మీకు రాత్రి పదింటివరకూ టైం ఇస్తున్నాం ఆ లోపులో పంపింతే పంపండి. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. ఇది మీరు మాకు సాయం చేయటంకాదు. మేము మీకు చేయటం-" అంటూ ఫోన్ పెట్టేసేడు.

పురోహితన్‌కి ఏమీ పాలుపోలేదు. రాత్రి లోపులో పాతిక లక్షలు ఎక్కడ తెస్తాడు?

అదృష్టవశాత్తు ప్రొద్దున జరిగిన రైడింగ్ సంగతి ఇంకా పేపర్లలోకి ఎక్కలేదు. ఈ రోజు తన రియాక్షన్ చూసుకుని రేపు వార్త విడుదల చేస్తారన్నమాట ఎ. సి. బి. వాళ్ళు. రేపట్నుంచీ వుండదు-ఈ పరపతి-ఈ డబ్బు సంపాదన-ఉద్యోగం.

ఉద్యోగంలో వుంటే పాతిక లక్షలు సంపాదించటం కష్టం కాదు. కానీ ఇప్పుడు రాత్రికి రాత్రి సంపాదించటం ఎలా?

అప్పుడు అతడికి జి.కె! ఇలాటి వ్యవహారాల్లో తన స్నేహితుడు...

జి.కే.ని సంప్రదించాడు. అంతతొందర్లో కృష్ణమూర్తి మాత్రం ఏంచేయ

నీతి మత్తులో తూలిపడే నువ్వూ, నేనూ!

గలడు?

ఆలోచన చెప్పగలవాడు "అతడొక్కడే!" జి. కె. యధావిధిగా కొడుకుని ఈ విషయం కాస్త "చూడ" మన్నాడు. అతడు రంగంలోకి దిగాడు. అయిదు నిముషాల్లో ప్లాన్ రెడీ అయింది.

అతడు-వాణి-సింహం-రాబోట్-శైలజ-భరత్.

ఆరు ఫోన్‌లు ఆరుగంటలసేపు నిర్విరామంగా పని చేసినయ్?

"హలో పపట్‌లాల్‌జీ..."

"హఁ"

"ఎలా వున్నారు?"

"తమరి దయవల్ల బాగానే వున్నాను."


"జంక్షన్‌లో కడుతున్న సినిమా హాలు ఎంతవరకూ వచ్చింది."

"పునాదులు లేచినయ్ సాబ్"

"తరువాత తరువాత ట్రాఫిక్‌కి అడ్డు వస్తుంది-లైసెన్స్ కాన్సిల్ చేద్దామా అనుకుంటున్నారట-మీ వరకూ వచ్చిందా."

"రామ్‌భగవాన్! అట్లఎట్ల చేస్తారు సాబ్- పని సగం పూర్తయ్యాక-"

"కాంపెన్సేషన్ ఇస్తారనుకుంటా...కానీ అది మీరు పుస్తకాల్లో చూపించినంతే వుంటుందే....ఎలా?"



"పూర్తిగా మునిగిపోయను సాబ్"

"సాయంత్రం ఆలోచిద్దాం రండి."

"ఎక్కడికి?"

"సాయంత్రం పురోహితన్ ఇం[illegible]ుంది మీకు తెలీదా..."

....

"హలో తులసీప్రసాద్"

"చెప్పండి."

"మీకు తెలీదా-పోలీస్ డిపార్ట్‌మెంట్‌వాళ్ళు అంబేద్కర్ విగ్రహంనుంచి పోస్టాఫీస్‌వరకూ వన్‌వే ట్రాఫిక్ పెట్టాలనుకుంటున్నార్ట"

"మైగాడ్-సగం బిజినెస్ పోతుందే. అందులోనూ మా షాపు రోడ్డుకి కుడివైపు వుంది."

"పురోహితన్ మీకు తెలీదా?"

"తెలీదు."

"సాయంత్రం రండి మాట్లాడుకుందాం."

"ఎక్కడిక-"

"సాయంత్రం పురోహితన్ మనవరాలికి వడుగు వుంది."

o o o o o o

పురోహితన్ ఇంటిముందు గార్డెన్ కళకళ లాడుతోంది. సాయింత్రం ఆరున్నరయింది. చీకటి పడుతూంది.

ఆరూనలభై అయిదుకి ముహూర్తం. లోపల ఆడవాళ్ళు కూర్చుని వున్నారు.

పురోహితన మనవరాలికి చేస్తున్న వడుగు తాలూకు మంత్రోచ్చాటన మైకులో విని పిస్తూంది. ఏడింటికి అది పూర్తయింది. పదేళ్ళపాప లోపల్నుంచి బైటకి వచ్చింది.

వెనుకే "అతడొచ్చాడు."

అతడి వెనుకే బ్రాహ్మడొచ్చాడు.

బ్రాహ్మడి వెనుక మంగలి వచ్చాడు.

బ్రాహ్మడు పాపని తూర్పుగా నిలబెట్టి మంత్రాలు చదువుతూ వుండగా మంగలి, పాప జడ చివరి ఒక అంగుళం కత్తిరించాడు. అతడు పట్టుకున్న వెండి పళ్ళెంలో వెంట్రుకలు పడినయ్.

వాళ్ళు ముగ్గురూ లోపలికి వెళ్ళిపోయారు.

అతడు మిగిలేడు.

చిన్న స్టేజీ ఎక్కి చెప్పటం మొదలుపెట్టాడు.

"మిత్రులారా! ఈ రోజు ఈ శుభ సమయంలో మనందరం ఇక్కడికి రావటం మన అదృష్టం. ఈ అదృష్టం నగరంలో కేవలం కొద్దిమందికే దక్కింది... కొంకిణి జాతిలో దీన్ని ఒక అపూర్వ అవకాశంగా భావిస్తారు. ఆడవాళ్ళకి వడుగు చేసి చివర కొద్దిగా వెంట్రుకల్ని కత్తిరిస్తారు. తమ తమ ఇనప్పెట్టెలో ఈ వెంట్రుక శాశ్వతంగా పెట్టుకుంటే అది తమ ధనాగారాన్ని

పెంపొందిస్తుందని అక్కడి వారు నమ్ముతారు. ఈ రోజు పురోహితన్‌గారు మన మధ్య ఉండటం, వారి మనవరాలికి మన ఊళ్ళోనే వడుగు చేయించటానికి నిర్ణయించటం కేవలం మన అదృష్టం. ఒక్కొక్కరూ వచ్చి ఒక్కొక్క వెంట్రుకని స్వీకరించ ప్రార్థన!"

...ముందు సింహం వచ్చాడు. భక్తితో ఒక వెంట్రుక తీసుకుని, పక్కన హుండీలో పదివేలు అందరికీ కనబడేటట్టువేసి వెంట్రుక కళ్ళ కద్దుకుని దిగాడు.

తరువాత పపట్‌లాల్...

తరువాత తులసీ ప్రసాద్

ఎనిమిదింటికి పవిత్ర కార్యక్రమం ముగిసింది.

పదింటికి పాతిక లక్షలూ అందచేయవలసిన వారికి అందజేయబడ్డాయి.

పురోహితన్ ఆవిధంగా అతడికి దగ్గిరయ్యాడు.

దాదాపు కళ్ళనీళ్ళతో "నీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పుకోను?" అన్నాడు చేతులు పట్టుకుని.

"నాకు కాదు. మా నాన్నకి చెప్పుకోండి. ఆయనే ఏపనిచేసిపెట్టాలో చెప్పేది ఎలా చెయ్యాలో మాత్రమే నేను ఆలోచించేది–"

అయినా ఆడ పిల్లకి వడుగేమిటి?"

"మీరు చేసుకుంటే ఈ వయసులో బాగోదు కాబట్టి, మీ అబ్బాయిది కూడా

జరిగిన కథ —
ఆంధ్రదేశాన్ని, కాస్త కాస్త భారతదేశ రాజకీయాల్ని కంట్రోలు చేస్తున్న వారు ముగ్గురు - కృష్ణమూర్తి, లోహియా, వంక చెక్కా రామూర్తి. ఒకరంటే ఒకరికి పడదు.

అతడు : అతడు కృష్ణమూర్తి కొడుకు.

ఆంధ్రప్రదేశ్‌లో నీటి కాలుష్య నివారణ నిమిత్తం డాక్టర్ ఫాస్టస్‌ని విదేశాల్నించి రప్పించాడు ముఖ్యమంత్రి! అతడి రిపోర్ట్‌వల్ల లోహియా నష్టపోతాడు. లోహియా, కృష్ణమూర్తి కూతురి నగ్నపు ఫోటోలు తీసి, అతడి ద్వారా పని సాధించాలనుకున్నాడు, డాక్టర్ ఫాస్టస్ హత్యచేయబడ్డాడు.

హత్యచేసింది వంకచెక్కా రామ్మూర్తి అతడిని అరెస్టు చేయటానికి నిరాకరించిన ఇన్‌స్పెక్టర్ విజయ్ సస్పెండ్ కాబడ్డాడు—ఇక చదవండి

బట్టతలే కాబట్టి— మీకు మనవళ్ళు లేరు కాబట్టి—" అన్నాడు అతడు "... మీరు కొంకిణి నుంచి వచ్చారు కాబట్టి-వారి ఆచార వ్యవహారాలు మాకు ఎక్కువగా తెలీదు కాబట్టి..."

7

"అసాధ్యం"

అతడు మాట్లాడలేదు. పురోహితనే అన్నాడు. "ఎలా...ఎలా ఇది సాధ్యపడుతుంది? సస్పెండయిన ఇనస్పెక్టర్ని ఇరవైనాలుగ్గంటల్లోగా తిరిగి పనిలోకి తీసుకోవటం? అసాధ్యం....ఇంపాజిబుల్"

"ఈ దేశంలో అసాధ్యం అన్నమాట లేదు పురోహితన్" తాపీగా అన్నాడు అతను. "అవసరం వున్న వాడి మనవరాలి వెంటుకని పదివేలకి కొనే మనుషులున్న దేశం ఇది. ఎలా చేస్తారో మీ ఇష్టం. రేపీపాటికి నాకు విజయ్‌ని తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటూ ఉత్తర్వు కావాలి..." అంటూ లేచాడు. అతడితో పాటూ వాణి కూడా లేచింది.

ఇద్దరూ బయట కొచ్చారు.

కారెక్కుతూంటే వాణి అన్నది—"చాలాకాలం క్రితం మీరు చేసిన సాయాన్ని చాలా ఇన్‌డైరెక్టుగా చెప్పారు"

అతడు మాట్లాడలేదు. కారు కదిలింది.

ఆమే తిరిగి అన్నది "ఆ విషయమే ఎప్పటినుంచో అడుగుదామనుకున్నాను."

"ఏమిటి?"

"ఈ మనుష్యులపట్ల మీకెందుకు కసి?"

ఇదే ప్రశ్న సింహం అడిగాడు. ఎందుకింత కసి...

ఆమె అంది-"వెంట్రుకే అమ్మకం్లేదు. ఏ ఫంక్షనైనా వాళ్ళు డబ్బు లిస్తారు. ఆడపిల్ల వడుగే అఖ్ఖర్లేదు. సత్యనారాయణ వ్రతమైనా చాలు. కేవలం మనుష్యుల్లో..." అని, సీరియస్‌గా వున్న అతడి మొహం చూసింది "నేనేమైనా ఎక్కువగా మాట్లాడానా సార్"

"లేదు వాణి. నేనెప్పుడూ నన్ను నేను వేసుకునే ప్రశ్నే నువ్వు అడిగావు. ఎప్పుడూ సీరియస్‌గా, ఏదో ఆలోచించుకుంటూ వుండే అతడు అంత మామూలుగా మాట్లాడటం ఆమెకి సంతోషం వేసింది. "నేనొకటి చెప్పనా?" అంది తటపటాయిస్తూ.

"ఏమిటి వాణీ-"

"చొరవ తీసుకుంటున్నానేమో!"

"లేదు వాణీ చెప్పు!"

"నాకు మిమ్మల్ని...మిమల్ని చూస్తే ఒక పెద్ద అండని చూసినట్టువుంటుంది. ఒక అన్నయ్య ఇంట్లో తిరుగుతూవున్నట్టుంటుంది"

"ఇప్పటికి నువ్వు ఎన్ని హత్యలుచేసి ఉంటావు వాణీ నువ్వు? అంటే సింహం రాబోట్‌లాటి ఇంకొకరితో కలసికాదు. నువ్వు స్వయంగా....?"

సందర్భంలేని ఆ ప్రశ్నకి ఆమె విస్తుపోయింది "మూడు...ఊహూ-కాదు

మరణిస్తే బతుకు బతికితే మరణం ఆపే నే సంఘం!


నాలుగు అం నాలుగే అనుకుంటా"

అతడు చాలా సేపు మాట్లాడలేదు. కారు నెమ్మదిగా సాగిపోతూంది. డ్రైవ్ చేస్తున్న అతడు కొంచెం సేపటి తరువాత ఏడుస్తున్న చప్పుడు వినిపించి తలతిప్పి చూశాడు. ఆమె చేతుల్లో మొహం దాచుకుని ఏడుస్తూంది. అతడు తిరిగి రోడ్డుమీద దృష్టి సారించి, ట్రాఫిక్‌ని తప్పిస్తూ "వెళ్ళగానేచేయవలసిన పన్లు చాలా వున్నాయ్ వాణి తొందరగా మామూలు మూడ్‌లోకి వచ్చెయ్ "అన్నాడు ...అండ్ సారీ ఇఫ్ ఐ హర్ట్‌యూ! ఏదో జ్ఞాపకం వచ్చి..."

ఆమె మాట్లాడలేదు.

"మొట్టమొదటి హత్య ఎప్పుడు చేశావ్ వాణీ నువ్వు?"

ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. తరువాత నెమ్మదిగా అంది "...సరిగ్గా గుర్తులేదు. పదకొండో-పన్నెండో వయసుంటుందనుకొంటా. నాన్న పాకలోకి అర్ధరాత్రి ఎవడినో తీసుకొచ్చాడు. నేనేడ్చేను. గోలపెట్టాను. అరగంట తరువాత పాక బైట గొడవ జరిగింది. తాగుడు లేకపోతే నాన్న మనిషికాడు. పది రూపాయలిమ్మని నాన్నా- పెద్దమనిషి అవని దానిదగ్గిరకు తీసుకొచ్చి పది అడుగుతావా అని వాడూ అరగంటపాటూ ఘర్షణపడ్డారు. వాడు నాన్నని పొడిచాడు. చూస్తున్న నాకు కోపం వచ్చి వాడ్ని వెనుక నుంచి పొడిచేసాను. తరువాత భయంవేసింది. అర్ధరాత్రి రోడ్డు మీద పరుగెత్తి పారిపోతూంటే మీ నాన్న కారెక్కించుకున్నారు"



చెప్పటం ఆపగానే కారంతా నిశ్శబ్దం!

"ఎంత నికృష్టమైన జీవితాలు వాణీ ఇవి! ఒక్కొక్క జీవితం వెనకున్న చరిత్రా తల్చుకుంటేనే వళ్ళు గగుర్పొడుస్తూంది. అయినా కూడా ఎంత ఇన్‌డిఫరెంట్‌గా బ్రతుకుతున్నామో!!! నేను చూడు. ఇన్నాళ్ళు కలిసివున్నా నీ గురించి ఒక్క విషయమూ తెలుసుకోలేదు. కానీ నేన్నీకో సలహా ఇవ్వనా...ఎప్పుడూ ఎవరి ముందు ఏడవకు వాణీ. ఒంటరిగా ఏడవటంకోసమే రాత్రిళ్ళు సృష్టించబడ్డాయి..." గుండె లోతుల్లోంచి వచ్చినట్టున్న ఆ మాటలకి ఆమె స్తబ్ధురాలై, మళ్ళీ వెంటనే సర్దుకుంది. "అబ్బే... ఎందుకో అలా ఊరికే ఏడుపొచ్చేసింది అంతే...నో ఐయాం ఆల్‌రైట్" అంది నవ్వుతూ మామూలు వాణి అయిపోయి! "... ఇప్పుడు నేను చాలా సుఖంగా ఉన్నాను. కావలసినంత డబ్బు స్వేచ్ఛ, సింహంతో స్నేహం.... ఆరోజు మీ నాన్నగారే తటస్థపడకపోయివుంటే ఎంగిలాకుల మధ్య తెల్లవారేది బ్రతుకు. చదువు చెప్పించి, పెంచి...పెద్దచేసి...

కావలసినంత స్వేచ్ఛ...పెంచి పెద్ద చేసి...

అతడికి రోమన్ రాజులు గుర్తొచ్చారు. గోదాలోకి దింపబోయే కొన్ని రోజుల ముందునుంచీ వెన్నా నెయ్యీ పెట్టి వాళ్ళ శరీరాల్ని నిగనిగా పెంచి ఆ తరువాత వాళ్ళపోరాటాన్ని ఆనందంగా తిలకించటం...

అతడేదో అనబోయి, బంగళా దగ్గిరపడటంతో ఆపుచేసాడు.

కారు పోర్టికోలో ప్రవేశించగానే నౌకరొచ్చి పురోహితన్‌నుంచి ఫోన్‌వచ్చిందని చెప్పాడు. కారు అక్కడ బయలుదేరి ఇక్కడికి వచ్చేలోపులో పురోహితన్ తిరిగి ఫోన్ చేసాడంటే...

వాణి అతడివైపు చూసింది.

ఇతడు సాధించలేనిదంటూ ఏమీలేదా?

అతడు ఫోన్ అందుకున్నాడు. అట్నుంచి పురోహితన్ కంఠంవినిపించింది.

"ఫైలంతా తెప్పించి చదివేను. టిఫిన్‌క్యారియర్ సంగతి తనకేమీ తెలీదనీ, విజయే ఎవరిదగ్గిరో అందుకుని లోపలికి పంపించాడనీ ఒక పోలీసు స్టేట్‌మెంటు ఇచ్చాడు. దానితో కేసు విజయ్‌మీదకు తిరిగింది".

"ఎవడా పోలీసు?"

"శివరామయ్య అనీ-"

అతడు వాణివైపు చూసాడు.

o o o o o o

అగ్గిపెట్టెలా వరుసగా వున్న పోలీసు క్వార్టర్సు మధ్య ఇరుకుసందు మొదట్లో రోల్స్‌రాయిస్ కారు ఆగగానే పిల్లలు చుట్టుముట్టారు. వాణి అందులోంచి దిగి క్వార్టరు నెం. 14 వైపు నడిచింది. ఇల్లు పైకి మామూలుగానే వుందికానీ లోపల స్టీరియోగ్రామ్ ఫోనూ అవి ఉన్నాయి. డబ్బు శుభ్రతని నేర్పదనటానికి తార్కాణంగా మాసిన బట్టలు, వస్తువులూ నేలమీద చిందరవందరగాపడివున్నాయి.

శివరామయ్య పెద్దమనవడితో ఆడుకుంటున్నాడు.

"హలో"

చెంపల మీదకు ఎగిరేజుట్టుతో, మెరిసే లిప్‌స్టిక్ పెదవుల్తో చిరునవ్వుతో ఇంటిముందు నిలబడ్డ ఆమెనిచూసి శివరామయ్య మతిపోయింది. ఎవరా అనుకు

$2 \times 2 = 6$... లెక్క తప్పినా 'కోడ్'లో ఒప్పే!!

న్నాడు. ఎక్కడో చూసినట్టువుండే అనుకున్నాడు.

" మీ పెద్ద మనవరాలు లేదా!

ఓహో! క్లాసు టీచరా అనుకున్నాడు. "లేదే. బయట ఎక్కడో ఆడుకుంటూంది. పిలవమంటారా...కూర్చోండి "

వాణి నవ్వుతూ కూర్చుంది.

"ఏమిటి విషయం చెప్పండి."

ఎవరో లోపల్నుంచి తొంగి చూసి మళ్ళీ వెళ్ళిపోయారు. ఆమె కుర్చీ వెనక్కి ఆనుకుని అన్నది-

"చాలా రోజులక్రితం ఒక కంటి ఆస్పత్రిలో ఒక పిల్లకి కుడి కన్ను ఆపరేట్ చేయబోయి ఎడమ కన్ను చేయటంతో ఆ వార్తని సంచలనంచేసి, పత్రికలు అమ్మకాలు పెంచుకున్నాయి. ఆ డాక్టర్లని అందరూ పురుగులకన్నా హీనంగా చూసారు. కానీ నిజానికి తప్పు...కంటిని "మార్క్" చేసినవాడిది. అలాగే మూడు సంవత్సరాలక్రితం ఒక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన రేప్‌కి ఆంధ్రదేశం అట్టుడికిపోయింది. ప్రతీవాడూ భారతమాతకి అన్యాయం జరిగినట్టూ ఫీలయిపోయాడు. ఒక పచ్చి వ్యభిచారిని పవిత్ర గృహిణిగా చిత్రీకరించి ప్రజల సానుభూతితో "వార్త"ని పత్రికలు "కథ" చేసి అమ్ముకున్నాయి. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే పత్రికలవల్ల చిన్నచిన్న విషయాలు అనవసర ప్రాధాన్యత,

పొందుతాయని అందువల్ల ప్రజలను వెంటనే చల్లబర్చటానికి ప్రభుత్వం తీసుకునే తొందరపాటు చర్యలవల్ల దానికి సంబంధంలేని వ్యక్తులు కూడా నష్టపోతారని... ఉదాహరణకి అర్ధరాత్రి రేప్ కేస్‌లో పోయింది ఇనస్పెక్టర్. అయితే రేప్ చేసి తప్పించుకున్నది ఒక కానిస్టేబుల్. అది మీరు."

అప్పటివరకూ మామూలుగా వింటున్న శివరామయ్య ఉలిక్కిపడ్డాడు. ఎప్పుడో చరిత్రలో శిథిలమైపోయిన వార్తని ఎవరో ప్రొద్దున్నే చుట్టపుచూపుగా వచ్చి తవ్వి తీయటం...

"మీరెవరు?" అని అడిగాడు.

ఆమె దానికి సమాధానం చెప్పకుండా అన్నది-"కొన్ని రోజులక్రితం మళ్ళీ అలాటి సంఘటనే జరిగింది. జైలు గోడలు బ్రద్ధలయినయి. ఏమీ తెలియని ఒక ఇనస్పెక్టరు సస్పెండు అయ్యాడు. దీనికి కారణం కూడా మీరే అయితే మీరు ఈసారి కూడా మామూలుగానే తప్పించుకున్నారు" అని ఆగింది.

"కానీ క్రితం ఇనస్పెక్టర్‌కీ ఈ ఇనస్పెక్టర్‌కీ తేడా వుంది శివరామయ్యగారూ...క్రితం ఇనస్పెక్టర్ పాపం దౌర్భాగ్యుడు. వెనుక ఎవరూ లేరు. కానీ విజయ్ వెనుక మేమున్నాం. మేము అంటే...మ్చ్...ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు. పోన్లెండి. ఇంతకీ మీకు కావల్సిందల్లా మీరు వెళ్ళి తప్పు వప్పుకోవటం.

కళ్ళు మెట్లమీద పరువు మరక!

అనవసరంగా సస్పెండయిన విజయ్‌కి బదులు అసలు మనిషి సస్పెండవటం."

శివరామయ్య హటాత్తుగా కుర్చీలోంచి లేచాడు. తను ఇంత వరకూ ఎక్కడ చూసానా అనుకుంటున్నాడు ఇంతసేపూ...గుర్తొచ్చింది. క్యారేజ్ తెచ్చిన అమ్మాయి ఈవిడ. గట్టిగా అరుస్తూ "నిన్ను అరెస్టు చేయిస్తాను... అరెస్టు చేయిస్తాను...." అన్నాడు.

వాణి తాపీగా బ్యాగ్‌లోంచి ప్లాస్టిక్ బ్యాగ్‌లోంచి ఒక ప్లాస్టిక్ పాకెట్ తీసి బల్లమీద పెట్టింది.

"ఏమిటిది?" అడిగాడు అనుమానంగా.

"చెవి. మీ మనవరాలిది"

శివరామయ్య కీచుమని "ఒసేయ్" అని అరుస్తూ లోపలికి పరుగెత్తబోయాడు. ఆమె కుర్చీలోంచి లేవకుండానే తాపీగా

"మీరు ఆలస్యంచేస్తే మీకే నష్టం. ప్రతి అయిదు నిముషాలకీ మా వాళ్ళని ఒకొక్కటి పంపమని చెప్పాను" అన్నది.

"దారుణం చిన్నపిల్లని చిత్రహింస పెడుతున్న నేరానికి నిన్ను అరెస్టు చేయిస్తాను."

"చిన్నపిల్లా-చిన్న పిల్లేమిటి?"

"అదే నా మనుమరాలు"



"మనవరాలా? మీకు మనవరాలుందా ఏమిటి?"

"నువ్విప్పుడు అన్నమాట ఆ చెవి"

"చెవా! చెవేమిటి"

"ఆ పాకెట్టు"

"పాకెట్టా? పాకెట్టేమిటి?"

"అదిగో అది. నువ్వు తెచ్చింది"

"నేను తేవటమేమిటి మనవరాలేమిటి? పాకెట్టేమిటి? చెవేమిటి? నేను మలేరియా డిపార్టుమెంట్ నుంచి వచ్చాను. మీ ఆరోగ్యం ఎలా ఉందని అడిగాను. మీరు లోపలికి వెళ్ళి ఏదో పాకెట్ పట్టుకొచ్చారు. ఎర్రగా కనబడితే ఆవకాయ ముక్కేమో అనుకున్నాను. ఇది చెవా? అయ్యో ఎంత పనిచేసారు. మలేరియా డిపార్టుమెంటు వాళ్ళకి కేవలం మీ ఆరోగ్యం ఎలా ఉందో చెపితే చాలండీ, అంగాంగాలు తీసుకొచ్చి చూపించనక్కరలేదు"

నవ్వింది.

శివరామయ్య బిత్తరపోయి చూడసాగాడు. అంతలో ఆమె మొహం కఠినంగా మారింది. "నన్ను అరెస్టు చేసి ఏమి నిరూపించగలవు శివరామయ్యా నువ్వు!" పుచ్చిపోయిన న్యాయ వ్యవస్థలో తుప్పు పట్టిన బోల్టులాంటివి నువ్వు నీలాంటి కుళ్ళిపోయిన వాళ్ళున్న ఈ సమాజంలో ఆటవిక న్యాయమే సరి అయినది. అడవిలో నేర నిరూపణలూ, న్యాయశాస్త్రపు గొడుగు క్రింద నీలాంటి క్రాస్టులు తలదాచుకోవటాలూ వుండవు. తప్పుకి శిక్ష మాత్రమే ఉంటుంది. ఈ దేశానికిప్పుడు కావలసింది ఆ ఆటవిక న్యాయమే! ప్రభుత్వపు బ్యూరోక్రసీని అడ్డుగా పెట్టుకుని ఇన్నాళ్ళూ తప్పించుకుంటూ వచ్చావు. ఈ రోజు నీ అదృష్టం బావోలేక మా బారిన పడ్డావు. మా దగ్గర ఎంక్వయిరీలూ, సస్పెన్షనులూ ఇవేమీ వుండవు. ప్రాణాలు తీయటమే...ఎంత తొందరగా నీ తప్పు ఒప్పుకుంటే అంత మంచిది! ఇంకొద్ది క్షణాలు ఆలస్యమవుతే మా రాబోట్ నీ మనవరాలి ముక్కు తీసుకొస్తాడు

ఆ తరువాత అయిదునిముషాలకి మా సింహం తల తీసుకొస్తాడు...ఈ విషయంతో మాకు ఏ విధమైన దయాదాక్షిణ్యమూ లేవు ఒప్పుకుంటావా లేదా ఏదో ఒకటి తొందరగా చెప్పు. ఒప్పుకోకపోతే ఈ రోజు నీ మనవరాల్ని, రేపు నీ మనవడిని!! నీ జీవితం నరకప్రాయం అవక తప్పదు...."

"ఒప్పుకుంటున్నాను-" హీనమైన కంఠంతో అన్నాడు శివరామయ్య.

"గుడ్." అంటూ లేచింది. అతడినెక్కించుకుని ఆమె కారు పురోహితన్ ఆఫీసుకి వెళ్ళటంకోసం బయల్దేరుతున్న సమయానికి, శివరామయ్య మనవరాలు లోపలికి పరుగెత్తుకు వచ్చి, "అమ్మమ్మా! తాతయ్య ఎక్కడికి వెళ్తున్నాడు" అని అడుగుతోంది. పోలీసు క్వార్టర్స్‌కి ఇటువైపున అప్పటివరకూ కార్లో చాకెట్లిచ్చి కూర్చోబెట్టుకున్న సింహం, వాణీ కారు కదలటం చూసి, పాపని వదిలిపెట్టేసాడు.

o o o o

బల్లమీద కొచ్చిపడిన కవర్‌ని చూసి తలెత్తి చూశాడు విజయ్.

అతడు ఎదుటి కుర్చీలో కూర్చుంటూ "నీ అర్డరు విజయ్! తిరిగి ఉద్యోగం లోకి తీసుకుంటూ" అన్నాడు. విజయ్ కళ్ళలో లిప్తమాత్రం ఆనందం కనపడింది చప్పున కవరు అందుకుని చింపి ఆర్డరు చదివాడు. చదివి "రొయ్యలగూడెమా" అన్నాడు.

ప్రేమ రాగానికి ఎబార్షన్ శృతి!

"అవును. ఇక్కడ ఉంచటానికి కుదరదట. తాత్కాలికంగా అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు... విజయ్! ఆర్ యు నాట్ హాపీ?"

"హాపీ.. యస్...యస్...యస్...ఐయామ్ హాపీ...నీకు కృతజ్ఞతలు చెప్పుకోవలసిన బాధ్యత కూడా నా మీద వుంది కదూ....థాంక్స్...థాంక్యూ!"

అతడ మొహం ఎర్రబడింది. "నువ్వు అంత వెటకారంగా మాట్లాడక్కర్లేదు విజయ్" అన్నాడు.

ఇందులో వెటకారం ఏమీలేదు. ఈరోజు నువ్వీ ఆర్డరు తెచ్చి వుండకపోతే రేపటినుంచీ పస్తులే నాపని. కానీ...కానీ...మూడురోజుల్లో కావాలనుకున్న వ్యక్తిని సస్పెండు చేయించటం-రెండ్రోజుల్లో తిరిగి ఆర్డరు తెప్పించటం, అదీ పోస్ట్‌లో కాకుండా చేసినవాడే తెచ్చిఇవ్వగలగటం—నాకు మతిపోతూంది. పిచ్చెక్కిపోతుంది"

"ఇంకా పిచ్చెక్కాలి, నీలాటి నిజాయితీ పరులకీ, తెలివైన వాళ్ళకీ ఇంకా పిచ్చెక్కాలి విజయ్. పడ్డున పడ్డ చేపల్లా వాళ్ళు గిలగిలలాడితేగానీ నేను కోరుకున్న పనిపూర్తికాదు. ఈ రెడ్‌టేపిజం మారదు! నీ విషయమే తీసుకో. మేమే కల్పించుకోకపోతే ఆ శివరామయ్య హాయిగావుండేవాడు. రక్తమూ, తుపాకీ, హంటర్ కావలసినవి ఇవే విజయ్! లేకపోతే జనం మాట వినరు. స్వయంగా ఈ హత్య చేసానని మీ నాన్న చెప్పినా ఏమీ చేయలేని చట్టం! ఈ చట్టపు పరిరక్షకుడిగా నష్టం! నువ్వూ ఏమీ చేయలేవు అదికూడా నేనే చేస్తాను చూస్తూ వుండు."

"ఎలా చేస్తావ్?"

"చూస్తావుగా" అంటూ లేచి తలుపు దగ్గిరగా వెళ్ళి ఆగి, "—మాలాటి వాళ్ళు మామూలు పనులు నిరాటంకంగా చేసుకునే భద్రత కల్పిస్తూ- ఈ వ్యవస్థని రక్షిస్తున్నాననే గొప్ప ఆత్మ సంతృప్తితో బ్రతుకుతున్న ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్! ...థాంక్యూ. నీ ఆత్మవంచన చెక్కు చెదరనంతకాలం మాకేం ఫర్వాలేదు" అని వెళ్ళిపోయాడు.

8

దేశపు రాజకీయాలు రోజు రోజుకీ అధోగతికి వెళ్ళసాగాయి. ముఖ్యంగా రాష్ట్రాల-కేంద్రాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టి రాష్ట్ర అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకునే వారు ఎక్కువ అవసాగారు. రాష్ట్రంలో జరిగిన ప్రతీ దానికీ కేంద్రాన్ని నిందించటం అలవాటయి పోయింది. దీనివల్ల తాత్కాలికంగా లాభం చేకూరినా, ప్రజలకి రాష్ట్రం వేరు, దేశంవేరు అన్న భావం ఏర్పడసాగింది. చాలా దారుణమయిన, అపాయకరమయిన ఆలోచన ఇది.

రాష్ట్ర నాయకులకి కావలసింది అదే.

కేంద్రంలో వున్న పార్టీ వేరేది...రాష్ట్రాల్లో దాన్ని వేళ్ళు పెరికేస్తే తప్ప

కేంద్రంలో అది కూలిపోదు. అదీ వాళ్ళ ఆలోచన. అందువల్ల కేంద్రం అన్యాయం చేస్తూంది అన్న ఆలోచనని ప్రజల్లోకి నెమ్మదిగా ఇంజెక్టు చేస్తున్నారు.

కేంద్రంలోవున్న పార్టీ నాయకులు ఇదంతా గమనిస్తూనే వున్నారు. ఆ పార్టీ వాళ్ళు కూడా నిజాయితీ పరులేం కాదు. మరింత కుళ్ళి పోయారు. ఎవరి స్వార్థం వాళ్ళది. ఏదో ఒకటిచేయమని వాళ్ళు ప్రధానమంత్రిమీద వత్తిడి తీసుకురాసాగారు.

ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక అధికారపార్టీ, ఒక బలమైన ప్రతిపక్షంవుండి మొదటిది "పాలిస్తూ", రెండోది దాన్ని "గమనిస్తూ" వుంటే, దేశం ప్రగతి పథం వేపు సాగిపోతుంది. కానీ ప్రస్తుతం అది తప్ప మిగతా అంతా జరుగుతూంది.

పార్లమెంటు ఎలక్షన్లు దగ్గిర పడసాగాయి

రాజకీయ నాయకుల్లో టెన్షన్ ఎక్కువైంది గాడిదలూ, గుర్రాలూ ఓట్లెయ్యటానికి తయారయ్యాయి. ఒకటి ఆలోచించటంలేదు. పార్లమెంటు సభ్యులుగా ప్రాంతీయ పార్టీలనుంచి ఎక్కువ సంఖ్యలో సభ్యులు ఎన్నికవుతే, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఎవరు నియమిస్తారు? పంచకోళ్ళ కషాయంలా తయారయ్యే ప్రభుత్వం దేశానికి ఏం చేయగలుగుతుంది?

ప్రాంతీయ పార్టీలన్నీ చాలా హుషారుగా ఆయత్తమవసాగాయి. నిజానికి ఈ ప్రాంతీయ పార్టీలు కొత్తవి కావటంవల్ల ఇంకా చిత్త శుద్ధి కోల్పోలేదు. నిజాయితీగా పనిచేస్తూ, ప్రజల అభిమానాన్ని సంపాదిస్తున్నాయి. కాని ఇక్కడ సమస్య పార్టీ

కాదు. దేశం !!!

ప్రజల్లో ఇంకా కేంద్రంపట్ల పూర్తిగా విశ్వాసం పోలేదని ప్రధాన మంత్రికి తెలుసు–దేశాన్ని ఏలగలిగేది తనపార్టీయే అన్న నమ్మకంవుంది. ఇనుము వేడిగా ఉన్నప్పుడే సాగదీసి అవసరమైన షేపులోకి తెచ్చుకోవాలి. ప్రధానమంత్రి సహచరులతో రహస్య సమాలోచన్లు జరిపారు. ఇంకోలా చేస్తే....

ప్రతీ ఓటరుకీ రెండు ఓట్లు ఉంటాయి. ఒక దానితో సెనెట్ మెంబర్ని రెండోదానితో ప్రెసిడెంట్ని ఎన్నుకోవాలి. అలాచేస్తే, ఓటర్లు సెనేట్ మెంబర్గా తమ ప్రాంతీయ వ్యక్తిని ఎన్నుకొన్నా రెండో వోటు తప్పకుండా "నేషనల్ ఫిగర్"కే వేస్తారు. కేవలం ఒక వ్యక్తికే ఆ నేషనల్ ఫిగర్ ఇమేజ్ వుంది. ఆవ్యక్తి ప్రధాన మంత్రి !!!

ఈ మార్చిన దాని ప్రకారం దేశాన్ని ప్రెసిడెంట్ ఏలతాడు. ప్రస్తుత ప్రధా స మంత్రికి ప్రెసిడెంట్ షిప్ రావటం ఖాయం. దేశపు సర్వాధికారాలూ చేతిలో ఉంటాయి. ప్రస్తుత పార్లమెంట్ పద్ధతి కొనసాగితే మాత్రం తిరిగి ప్రధానమంత్రి అవటం అనుమానమే.

ప్రధానమంత్రి ప్రెసిడెంట్ని కలుసుకున్నారు.

వైమానిక, నౌకా కాల్బలాల సైన్యాధికారులు అవసరమైతే రంగంలోకి

అరచేతిని అడ్డుపెట్టి 'పాలిటిక్స్'ని ఆపలేవు!

దూకటానికి తన సహకారం ప్రకటించారు. కానీ అంత అవసరం రాలేదు. పార్లమెంటులో పార్టీ బలం సరిగ్గా సరిపోయింది. ప్రతిపక్షాల సభ్యులు దాదాపు పిచ్చెక్కిపోయారు. అయినా ఏం చెయ్యగలరు? పార్లమెంటు రద్దయింది.

భారతదేశపు ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థని కాన్సిలు చేస్తూ, ఇక నుంచీ ప్రెసిడెంట్ తరహా పాలనలో దేశం నడుస్తుందనీ, దాని ఎన్నికలు త్వరలో జరుగుతాయనీ రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. నవంబరు 16 వ తారీఖు రాత్రి ఎనిమిదింటికి భారత రాజ్యాంగాన్ని చరిత్రాత్మకమైన మార్పుతో తిరగ వ్రాయటం జరిగింది

ముందు అనుకున్నట్టే ప్రధానమంత్రి ఒక కాండేట్గా పోటీకి నిలబడ్డారు. ప్రతిపక్షాలన్నీ కలిసి, తమలో నేషనల్ ఇమేజి వున్న వ్యక్తిని ఏకైక అభ్యర్థిగా నిలబెట్టటానికి నిర్ణయించుకున్నాయి. ప్రధానమంత్రికి ఎదురుగా నిల్చోగల అటువంటి వ్యక్తి ఒకరే.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి.

దేశం దృష్టి అంతా వీళ్ళిద్దరి మీదే కేంద్రీకృతమయింది. నామినేషన్లు వేసే ఆఖరి రోజు ఇంకా రెండు నెలలు ఉందనగానే పావులూ సిద్ధమయ్యాయి. ఈ పరమ సోపానంలో దేశపు అత్యున్నతస్థానం ఎవరు అవరోహిస్తారో కాలమే నిర్ణయించాలి. వాళ్ళిద్దరేనా...మూడోవాడు ఇంకెవరైనానా ? (ఇంకా వుంది)

కబుర్లూ- క్రాకర్ కాయలు

రావి కొండలరావు

'ఆర్యూ ఎ తెలుగూ మ్యాన్?' అని ఏ మాత్రం తెలుగుప్రాంతం కాని, ఎక్కడో ఒకచోట ఒకాయన మిమ్మల్ని తెలుగువాడిగా గుర్తుపట్టి అడిగాడనుకోండి- సందేహంలేదు, అలా అడిగిన ఆ ఆసామీ కచ్చితంగా తెలుగువాడే!

ఇంగ్లీష్‌పదం దొర్లకుండా ఒక పెద్ద సెంటెన్స్ నువ్వు మాట్లాడుచూద్దాం.." అన్నాడొకడు. "నీ ప్రశ్నలోనేవుంది ఇంగ్లీష్ ముక్క. ఇహనాచేత ఏమి చెప్పిస్తావు?- ఇంపాజిబుల్" అన్నాడు రెండో వాడు. 'మనం తెలుగువాళ్ళమ్ అయినా, ఇంగ్లీష్ మాట్లాడకపోతే, నేర్చుకున్న భాషంతా ఏమైపోయేట్టు?' అంటారు కొందరు వాపోతూ. తెలుగువాళ్ళ మీటింగుల్లో ప్రతిప్రెసిడెంట్‌గారూ ఇంగ్లీష్‌లోనే మాట్లాడతాడు. పైగా, 'నాకు తెలుగులో ప్రసంగించడం అంత అలవాటు లేదు' అంటాడు. అలవాటంతా ఇంగ్లీష్‌లోనే అయినట్టు. సాంస్కృతిక సభలూ, సమావేశాలూ జరిగినపుడు, అందులో పాల్గొనే వాళ్ళంతా తెలుగువాళ్ళే, వచ్చేవాళ్ళూ తెలుగువాళ్ళే అయినా ఇన్విటేషన్స్ అనబడే-ఆహ్వాన పత్రాలు ఇంగ్లీష్‌లోనే ఉంటాయి తెలుగుకథరాస్తే పైతైనన్ని ఇంగ్లీష్‌మాటలు దొర్లినట్టు- వ్యాసాల్లోనురోడ్డురోలర్లు దొర్లినట్టుదొర్లుతూవుంటాయి.

కొందరు ఉపన్యాసకులు కొంత వరకూ తెలుగులో మాట్లాడి, అక్కడి నుంచి ఆంగ్ల ప్రసంగంలోకి వెళ్ళిపోయి, ముక్తాయింపుకి తెలుగులోకి వచ్చేసి "నాకీ అవకాశం ఇచ్చిన..." అని పూర్తిచేసి "థాంక్యూ" అని కూచుంటాడు. 'నాకు సరిగా తెలుగురాదు' అని చెప్పుకోవడం మనకదో గొప్ప! 'మావాడికి తెలుగు చదవడం రాదండీ! కాన్వెంటు స్కూలు గదూ' అని గొప్పగా చెప్పుకోవడం ఇంకా గొప్ప! అంతెందుకూ ఆ మధ్య మద్రాసులో అఖిల భారత తెలుగు మహాసభలు జరిగాయా—చాలామంది ఆంగ్ల ప్రసంగాలే చేశారు—ఆసభలో పాల్గొన్న తమిళనాడు మంత్రి హాండే మాత్రం తెలుగులో మాట్లాడాడు! అదీ జోకు! ఇంకా జోకేమిటంటే, భారతియార్ 'సుందర తేలింగినిల్ పాట్టుసెయువోమ్ అని తెలుగును మెచ్చుకున్నాడనీ, తెలుగును "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అన్నారనీ, "దేశ భాషలలో తెలుగు లెస్స!" అనే- ఓ పక్క నుంచి చెబుతూనే, ఆంగ్లంలోనే మాట్లాడతం! "చేయెత్తి జైకొట్టు తెలుగోడా" అన్నట్టు భాషని నిద్ర పుచ్చేస్తున్నాం? ●●●



చీకటిని కాటుకడిగి
వెన్నెల్ని అద్దమడిగి
చంద్రుణ్ణి బొట్టెట్టి....

వై. సంగీతారెడ్డి

విజ్ఞాన జ్యోతి

> *సెంటిమెంటు రోమాన్సు వగైరా కథలే కాకుండా కాసింత విజ్ఞానాన్ని కూడా పంచాలనే ఉద్దేశంతో ఈ విజ్ఞాన జ్యోతి శీర్షిక—*
>
> *పాఠకులకి ఉపయోగపడే ఏ రచనకైనా ఇందులో స్థానం లభిస్తుంది. వెంటనే పంపండి.*
>
> *—ఎడిటర్*

ఎ.శారదాకుమార్

కాలేజీ అటెండరు ముకుందం

పెద్దసైజు గ్రూపు ఫోటోలో తన విగ్రహాన్ని చూసుకుంటూ మురిసిపోతున్నాడు. నేను దగ్గరకుపోయి నిల్చున్నాను. అందులో మన గవర్నరుగారూ, విద్యామంత్రి ప్రిన్సిపాల్‌గారు అంతా దండలు ధరించి కూర్చుని వున్నారు. బాటనీ డిపార్టుమెంటులో అటెండరుగా పని చేస్తున్న ముకుందం చివరివరసలో మెడ పక్కకి తిప్పి నిల్చుని వున్నాడు. "మన గవర్నరుగారు కూడా వున్నారు చూడండి" అన్నాడు ముకుందం.

నిజమే! మొదట ముకుందమూ ఆ తర్వాత గవర్నరుగారు కూడా దండలు మెళ్ళో వేసుకుని బుకేలు చేత పట్టుకుని ముందు కూర్చున్న పెద్దలందర్నీ వెనక్కి నెట్టేసింది ముకుందంలోని "నేను." ఈ ముకుందం సంగతి పక్కకి పెడదాం. ఫోటో స్టూడియో నుంచి మీరున్న గ్రూప్ ఫోటో తెస్తే ఆ ఫోటోను చేతిలోకి తీసుకుని మీరంటే మీరు ఏంచేస్తారో చెప్పండి ముందుగా ఎవరి ఫోటో చూస్తారూ? నే చెప్పనా? తొట్టతొలిసారిగా మీ కళ్ళు వెదికేది ఆ గ్రూపులోని మీ సుందర ముఖారవిందం కోసమే. ఆ తర్వాతనే మీ ఆఫీసరయినా ప్రిన్సిపాలైనా, మేయరైనా, గవర్నరైనా మరొకరైనా, ముచ్చటగా మొదట మీరూ ఆ తర్వాత ఈ ప్రపంచమూ... కదూ?

న్యూయార్కు టెలిఫోన్ డిపార్ట్‌మెంటు వాళ్ళు ఒక సర్వే నిర్వహించారట. ఇంతమంది ఆసాములు ఫోన్లు వాడుకుంటున్నారే, ఇన్నిన్ని మాటలు మాట్లాడేసుకుంటున్నారే, అన్నిట్లోకి ఎక్కువసార్లు వీళ్ళు ప్రయోగించే ఏకైక పదరాజం ఏమిటి అన్నది వాళ్ళ పరిశోధన. "నేను, నేను...ఆ" అదీ. ఈ "నేను" దొరికింది వాళ్ళకు జనం మనసుల్ని ఆక్రమించుకుని నోట్లోంచి దూసుకొచ్చే మాటగా.

అస్సాంలో ప్రాంతీయ మూఢత్వం చేస్తున్న ఆగడాలను గురించో, పంజాబులో మతమౌఢ్యం చేస్తున్న దారుణ


మారణహోమం గురించో మా ప్రక్క-వాటా ప్రకాశం పేపర్ పట్టుకుని మరీ నాతో చర్చలకు వస్తాడు. ఇవన్నీ నాకు పట్టవని ఎన్నిసార్లు చెప్పినా వినిపించు కోడే ఆ మానవుడూ! ఇండియా విదేశాలకు రుణపడివున్న రెండువేల కోట్ల రూపాయల పద్దుకన్నా మా ఆవిడ బట్టల దుకాణంలో చేసిన రెండువందల బాకీ నాకు ముఖ్యం. సరిహద్దులో పాకిస్తానీ యుద్ధ సన్నాహాలకంటే నా పంటినొప్పి నాకు ప్రధానం కాదంటారా?

సలుపుతున్న నా పిప్పి పన్ను పది అంతర్జాతీయ సమస్యల పెట్టు కాబట్టి పేపర్ చదవడం కట్టిపెట్టు ప్రకాశం అంటూ సీరియస్‌గా సూత్రీకరిస్తాన్నేను. అదే అతనికి పెద్ద జోక్‌గా కన్పిస్తుంది! "ఈ లోకంలో నీకో చక్కటి ద్వీపం ఉండి అందులో నీవు రాబిన్‌సన్ క్రూసో వలె బ్రతగ్గలిగితే నీకీ పొరుగు గొడవలు చెప్పి వేధించనురా అబ్బీ! సమాజం నీకు ఎంతో కొంత యిస్తున్నది. పరోక్షంగానైనా నీకు కూడూ, గుడ్డా సమకూరుస్తున్నది. కానుపు దగ్గర్నుంచి కాలుపుదాకా పొరుగువాళ్ళు లేకుండా నీ బ్రతుకు తెల్లారటంలేదని తెలుసుకోమని నన్ను నిగ్గదీసి వేధిస్తాడు ప్రకాశం. నేను సృజించని సమాజాన్ని నేను శాసించనూ లేను. నా కోసం ఈ కాస్త కాలం తెల్లవార్చుకుంటే సరిపోతుందికదా అంటాను నేను. ఉడుత కెందుకయ్యా ఊళ్ళో వార్తలూ అని నేనంటే "ఏం నీవు ఉడుతవా" అని ఉడికిస్తాడు అతడు.

ఈ వ్యవస్థలో ఒక సగటు మనిషి సానుభూతి సహాయాలూ అతని పొరుగు వాళ్ళకు కావల్సిన దానికంటే పొరుగు వాళ్ళ సానుభూతీ సహాయమూ అతనికే ఎక్కువ అక్కర అనిపిస్తుంది మనకు. కాని తాను ఆ విధంగా ఎదుగూ బొదుగూ లేకుండా పడిఉండటానికి ఈ సామాజిక వ్యవస్థా, ఈ ఆర్థిక రాజకీయ వ్యవస్థలూ ఎంతమేరకు కారణమన్న విషయాన్ని అతడు గ్రహిస్తే చాలా మంచిది. పుట్టక ముందే తాను మోసగించబడ్డాననీ, కాలు ముందుకు పెట్టకముందే చతికిలపడి వున్నాడనీ, సగటు మనిషి అవగాహన చేసుకోకుండా ఉన్నంతకాలం ఈ వ్యవస్థ గాని వీళ్ళ అవస్థలుగాని ఏనాటికీమారవు. ఈ అవగాహన లోకోద్ధరణం కోసం కాదు, తనకోసమేనని అతడు తెలుసుకోవాలి. దీన్ని దూరపు చూపుగల స్వార్థమన్నా సరిపోతుంది.

అందరికి నేను ముఖ్యం. ఎవరీ నేను? ఎందుకి నేనుని ఈ నా "నేను" వెనకాల ఏముంది? వివేకానందస్వామివారి నేను వెనకాల, హిట్లర్ నేను వెనకాల మన యింటిపక్క సన్యాసిరావు నేను వెనకాల ఏముంది! ఒక్కమాటలో చెప్పాలంటే ప్రాముఖ్యంకోసం తహ తహ, డిజైర్ ఫర్ ఇంపార్టెన్స్!

అయితే మనిషికీ, మనిషికీ ఈ ఆత్మ ప్రాముఖ్యతాభావపు పోకడలు మారుతుంటాయి. వెనుకటికి జ్వాలాపతి అనే గజదొంగ ప్రకాశంజిల్లాలో ఉండేవాడు. నేనెవరో తెలుసా జ్వాలాపతిని. అయినా నిన్నేమీ చెయ్యనులే! అనేవాడట "ఎవరైనా అమాయకుడు తటస్థపడితే అతడి గర్వం, ఆత్మ ప్రాముఖ్యతాభావం తానొక పెద్ద గజదొంగ నన్నదాన్లో వుంది.



సమాజానికి కావలసిన "నేను"లు సామాజిక సంక్షేమం కోసం పుబలాటపడే "నేను"లు మాత్రమే ఏం జరిగితే అదే జరుగుతుంది లెద్దూ అనేవాళ్ళు చెదలు వలె పుట్టి చెదలువలెనే రాలిపోతారు.

ఇక అలాటి వాళ్ళతో నిండివున్న సమాజం శరవేగంతో కుప్పుబారి పోతుంటుందని మనకుస్పష్టంగా తెలుసు. మనభారత దేశం ఈవిధంగా తగలడ్డానికి కారణం ఇది.

"పాతమతాలు భగవంతుని నమ్మనివాణ్ణి నాస్తికుడన్నాయి. కాని యీకొత్తమతం తన శక్తిని తాను నమ్మనివాణ్ని నాస్తికుడు అంటుంది అన్నారు వివేకానంద స్వామి. ఆత్మవిశ్వాసం లేనివాడు నాస్తికుడని స్పష్టపరిచారాయన.

పురాణాల్లో చెప్పిన ముప్పయిమూడు కోట్ల దేవతలమీదా ఇంకా విదేశీయిలు మనకు పంపకం చేసిన విదేశీదేవతల మీదా నీకు ఎంత విశ్వాసం వుందో, అందులో వందోవంతు నీమీద నీకు వుంటే తప్ప నీకు మోక్షంలేదుఅన్నారు వివేకానందస్వామి.

ఘనకార్యాలను సాధించడానికి సంసిద్ధమయి వున్న "నేను" మీకున్నదా? అయితేమీ "నేను" అద్భుతంగావున్నది. నేనెందుకూ పనికిరానని నీరు కారిపోయే 'నేను' మీలో వుందేమో చూచుకోండి అప్పుడు మీ "నేను" శుద్ధ బేవార్సు "నేను" అన్నమాట.

ఇలా నేను ఫలానా విధమయిన "నేను" వున్నవాణ్నని మీరు ఆత్మ విశ్లేషణతో మీ సెల్ఫ్ ఇమేజ్‌ని ఓసారి భావ దృష్టితో తేరిపారచూడండి. జీవితంలో ముందడుగు వెయ్యడంలో ఈ పరిశీలన మీ కెంతైనా ఉపయోగపడగలదు. ●


అబ్బబ్బ! మావాడి తపన చూడడం నాతరం కాదు బాబూ. ఎంతగా అల్లలాడి పోతాడో పాపం. చూశారా, స్కూల్నించి వస్తూ శుబ్భరంగా తడిశాడు... ఈ పాపిష్ఠి జలుబు తెచ్చుకున్నాడు.



పోయినసారి వాడు తడిసొచ్చినప్పుడు భయంతో నాకు వణుకు పుట్టింది. ఆ తుమ్ములూ, ఆ ముక్కు కారడం. అబ్బ! ఇక వళ్లంతా నొప్పులని అన్నాడు. నేనేమో వెంటనే వాడి వళ్లు తుడిచి పక్క మీద పడుకోబెట్టాను. ఆపైన విక్స్ వేపోరబ్ వాడి ముక్కుపైనా, గొంతుపైనా, ఛాతీ పైనా, ఇంకా వీపుపైన కూడా బాగా రాశాను. విక్స్ చలవే అనాలి...నా బాబు రాత్రంతా చక్కగా నిద్రపోయాడు. తెల్లారగానే హుషారుగా స్కూలుకు వెళ్లటానికి తయారయాడు. ఏమిటీ, వాడి జలుబా! అదిగో...
హాంఫ్ కాకి!
ఇంక నాకేం దిగుల్లేదమ్మ!
ఎప్పుడూ పనిచేసే విక్స్ వేపోరబ్ సీసా
తయారుగా దగ్గరుంచుకుంటా,
నా బాబు హుషారుగా ఉంటాడని తెలిసి
తృప్తిగా ఉంటా!

విక్స్ ఇచ్చే అభయం మీ ఆప్యాయతకు సమానం

విక్స్ వేపోరబ్ జలుబు లక్షణాల్ని త్వరగా తగ్గిస్తుంది. ఎందుకంటే దానిలో రెండు విధాల పనిచేసే శాస్త్రీయ సూత్రం ఉంది. దాని ఔషధ యుక్త ఆవిర్లు మీ శ్వాసనాళాల్ని తెరిచి హాయిగా గాలి పీల్చుకోనిస్తాయి. ఇక దాన్ని చర్మంపై రాసినప్పుడు ఒళ్లు నొప్పులు ఉపశమిస్తాయి. అందుకే, అది కుటుంబానికంతటికీ అతి విశ్వసనీయమైన జలుబు మందయింది.



విక్స్ వేపోరబ్

ఇస్తుంది హాయిగా ఊపిరిపీల్చుకునే
లాంటి ఉపశమనం
ఇక కులాసాగా ఉండగలిగే అనుభవం.

RHL-20/84 TEL R



శ్రీ రామోజీరావుతో ఇంటర్వ్యూ

——ఈనాడుకి ఒక చరిత్ర ఉంది. 35 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్(ఐ)ని గద్దెదించేందుకు ఎన్టీఆర్ కు తోడ్పడటమే ఆ చరిత్ర.

ఇది సామాన్యమయిన విషయంకాదు. డెమొక్రసీలో పత్రికల పాత్ర ఎంత గొప్పదో ఋజువు చేసే చరిత్ర.

అలాంటి చరిత్రను సృష్టించిన 'ఈనాడు' సంపాదకులు శ్రీ రామోజీరావ్ తో జ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ——

మిమ్మల్ని పత్రికారంగంవేపు దృష్టి సారించేందుకు ప్రేరేపించిన సంఘటన ఏమైనా ఉందా?

జ. ప్రత్యేకంగా సంఘటనంటూ ఏమీలేదు. మంచి పత్రిక అవసరం ఉందనిపించింది. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ రాష్ట్ర శ్రేయస్సుకోసం కృషిచేసే పత్రికను తెలుగువాళ్ళు తప్పక ఆదరిస్తారన్న నమ్మకం కలిగింది. ఆ నమ్మకమే "ఈనాడు" ఆవిర్భావానికి కారణమైంది.

ప్రపంచంలో ఎన్నో రకాల లాభసాటి వ్యాపారాలుండగా మీరు న్యూస్ పేపర్ ఫీల్డ్ కు ఎందుకు ప్రాముఖ్యత ఇచ్చారు?

జ. కేవలం వ్యాపార దృష్టితో ఈనాడును ప్రారంభించానని మీరు అనుకొంటే పొరపాటు.

పత్రికలు డెమొక్రసీలో "వాచ్ డాగ్" పాత్ర నిర్వహించాలంటారు. మరి మనదేశంలో అవి ఈ పాత్రను ఎంతవరకూ నిర్వహిస్తున్నాయి? ఈనాడు ఎంతవరకూ విజయం సాధించింది?

స్థూలంగా చెప్పాలంటే మన పత్రికల్లో చాలా భాగం వాచ్ డాగ్ పాత్రను నిర్వహిస్తూనే ఉన్నాయి. ఈనాడు ఈ విధి నిర్వహణలో ఎంతవరకూ కృతకృత్యం అయిందో చెప్పాల్సింది ప్రజలు, పాఠకులు. మా పరిధిలో మేం చేయగలిగింది చిత్తశుద్ధితో చేస్తున్నామని మాత్రం నేను చెప్పగలను.

పత్రిక నడపడం వ్యాపారం కాదని మీరు భావిస్తున్నారా?

జ. ఈ ప్రశ్నకు సమాధానం... కాదు, అవును! కేవలం వ్యాపారంకోసం పత్రిక నడపడం సరికాదని నా అభిప్రాయం. పత్రికకు ఒక ఆశయం ఉండాలి. లక్ష్యశుద్ధి ఉండాలి. అయితే ఏ పత్రికైనా నాలుగు కాలాలపాటు మనగలగాలంటే ఆర్థికంగా కూడా నిలదొక్కుకోవాలి

కాకపోతే నైతిక విలువలకు కట్టుబడి, ప్రజలపట్ల విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించడం పత్రికకు ప్రధానం కావాలి. ఆ తరువాత వ్యాపారం సంగతి చూడాలి. లాభాలకోసం పత్రిక కాదు...కానీ పత్రికకు లాభాలు కూడా కావల్సిందే.

ఈనాడులో కనిపించేది మంచి జర్నలిజమని మీరనుకొంటున్నారా?

జ. ఈనాడు తనకుతాను నిర్దేశించుకున్న మార్గంలో ముందుకు సాగుతోంది. ఇందులోని మంచి చెడ్డలు నిర్ణయించాల్సింది ప్రజలు, పాఠకులే. తన అవధుల మేరకు, శాయశక్తులా ఈనాడు ప్రజలకు సేవచేస్తున్నదనే నా విశ్వాసం. అయితే చేసి దానితో తృప్తిపడను. చేయాల్సింది, సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందనే నేను అనుకుంటున్నాను.





వార్తను వార్తగా కాకుండా మీ సొంత దృక్పథంతో గమనించి ఓ కథలాగా అల్లి ప్రజలకు అందించడం సరైన పద్ధతేనా?

జ. మీ ఆరోపణ సరికాదు. వార్తను వార్తగా ఇవ్వాల్సిందే. కాని ఇది నిస్సారంగా, చదువరులకు విసుగు పుట్టించే విధంగా ఉండకూడదు. సామాన్య పాఠకుడికికూడా సులభంగా అవగాహన అయ్యేరీతిలో వార్తల్ని ఇవ్వాలని మా ప్రయత్నం. అవకాశం ఉన్నచోట వార్తాకథనం పాఠకుల్లో ఆసక్తిని ఉత్సుకతను రేకెత్తించేలా ఉండటంలో తప్పులేదు. వార్తాకథనంలో మాకు విలక్షణమయిన శైలి ఉండవచ్చు. ఆ కారణంచేత మేం వార్తల్ని, వాస్తవాల్ని తారుమారు చేస్తామనటం న్యాయంకాదు.

ఈనాడులో మీరు ప్రయోగిస్తున్న జర్నలిజం 'న్యూస్‌టైమ్'లో ఎందుకు కనిపించడంలేదు?

జ. ఈనాడు పాఠకులు వేరు, న్యూస్‌టైమ్ పాఠకులు వేరు. ఈనాడు పరిధి వేరు, న్యూస్‌టైమ్ పరిధివేరు. పాఠకుల అవసరాలు, అవగాహన స్థాయి దృష్టిలో ఉంచుకునే పత్రికల శైలి, విషయం నిర్ణయం అవుతాయి.

ఈనాడులో తరుచుగా పోలీస్ శాఖ అత్యాచారాల గురించిన వార్తలు కనబడుతుంటాయి. ముఖ్యంగా పోలీసు లాకప్‌లో నిందితులమీద జరిగే హింసాకాండను తీవ్రంగా గర్హిస్తుంటారు. మరోపక్క పోలీసుశాఖ అసమర్థతలను అంటే పెరిగిపోతున్న దొంగతనాలను, నేరాలను అరికట్టలేకపోవడం గురించి విమర్శిస్తుంటారు. పోలీసులు నిందితులను హింసించకుండా సమర్థవంతంగా పని చేసేందుకు మీరేదయినా పరిష్కారం సూచించగలరా?

జ. పోలీసు లాకప్‌లో హింసాకాండను గర్హించడానికీ, పోలీసుశాఖ అసమర్థతను విమర్శించడానికీ మధ్య వైరుధ్యంలేదు. దొంగతనాలు, నేరాలను అరికట్టాలంటే పోలీసు లాకప్‌లో నేరస్తుల్ని నరకయాతనపెట్టడాన్ని ఈనాడు వ్యతిరేకిస్తుంది. అలా చిత్రహింసలు పెట్టే హక్కు పోలీసులకు లేదనే మా అభిప్రాయం.

నేరస్తుల్ని శిక్షించి, హింసించే హక్కు పోలీసులకు లేదు. పోలీసుశాఖ సజావుగా పనిచేయడానికి పరిష్కారం ఏమిటని మీరు అడిగారు. చెప్పాలంటే మహాగ్రంథం, ఈ చిన్న ఇంటర్వ్యూలో వివరాల్లో కెళ్ళడం సాధ్యమయే పనికాదు. ఒకటిమాత్రం నిజం పకడ్బందీ వ్యవస్థ, సమర్థ యంత్రాంగం, బాధ్యత గుర్తెరిగిన సిబ్బంది ఉన్నప్పుడే పోలీసు డిపార్టుమెంటు బాగుపడుతుంది.

తీవ్రవాదుల కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి మీ అభిప్రాయం ఏమిటి?

జ. తీవ్రవాదుల దౌర్జన్యాన్ని గర్హించాల్సిందే. అరికట్టాల్సిందే. హింస ఏ రూపంలో జరిగినా, ఎవరు చేసినా గూండాలు చేసినా తప్పే...నక్సలైట్లు చేసినా తప్పే. అయితే తీవ్రవాదులను అరికట్టడంలో ప్రభుత్వం తీసుకొనే చర్యలన్నీ సమంజసమని చెప్పలేము. ఏమైనా శాంతిభద్రతల్ని పరిరక్షించడం ప్రభుత్వ ధర్మం. అయితే ప్రభుత్వ చర్యలు కూడా చట్టం పరిధిలోనే ఉండాలి.

ప్రత్యేక రాయలసీమ నినాదం గురించి మీరేమంటారు? అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నట్టుగా రాయలసీమ నిజంగా నిర్లక్ష్యం చేయబడిందా? నిర్లక్ష్యం చేయబడినట్లయితే తెలుగుదేశం పార్టీకి సహకరించినట్టుగా, మీరీ ఉద్యమానికి ఎందుకు సహకరించడం లేదు?

జ. రాష్ట్రం సమైక్యంగా ఉంటేనే బహుముఖంగా అభివృద్ధి చెందుతుందని మా నమ్మకం. ప్రాంతీయతత్వం ఎవరికీ క్షేమంకాదు. "ప్రత్యేక రాయలసీమ" అన్నది సాధ్యాసాధ్యాలనూ, మంచిచెడ్డలనూ ప్రశాంతంగా పరిశీలించి ఇచ్చిన నినాదం కాదు. తరతరాలుగా రాయలసీమను నిర్లక్ష్యం చేసినమాట నిజం. కాని అందుకు బాధ్యత నిన్నగాక మొన్న అధికారంలోకి వచ్చిన తెలుగుదేశానిది ఎలా అవుతుంది? మూడున్నర శతాబ్దాలకుపైగా రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పాలకులే అసలు దోషులు. ఏమైనా ఇప్పుడు చేయాల్సింది రాష్ట్ర ప్రగతికి సమైక్య కృషి. సంకుచిత దృక్పథం అనర్థదాయకం.

మనదేశ పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి మన రాజ్యాంగం ఏర్పడింది. ఈ రాజ్యాంగాన్ని మన రాజకీయనాయకులు ఎమర్జెన్సీ పేరుతోనూ, సభా హక్కుల పేరుతోనూ అవహేళన చేయడం జరుగుతోందన్న అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?

ఎంతోమంది తెలుగు ప్రజలను ప్రభావితం చేయగల మీ పత్రిక ద్వారా ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొన దలచుకున్నారు?

జ. రాజకీయ నాయకులు ప్రజాస్వామ్యం గురించి ఎన్ని కబుర్లు చెప్పినా ఏదో కొద్దిమంది తప్ప పౌరహక్కులను నిజంగా గౌరవించేవారుఅరుదు. అంతకు ముందుదాకా ప్రభుత్వాన్ని విమర్శించిన వారు కూడా తమను ఇతరులు విమర్శిస్తే సహించలేరు. ఇవాళ ప్రాథమిక





హక్కులకు భంగం కలుగుతున్నమాట రాజ్యాంగానికి అపచారం జరుగుతున్న మాట వాస్తవం. ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి, ప్రజాస్వామ్యం నిలదొక్కుకోడానికి ప్రభుత్వం దయాధర్మాలమీద ఆధారపడి లాభం లేదు. ప్రజాచైతన్యమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. ఆ చైతన్యాన్ని పెంపొందించడం పత్రికల బాధ్యత.

వార్తాపత్రికలు కేవలం ఆయా ఎడిటర్ల పక్షపాతధోరణులను ప్రతిబింబిస్తాయన్నది కేవలం అపవాదా, నిజమా?

నిజమైతే వ్యక్తిగత అభిప్రాయాలను పాఠకుల మీద రుద్దడం సమంజసమేనా?

జ. మనుషుల్లో వేరువేరు ప్రవృత్తులున్నట్టే పత్రికల్లోకూడా విభిన్న ధోరణులుండవచ్చు. పత్రికాప్రమాణాల్లో హెచ్చుతగ్గులుండవచ్చు. అన్ని పత్రికలనూ ఒకే గాట కట్టలేము. జనసామాన్యానికి మేలుచేసేరీతిలో ప్రజాభిప్రాయాన్ని సమీకరించడం పత్రికల ధర్మం. సంపాదకుడు పత్రికకు సారథి. ప్రజాప్రయోజనాల దృష్ట్యా తాను మంచిదని నమ్మిన విషయాన్ని పత్రికద్వారా ప్రజలముందుంచడం అతని బాధ్యత అంత మాత్రాన తన అభిప్రాయాలను పాఠకులమీద రుద్దినట్టు భావించడం పొరపాటు.

ఇక్కడో సంగతి గుర్తుంచుకోవాలి. జనాభాలో అత్యధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు, నిరుపేదలు అయిన మన దేశంలోని పత్రికలకు పాశ్చాత్య దేశాల పత్రికల ప్రమాణాలు వర్తించవు. మన పత్రికలమీద ఉన్న బాధ్యత గురుతరమయింది. మనదేశంలో ఇప్పుడున్న రాజకీయ సాంఘిక, పరిస్థితుల్లో పత్రికలు కేవలం సంఘటనలకు దర్పణంగా ఉంటే సరిపోదు. అవసరమయినప్పుడు ప్రభుత్వానికి ప్రతిపక్షంగా, ప్రజలకు మార్గదర్శకులుగా, ప్రజాభిప్రాయ నిర్దేశకులుగా కూడా వ్యవహరించాలి.

ఇక్కడ కొన్ని పత్రికలు చెడుద్వారాకూడా ప్రజల ఆలోచనా సరళినీ, జనజీవన పరిణామాలనూ ప్రభావితం చేసే అవకాశం ఉంది కదా?

జ. ఉండవచ్చు. కానీ దానిని మరో ప్రచారసాధనమేదయినా ఖండించాలి. లేదా మిగతా పత్రికలు ఎదుర్కోవాలి.

13. ప్ర. కొన్ని పాశ్చాత్యదేశాలలో పార్లమెంటు లేక శాసనసభా సమావేశాలు టి. వి. ద్వారా ప్రజలందరూ ప్రత్యక్షంగా గమనించేందుకై సౌకర్యం కలగజేశారు. మన దేశంలో అలాంటి పద్ధతి ప్రవేశ

పేడితే ప్రజలు పత్రికల పక్షపాత ధోరణులకులోనుకాకుండా నిజానిజాలు తెలుసుకునే అవకాశం ఉంటుందా? తిట్టుకోవడం, కొట్టుకోవడం, చెప్పులు విసరడం, మైకులు లాక్కోవడం వంటి అసభ్య ప్రవర్తనలకు పేరెన్నికగన్న మనదేశ శాసనసభల సమావేశాల్ని టెలికాస్టు చేయడానికి భారత ప్రభుత్వం ఒప్పుకుంటుందా?

జ. శాసనసభల సమావేశాల విశేషాలను పత్రికలుపక్షపాతంతో చిత్రిస్తున్నాయన్న ఆరోపణ తప్పు. సభల్లో జరిగే ముఖ్యమయిన కార్యకలాపాలను ప్రజలకు వివరించడం మాత్రమేపత్రికలుచేస్తాయి. సభా కార్యక్రమాలను యథాతథంగా టెలికాస్టు చేస్తే మంచిదే. దానివల్ల తాము ఎన్నుకొన్న ప్రతినిధులు ఎంత సజావుగా విధినిర్వహణ చేస్తున్నారో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తారు. తమ ప్రజాప్రతినిధుల నిర్వాకాన్ని బట్టి తరువాతి ఎన్నికల్లో తగిన తీర్పు ఇస్తారు. సభా కార్యక్రమాలను టి. వి. లో చూపాలావద్దా అన్న నిర్ణయం తీసుకోవాల్సింది భారత ప్రభుత్వంకాదు. పార్లమెంటు, శాసనసభలే ఆ సంగతి తేల్చాలి.

"ఈనాడు" ఈ విషయంలో ఎందుకు చొరవ తీసుకోకూడదు?

జ. మేము ఈ విషయం గురించి అదివరకే సంపాదకీయంగా కూడా రాశాము.

కానీ అంత పెద్దసమస్యలకు ఆ మాత్రం ప్రేరేపణ సరిపోతుందా?

జ. చాలదు. కానీ ఇలాంటి విషయాన్ని ఎన్నికల సమయంలో చేపట్ట



టం భావ్యంగా ఉంటుంది. తమపార్టీ ఎన్నికల ప్రణాళికలో ఎవరయినా దీనిని చేర్చుకుంటే మంచి ఫలితంఉండవచ్చు.

మీరు ఏవేవో అద్భుతాలు ఊహించుకొని, ప్రచారంచేసి ఎన్టీఆర్ పదవిలో కొచ్చేందుకు తోడ్పడ్డారు కదా! మరిప్పుడు ఎన్టీఆర్ కూడా బంధుప్రీతితో పార్టీల ఘూర్పిడిని తానే స్వయంగా ప్రోత్సహించడం చంద్రబాబునాయుడు, జయకృష్ణలకు అసాధారణ సౌకర్యాలను కలగజేయడం మరో అల్లుడు వెంకటేశ్వరరావుకు పార్టీ టికెట్టు ఇవ్వడంలాంటి అనేక చర్యలకి పాల్పడ్డారు. దీనికి మీరు ఎలా స్పందిస్తారు? ఒకప్పుడు సంజయ్ గాంధీ, ప్రస్తుతం రాజీవ్ గాంధీలకు పట్టం కట్టేందుకు శ్రీమతి గాంధీ చేస్తున్న ప్రయత్నాలను విమర్శించిన మీరు ఇప్పుడు ఎన్టీఆర్ విషయంలో మౌనంగా ఎందుకు ఉంటున్నారు?

జ. మేము మౌనంగా ఉంటున్నామన్న అభియోగం నిజంకాదు. శ్రీమతి ఇందిరాగాంధీకి ఒకనీతి, ఎన్టీఆర్‌కు ఒక నీతి ఉండాలని ఎవరూఅనరు. 'ఈనాడు'

అసలే అనదు. బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం వగైరా అవలక్షణాలు, ఎవరిలో, ఏ రూపంలో తలెత్తినా వాటిని ఖండించడానికి "ఈనాడు" వెనుకాడదు.

మాది ప్రజల పత్రిక. ప్రజా ప్రయోజనాలే మాకు శిరోధార్యం ఏ పార్టీతోనూ, ఏ ప్రభుత్వంతోనూ, ఏ నాయకుడితోనూ "ఈనాడు" పెనవేసుకుపోయే ప్రశ్నే లేదు

ప్రజా జీవితంలో నైతిక విలువలకు స్థానం ఉండాలని "ఈనాడు" కోరుతుంది. అందుకోసమే భ్రష్టుపట్టిన కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వాన్ని సాగనంపి తెలుగుదేశం అధికారంలోకి రావడానికి తోడ్పడింది. పార్టీ మార్పిడిని ప్రోత్సహించడంవంటి దుష్ట సంప్రదాయాలకు తెలుగుదేశం దూరంగా ఉండాలనే "ఈనాడు" కోరుతుంది. మొత్తంమీద ఎన్టీఆర్ ఈ విషయంలో అన్నమాటలకు కట్టుబడే ఉన్నారన్నది కాదనలేము. ఆయనే కనుక పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించి ఉంటే ఇవాళ అసెంబ్లీలో ఎంతమంది కాంగీలో మిగిలేవారో నేను చెప్పక్కరలేదు.



తెలుగు సంస్కృతి, తెలుగు ఆత్మాభిమానం, తెలుగు ఆడపడుచుల గౌరవం, తెలుగు చిన్నారి పాపలు-అన్న ప్రాంతీయ నినాదాలతో భాషను ముఖ్య ప్రాతిపదికగా వేసుకుని అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్-తెలుగు అధికారభాషకావాలని అంటూనే ప్రస్తుతం జాతీయ సమైక్యత అనే ముసుగులో-టీ.వి రేడియో, ఇతరకేంద్ర శాఖలద్వారా హిందీని తెలుగు ప్రజల మీద అతిహేయంగా రుద్దుతుంటే సాటి ముఖ్యమంత్రి ఎంజీఆర్‌లా ఎదిరించకుండా సమర్థిస్తున్నారు. ఇది భావ్యమే నంటారా? ఈ విషయంలో తెలుగు పత్రికలన్నీ (ఈనాడుతో సహా) మౌనంగా ఊరుకుంటున్నాయెందుకని?

జ. తమిళనాడు రాష్ట్రానికీ మన రాష్ట్రానికీ, హిందీ విషయంలో చాలా తేడా ఉంది. వాళ్ళకు మొదటి నుంచీ "హిందీ" అంటే ఎలర్జీ. దానికి కొంత హిస్టారికల్ బాక్‌గ్రౌండ్ కూడా ఉంది. కేంద్రప్రభుత్వం హిందీని తెలుగు ప్రజలమీద అతిహేయంగా రుద్దుతోందనీ, దాన్ని ఎన్టీఆర్ సమర్థిస్తున్నారనీ నేను అనుకోను. "ఈనాడు" మౌనంగా ఉంటూ ఈ పాపంలో పాలు పంచుకుంటున్నదన్న ఆరోపణ కూడా హాస్యాస్పదమే. టి. వీ. రేడియోలకు ప్రభుత్వ చెరనుంచి విముక్తి కలగాలనీ, పాలకపక్షం బాకాలుగా కాక, ప్రజా విశ్వాసం చూరగొనే విధంగా స్వయం ప్రతిపత్తితో అవి స్వేచ్ఛగా పనిచేయాలనీ "ఈనాడు" కోరుతుంది. రేడియో టి. వీ. కార్యక్రమాలు ఆసక్తికరంగా,

విజ్ఞానదాయకంగా ఉండాలని కూడా "ఈనాడు" మొదటినుంచీ చెబుతున్నది. ఈ సంగతి బహుశా మీరు గమనించ లేదేమో.

తాను ప్రధానమంత్రి అవ్వాలనే ఎన్టీఆర్ కలలు ఎంతవరకు ఫలిస్తాయనుకుంటున్నారు?

జ. నాకు జ్యోతిష్యంలో ప్రవేశం లేదు. నమ్మకం అంతకన్నా లేదు.

ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో జరిగే అలజడులూ, ఆందోళనలూ, ఏర్పాటు నినాదాలూ ఇవన్నీ శ్రీమతి ఇందిరాగాంధీ అసమర్థతలా? లేక కావాలని సృష్టిస్తున్నవా?

జ. అలజడులు, ఆందోళనలకు రకరకాల కారణాలున్నాయి. సాంఘిక, ఆర్థికపరిస్థితులు ఒక కారణం. కుటిల రాజకీయ నాయకులు తమ స్వార్థంకోసం రాజకీయ ప్రాబల్యంకోసం ప్రజలను రెచ్చగొట్టి ఆందోళనలకు పురికొల్పే సందర్భాలూ ఉన్నాయి. చాలావరకూ ఆందోళనలకు ప్రభుత్వ నిష్క్రియాపరత్వం ప్రధాన కారణం. సకాలంలో సరైన చర్య తీసుకోకుండా సమస్యల్ని ముదరపెట్టడం, గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తేవడం అనర్థాలకు దారి తీస్తుంది. పంజాబ్ ఇందుకు తాజా ఉదాహరణ.

రాకేష్‌శర్మ రోదసీయాత్ర వల్ల మనకు ఒరిగిందేమిటి? దానిని మన పత్రికలన్నీ-ఈనాడుతో సహా తెగపొగిడి మన భారతదేశమే



సోయజ్ 7ని పంపినంతగా హడావుడి చేశారు. చో రామస్వామి దీనిగురించి చెబుతూ "భారతీయులకు టికెట్ లేకుండా ప్రయాణం చేయటం ఇష్టం అందుకే దీనికింత సంబరం అన్నారు. కుష్వంత్ సింగేమో "ఆషిప్‌లో రాకేష్ ఒక పాసింజరు మాత్రమే" అన్నారు. మరి మీ అభిప్రాయం ఏమిటి?

జ. రాకేష్‌శర్మ రోదసీయాత్రలో మన ఘనత తక్కువేకావచ్చు. సోయజ్ వ్యోమనౌకలో రాకేష్ కేవలం పాసింజరే కావచ్చు. కాని అంతమాత్రాన ఆ చారిత్రాత్మక ఘటనను తేలిగ్గా తీసేయడం తగదు రోదసీ పరిశోధన కేంద్రం నుంచి రాకేష్ బృందం సేకరించిన సమాచారం తక్కువేంకాదు. విమానాల నుంచి మామూలు కెమేరాలతో ఎడతెగకుండా రెండేళ్ళు ఫోటోతీస్తే లభించే శాస్త్రీయ సమాచారాన్ని రాకేష్ బృందం అధునాతన కెమేరాలతో కేవలం ఐదు నిమిషాల్లోనే సేకరించగలిగింది.

విమానాలద్వారా శాస్త్రీయ విజ్ఞానం సేకరించటం ఎప్పుడో ఆపేశారుకదా.



జ. ఇంతకూ అనేదేమిటంటే ఈ అంతరిక్ష పరిశోధనాయాత్ర మనవల్ల జరిగి ఉండకపోవచ్చు. ఇంకేవరి ప్రతిభో అయుండవచ్చు – అయినా సైన్స్‌లో అభివృద్ధి అభివృద్ధేకదా ఇందులో మన పాత్ర కేవలం రాకేష్ శర్మను పంపటమేకావచ్చు. అంత మాత్రాన తక్కువగా ఎందుకు భావించాలి? అంతరిక్షంలో ఇన్నిరోజులుండటం, సర్వేయింగ్‌లోగానీ, ఇతరశాస్త్రీయ విషయాల పరిశోధనలోగానీ అదివరక్కంటే ఎక్కువగా సాధించారు.

ఈ యాత్రకంటేకూడా ఇంతకు ముందు యాత్రల్లో......

జ. ...చూడండి! మానవస్వభావం ఏమిటంటే ఎడ్వెంచర్‌ని వెల్‌కమ్ చేయటం! అంతవరకే మనం తీసుకోవాలిగానీ అదో పబ్లిసిటీగాకాదు, ఉదాహరణకు మనింటినుంచే ఎవరయినా వెళ్ళారనుకోండి-మనం మనాళ్ళగురించే మాట్లాడతాం కదా! రష్యావాళ్ళపేర్లు ఇక్కడ ఎవరికి ఉత్తేజం కలిగిస్తాయి?

ఆ సంగతి నిజమేకానీ మనాళ్లే ఆ అద్భుతమయిన పని చేశారన్నట్టు చెప్పడం సబబుకాదని మా అభిప్రాయం. అన్నిరోజులపాటు, మన దేశంలోని న్యూస్‌పేపర్లు (తొంభయ్ శాతం) బానర్ లైన్స్‌తో రాకేష్ శర్మ గురించిరాయటం సమంజసం కాదేమో?

జ. కొంతవరకూ అది ఎక్కువయితే అయుండవచ్చు. కానీ ఇక్కడ మీకో విషయం గుర్తుంచుకోవాలి! ఈసారి అంతరిక్షయాత్ర మనదేశమంతా ఎంతో ఆసక్తి ఎందుకు కలిగించింది? మన దేశస్థుడు ఆ యాత్రలో పాల్గొనటమే! అలాగే న్యూస్ పేపర్స్‌లో పనిచేసేవారు కూడా ఎగ్జయిట్ అయిఉండవచ్చు. వాళ్ళ జడ్జిమెంట్‌నిబట్టి ఆ న్యూస్ "డిస్‌ప్లే" ఉంటుంది. అప్పుడప్పుడూ అనవసరంగా ప్రాముఖ్యత ఇచ్చే న్యూస్ కూడా రావటం జరుగుతూంటుంది. కనుక అది జడ్జ్‌మెంట్‌లో తేడా అనుకోవచ్చు.

ఎలక్షన్ల ముందు ఎన్టీఆర్ రోడ్డు పక్కన స్నానంచేసే ఫోటోలు భోజనం చేసే ఫోటోలు "ఈనాడు"లో ప్రచు


రించటం గురించి చాలారకాల వ్యాఖ్యలు వచ్చాయ్. నిజానికి మాక్కావలసిం దదే! ప్రజలు రియాక్ట్ అవాలనే ఉద్దేశం తోనే అలా చేశాము. ఫోటోలు వేయ కుండా ఆ విషయం నాలుగయిదు లైన్లు రాశామనుకోండి! ఆ ఎఫెక్ట్ వస్తుందా! నో!

సితారద్వారా చెత్త సినిమాలను దుయ్యబడుతూ రివ్యూలు ప్రారంభించి సినిమారంగంలోని అవినీతి ధోరణులను నిరసించే వ్యాసాలకు ప్రోత్సాహం ఇస్తూ మీరు సినిమా నిర్మాత ఎందుకయ్యారు?

జ. తెలుగు ప్రేక్షకులకు ఆరోగ్యకరమయిన వినోదం అందించడంలో నాకు చేతనైంది చేయాలనే సంకల్పం ....నాలుగు డబ్బులు సంపాదించాలనే ఆశ.

మీరు స్థాపించిన అన్ని వ్యాపారరంగాల్లోనూ అద్భుత విజయం సాధించారు. కొంతమంది ఈ విజయానికి మీ డైనమిజం కారణమంటే మరికొంతమంది మీ తెలివితేటలంటున్నారు. ఇంకొంతమంది మీరంతా పబ్లిసిటీ మాజిక్ తాలూకా విజయం అంటే మరికొంతమంది కేవలం గొప్ప అదృష్టం అంటున్నారు. నిజంగా అసలు ఏమిటి?

జ. "అదృష్టం" గురించి నేను పట్టించుకోను. నాకు తెల్సిందల్లా చేయదలచుకున్న పనిని శ్రద్ధతో, పట్టుదలగా చేయడం. కృషి ఉంటే దేనిలోనైనా విజయం సాధించవచ్చున్నది నా నమ్మకం. ●





కంప్యూటర్ టీజింగ్

వివిధ రకాల పత్రికలు ప్రముఖులచే సమాధానాలిప్పిస్తున్నాయ్. కానీ కోట్ల కోట్ల ప్రజానీకానికి కోట్ల కోట్ల సమస్యలు కదా! అందుకే జ్యోతికొక కొత్త ఆలోచన వచ్చింది. తమతమ రంగాల్లో నిష్ణాతులయిన పదిమంది ప్రముఖులచే ఓ కమిటీ ఏర్పరిచింది.

మా ఆవిడ కుడి చెక్కిలిమీద పుట్టుమచ్చ లేదు మరి మాకు మంచిరోజు లెప్పుడొస్తాయంటారులాంటి జ్యోతిష్యం ప్రశ్నలూ-

మీరు ఆడా, మగా? లాంటి మూడో జాతి ప్రశ్నలూ

అక్కయ్యా! నాకు ఎక్కడలేని బాధగా ఉంటోంది-ఫలానా సమయాల్లో-లాంటి ఆరోగ్య శాస్త్ర ప్రశ్నలూ.

మా వివాహం అయి అరవై సంవత్సరాలయింది. మా మధ్య సంసారం సుఖం అదివరలా ఉండటంలేదు-ఏంచేయమంటారు? లాంటి దాంపత్యం ప్రశ్నలూ-


మా పక్కింటమ్మాయిని ప్రేమించాను. మాకిప్పుడు ముగ్గురు పిల్లలు. ఈ విషయం ఇంకా ఎవరికీ తెలీదు. నా కిప్పుడు వేరే సంబంధాలు చూస్తున్నారు-ఏంచేయమంటారులాంటి ధర్మసందేహాలు జ్యోతికి పంపండి!

పై పది మంది ప్రముఖులు ఏ ప్రశ్నకైనా సరే విజ్ఞానవంతమయిన సమాధానాలన్నీ మా కంప్యూటర్‌కి ఇంతకు ముందే ఫీడ్ చేసి ఉంచారు. మీ అనుమానాలూ, సమస్యలూ ఒకటనేమిటి ఏదయినాసరే వెంటనే అడగండి! కంప్యూటర్ తడుముకోకుండా సమాధానమిస్తుంది.

మీ ప్రశ్నలు కార్డుమీదే వ్రాయాలి. కేరాఫ్ జ్యోతి (కంప్యూటర్ టీజింగ్‌కి) అని వ్రాయండి.

ఉత్తమ ప్రశ్నకి సంవత్సరంపాటు ఉచితంగా జ్యోతి మాసపత్రిక పంపిస్తాం.

-ఎడిటర్


జీవం ఉట్టిపడేలాగ మురియండి
Liril
THE FRESHNESS SOAP
Liril
అపూర్వమైనది లిరిల్. పచ్చని తరంగరేఖలు. నిమ్మకాయల్లోని తాజాదనపు ఉత్సాహంతో. చురుకైన, పులకరింపజేసే లిరిల్ మిమ్మల్ని నవనారిగా రూపొందిస్తుంది.
లిరిల్
తాజాదనపు సబ్బు
నిమ్మకాయల తాజాదనపు ఉత్సాహంతో
హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి



పక్కింటి సీతాలక్ష్మి

భార్గవి పి.రావు

శర్వాణి అప్పుడప్పుడే పేరు తెచ్చుకుంటున్న ఓ చిన్న సైజు రచయిత్రి, శర్వాణికి ఆమె రచనా శక్తిపైన అపారమైన నమ్మకం. సైకాలజీ ఆమెకు నచ్చిన సబ్జెక్టు. ఆమె ఇతివృత్తాలను చుట్టూ వున్న పరిసరాలను, మనుషుల్ని స్టడీ చేసి మరీ సెలెక్టు చేసుకుంటుంది, ఆమె పాత్రలూ ఎప్పుడూ మానసిక సంఘర్షణకు గురవుతూ వుంటాయి. ప్రస్తుతం ఉన్న "ట్రెండ్"ను బట్టి తనూ రిసెర్చిచేసి రాయాలని ఫ్రాయిడ్, యూంగ్‌లాంటి వాళ్ళను స్టడీ చేసింది. సరిగ్గా అర్థం కాకపోయినా నిరుత్సాహ పడలేదు.

మూర్తి మామూలు బాంక్ గుమాస్తా: తన భార్య, శర్వాణి, కథా ప్రపంచంతో ఏమీ పరిచయంలేదు. శర్వాణి రాసే కథలు చదివి ఏదో మోస్తరుగా ఉన్నాయనిపించినా, ఆమెను మెప్పించడం కోసం చాలా బావున్నాయని ఒప్పేసుకునే వాడు. బాంక్‌లో కొలీగ్స్ "ఏవోయ్, నీ భార్య కథలు రాస్తుంది కదా?" అంటే "ఆ ఏదో తన పిచ్చి" అని తేల్చేసేవాడే కాని, గర్వంగా నా భార్య ఫలానా అని ఎప్పుడూ చెప్పుకోలేదు. అతనికి శర్వాణిపైకంటే తన మూడేళ్ళ కూతురు మంజీరపైనే ప్రేమ ఎక్కువ.

శర్వాణి వాళ్ళ పక్కింట్లో ఆ రోజే అద్దెకు దిగారు సీతాలక్ష్మి, మోహన్‌లు. కొత్తగా పెళ్ళయినట్టుంది. ఇంకా పిల్లా పాపా ఉన్నట్టులేరు అనుకుంది శర్వాణి. రోజూ తొమ్మిదిన్నరకు స్కూటరుపైన బయలుదేరే మోహన్‌కు కారియర్ అందించడానికి బయటకు వచ్చేది సీతాలక్ష్మి. ఆ టైములోనే మూర్తిని ఆఫీసుకి పంపి కాస్సేపు కిటికీదగ్గర నిలబడటం

తనకి అలవాటు. సీతాలక్ష్మిని చూసి పలకరింపుగా నవ్వింది. "కొత్తగా వచ్చారా? ఏవూరు" అంటూ మాటలు కలిపింది. పేరు పాతదైన మనిషి చక్క టిదే! వయస్సు కూడా ఇరవై కి మించి లేవు.

"ఎంతవరకు చదువుకున్నారు" అని అడిగింది శర్వాణి. "ఎనిమిదో తరగతి వరకూ" అని చెప్పింది.

ఇలా సాగింది వాళ్ళ సంభాషణ. అటు వంటి మనిషితో తను కథలు రాస్తానని చెప్పడం కూడా దండగేననిపించి ఊరు కుంది శర్వాణి.

అయినా రోజూ ఓసారి సీతాలక్ష్మిని చూడకపోతే తోచేదికాదు శర్వాణికి. ఎందుకో ఆ అమ్మాయంటే ఓ రకమైన అభిమానం ఏర్పడింది ఎంతో అమాయ కంగా, ముగ్ధలా కనిపించే ఆ అమ్మాయి సైకాలజీపై ఓ కథ రాయాలని శర్వాణి సీతాలక్ష్మిని Study చెయ్యసాగింది. కొన్ని రోజుల తర్వాత—

"అమ్మాయ్, ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు. రోజూ మీ ఆయనతో, వీధి చివర్లో నిలబడి, స్కూటరుమీద వెడుతుందే-ఆ "అమ్మాయెవరు?" అని అడిగింది శర్వాణి

"ఆ, ఆ అమ్మాయా? తను సుధ మావారి ఆఫీసులో నే పని చేస్తుంది. మొన్న మా ఇంటికొచ్చారు చూళ్లేదా" అని చెప్పింది తేలిగ్గా సీతాలక్ష్మి. ఆ మాటల్లో కొంచెం కూడా ఈర్ష్య లేక పోవడం శర్వాణికి ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

సుధను గురించి మరికొన్ని ఆరాలు తీసింది. ఆ అమ్మాయి మోహన్‌కంటే నాలుగేళ్ళు పెద్దదనీ, ఏవో కారణాలవల్ల పెళ్ళి చేసుకోలేదనీ-చాలా మంచావిడని మోహన్ చెప్పారట.

"దాన్ని నువ్వు నమ్మావా? పిచ్చితల్లీ! ఈ మగవాళ్ళ సైకాలజీ చాలా కాంప్లి కేటెడ్‌గా ఉంటుంది.

అన్నీ విని చిన్నగా నవ్వి వూరుకున్న సీతాలక్ష్మిపై కొండంత కోపం వచ్చింది. ఇటువంటి మూర్ఖులకి సైకాలజీ గురించి చెప్పే బదులు మరో కథ రాసుకుంటే పుణ్యం, పురుషార్థం అనిపించింది శర్వాణికి ఆ తరువాత ఆ సంగతి పట్టించుకోనట్టు నటించినా, ఓ కన్నేసి ఉంచింది-ఏదైనా కథావస్తువు దొరక్క పోతుందా అని!

ఉన్నట్టుండి నాన్నగారికి ఒంట్లో బాలేదని టెలిగ్రామ్ వస్తే, ఉన్నపళాన బయలుదేరి వెళ్ళిపోయింది శర్వాణి, మంజీరను తీసు కుని. మూర్తికి జాగ్రత్తలు చెప్పి, ఇంటినో కంట కనిపెట్టమని సీతాలక్ష్మి చెవిన కూడా ఓ మాట పడేసి హడా వుడిగా బయలుదేరింది. ఊరు చేరగానే నాన్నగారికి కొంచెం స్వస్థత చేకూర డమూ, నాన్నగారిని చూడ్డానికి వచ్చిన అన్నయ్యలు, చెల్లాయితో సరదాగా గడపడమూ శర్వాణికి హాయిగా అనిపిం చేయి. కులాసాగా ఓవారం గడిచాక, అనుకున్న దానికంటే ఒరోజు ముందుగా బయలుదేరింది హైదరాబాదుకి.

రైల్లో కూర్చున్న శర్వాణి ఆలోచనులు ఇంటిమీదికి మళ్ళాయి. దాంతోపాటూ సీతామహాలక్ష్మి మీదకు కూడా. సీతా లక్ష్మి మంచిపిల్ల. అమాయకురాలు.

ఆమెకు మరోసారి నచ్చచెప్పి ఆమె సంసారం నిలబడేలా చూడాలి ఆమె భర్త మోహన్ సుధను వలలో వేసుకోవాలనుకుంటున్నాడా లేక సుధే అతన్ని ఆకర్షిస్తోందో? అడదే కోరివస్తే ఏ మగాడు కాదంటాడు? దీనిపైన ఓ కథ రాసి నిర్ణయాన్ని పాఠకులకే వదిలేసి చూడాలి అనుకుంటూ నిద్రలోకి జారిపోయింది.


నాంపల్లి స్టేషను వచ్చింది. ఆ రోజు సోమవారం. మూర్తి ఆఫీసుకి వెళ్ళుంటాడని తెలిసినా ఓసారి స్టేషనంతా చూసింది. మంజీర చెయ్యి పుచ్చుకుని దిగి, కూలీతో తన చిన్న సూట్ కేసును మోయించుకుని, ఆటో ఎక్కి "సైదాబాదు పోనీయ్" అంది. ఏదో ఆలోచనల్లో ఉండగానే ఆటో ఇంటిముందు ఆగింది. ఆటోవాడికి డబ్బిచ్చి "అరే, తలుపుకి తాళం లేదే? మూర్తి ఇంట్లోనే వున్నారా? ఒంట్లో బావులేదేమో అనుకుంటూ తలుపు తోసింది. గడియ సరిగ్గా పడలేదేమో తలుపు ఒక్కసారిగా తెరుచుకుంది. అంతే శర్వాణి కళ్ళు తిరిగాయి-ఎదురుగా చూసిన దృశ్యంతో. తన భర్త కౌగిలిలో సీతాలక్ష్మి! ఇద్దరూ ఉలిక్కిపడి శర్వాణిని చూసి వెంటనే విడిపోయారు. నీకు కథలు రాసుకోవడంలో ఉన్న ఆనందం నాకు సీతాలక్ష్మిలో దొరికాయని మూర్తి కళ్ళు చెప్పినట్టనిపించింది. మొగుణ్ణి ఎలా ఆకట్టుకోవాలో అని తాను చెప్పిన పాఠాలు సీతాలక్ష్మి కళ్ళలో ప్రతిఫలించాయి! సైకాలజీ తన్ను చూసి నవ్వినట్టనిపించింది. ●



తియ్యటి బహుమతి పొందిన మరో రచయిత్రి కథ, కథకి, (ముఖ్యంగా కథానికకి) కావల్సిన కొసమెరుపు లేకపోయినా, ప్రస్తుతం చాలామంది తమ జీవితంలో ఎదుర్కొంటున్న శూన్యాన్ని, ఎక్స్‌ట్రా మారిటల్ రిలేషన్స్ గురించి ధైర్యంగా చర్చించిన కథ కాబట్టి ఎన్నిక చేశాము. మాకు తెలిసినంతలో తెలుగు పాఠకులకి ఇదో కొత్త(బోల్డ్) వర్పు.

కొండల్లో గోదారి

కె. విజయలక్ష్మీశర్మ



"సారధిని చూడకపోతే, తనతో మాట్లాడకపోతే పిచ్చిపట్టినట్లుగా ఉంటుంది నాకు, నవ్వకు మరి,

సారధి ఎంత మంచివాడో తెలుసా, నేనంటే చాలా అభిమానం, నేనెలాంటి చీరయినా కట్టుకోనీ, ఎంతో బాగుంది అంటాడు."

"ఏం కట్టుకోకపోతే యింకా బాగుంది అంటాడేమో!"

"నీ కంతా తమాషాగా వుంది కదూ" బాధగా అంది అరుణ, ఫోర్క్‌తో విజిట



బుల్ ఫ్రైడ్‌రైస్‌ని కెలుకుతూ. నేను కాటన్‌సారీ కట్టుకున్నా, షిఫాన్ కట్టుకున్నా, జడ వేసుకున్నా, ముడి చుట్టుకున్నా, ఆ మనిషి దగ్గరనుంచి, కాంప్లిమెంటు అలాఉంచి, కామెంటు కూడా రాదు."

"నీకెలా చెప్పాలో తెలియడంలేదే అరూ యింకో ఆరేడు ఏళ్ళుపోతే, నీ కూతురే ఇటువంటి సమస్యతో నీ ముందుంటుంది. అయినా ఆ సారధికన్నా బుద్ధి ఉండక్కర్లా, ఇలాంటి వెధవ పనులు చెయ్యడానికి, నలభయ్యో వయస్సులో పడబోతున్నాడేమో కూడా" టమాటో సాజ్ పళ్లెంలోకి వంచుకుంటూ కొంచెం కోపంగానే అన్నా.

"ఇందులో సారధి తప్పేంలేదు సరూ, నిజం చెప్పాలంటే, నేనే తనని ఒక విధంగా ఎంకరేజ్ చేసేననుకుంటా. చాలా రోజులుగా, నా కెందుకనో, ఒక మగ ఫ్రెండ్ కోసం ప్రాణం తహతహలాడుతూంది. నన్ను మెచ్చుకునే మనిషి, నేను కావాలనుకునే మనిషి, నా అభిరుచులు, అలవాట్లు ఇష్టపడే మనిషి, ముఖ్యంగా నాగురించి కన్‌సర్న్ (Concern) అయే మనిషి కావాలనిపించేది, ఇటువంటి సమయంలో సారధి మన ఆఫీసుకి రావటం జరిగింది. నువ్వు చూసేవుగా సారధి ఎంత డీసెంట్‌గా ఉంటాడో!"

"ఏమో! నేనంత ఇదిగా ఎప్పుడూ అబ్జర్వ్ చెయ్యలేదు, ఎప్పుడూ, చాలా ట్రిమ్‌గా మాత్రం ఉంటాడు సారధి మీద నాకెలాటి అభిప్రాయం లేదన్న విషయాన్ని వ్యక్తం చేస్తూ అన్నాను.

నకు చెప్పలదుగాని, రవిలో ఈమధ్య చాలా మార్పు వచ్చింది. డ్రింకు ఉంటే గాని రోజు గడవదు. తనకి, ఆ వాసనంటే వాంతి వస్తుంది నాకు, కనీసం నెలకో సారయినా పిల్లలని తీసుకుని, ఎక్కడి కన్నా వెళ్ళి. ఈ రొటీన్‌లైఫ్ నుంచి బయటపడాలి అంటాన్నేను. ఆయన మాత్రం, వాళ్ళ ఫ్రెండ్స్‌నీ కంపెనీ విడిచి పెట్టి, ఏ ఒక్క సెలవురోజూ మాతో గడపడానికి ఇష్టపడరు వస్తున్న కన్నీళ్ళనీ కంట్రోల్ చేసుకుంటోంది అరుణ.

"కారణాలేమైనాగానీ, నువ్విలా 'ఇన్‌వాల్వ్ అవడం నాకేంనచ్చలే మనం సక్రమంగా ఉన్నన్నాళ్ళు, ఆఫీసులోగాని బయటగాని ఎవరేమనకున్నా, మనం హాయిగా నవ్వేసి, తలెత్తుకు తిరగ్గలిగేవాళ్ళం. మనమీద లేనిపోని నిందలు వేసినా, పట్టించుకునేవాళ్ళం కాదు, ఎందుకంటే మనకి, మన అంతరాత్మకీ తెలుసు, మనం ఎలాటి వాళ్ళమో, కానీ ఇప్పుడు అలా ఉండగలమా! మనం ఒక తప్పుడు పని చేస్తున్నప్పుడు, అది ఎవరైనావేలెత్తిచూపిస్తే మనంభరించమే. అది మానవనైజం, నిజం అంత భయంకరమైంది."

"నన్నిపుడేం చేయమంటావో చెప్పు" కంఠంలోని మార్పే చెప్తూంది. ఆమె నెంతగా ఈ విషయం కదిలిస్తూందో.

"అరూ, నీకో సంగతి చెప్పనా" అనునయంగా అడిగేను.


"ఏమిటన్నట్లు" తన అందమైన కళ్ళని ఎత్తింది అరుణ. బహుశ ఆమె అందం, సున్నితమైన మనసు, అటు పెద్దరికాన్ని తెచ్చిపెట్టక ఇటు చిలిపి వయసు, చిన్నతనం అని అనుకుందికి వీలుకాక మధ్యస్థంగా ఊగిసలాడే వయసు, యివన్నీ కూడా కారణాలు, అరుణ యిలాంటి పరిస్థితులలోపడడానికి ఏదిఏమైనా, నాకు చాలా సన్నిహితురాలైన అరుణ ఇలాంటి చిక్కుల్లో ఇరుక్కోవడం నాకు కూడా కష్టంగానే ఉంది. ఆమె నెలాగైనా ఇందులోంచి తప్పించాలి.

"దేవుడో స్టెన్సిల్ కట్ చేసి, ఈమగాళ్ళనే కాపీస్‌ని తీసాడేమో అన్పిస్తుందే అరూ, ముఖ్యంగా పెళ్ళాం విషయం వచ్చేటప్పటికి మెజారిటీ అంతే; బహుశా మనం వాళ్ళ స్వేచ్ఛకి అడ్డు తగుల్తామనో, లేదా వాళ్లే విధంగా ప్రవర్తించినా మనం ఏమి చెయ్యలేమన్న ధీమానో, ఏదైనా గాని పెళ్ళాల్ని 'గ్రేంటెడ్'గా తీసుకోవడం చాలా మామూలు విషయం, మన దేశపు మగాళ్ళలో. భార్యను మోసంచేస్తూ నీతో స్నేహాన్ని పెంచుకుంటున్న అతని ప్రవర్తనేచెపుతుంది, అతనెలాంటివాడో"

"ఆమె ఒక తిరుగుబోతట, ఏదో క్లబ్ మెంబర్ కూడాను. రాత్రి ఎనిమిది దాటితేగాని కొంపకి చేరదుట, పాపం సారథి చాలా లోన్లీగా ఫీలవుతాడట."



'అతనంటే నా కెంతో ఇష్టమో తెలుసంటే రాణీ! అతని దగ్గరున్న చిన్నిచిన్ని వస్తువులంటే తెగముద్దసుకో! పల్లెటూళ్ళో అతనికున్న చిన్నపాకా, అతని చిన్న కారూ, అతనికి బొంబాయి నగరంలో ఉన్న చిన్న ఫ్లాటూ...'



సారధిని నేనేమన్నా భరించలేనట్లుగా అంది అరుణ.

"అందుకని, నీ కంపెనీ కావాలంటున్నాడా, చూడు అరూ, అతని పెళ్ళాం ఒక తిరుగుబోతయినా, మీ ఆయన ఒక తాగుబోతు అయినా, లోకం వాళ్ళనేమీ అనదు. కానీ వాళ్ళే కారణం మీ స్నేహానికి అని మీ ఇద్దరూ సమర్థించుకుంటే సరిపోదు. ప్రతి వాళ్ళలోనూ ఏవో లోపాలుంటాయి. రవి సంగతే చూడు, ఎంతసేపూ తన ఫ్రెండ్స్ తన లోకం అంటాడేమోగాని, పరాయి ఆడదానివంక కన్నెత్తయినా చూడడు"

"పరాయివాళ్ళమాటఅటుంచు, తనునన్నే చూడడు" వ్యంగ్యంగా అంది అరుణ.

"నీకు నిజంగా మతి పోయిందే అరుణా. ఇది ఇంగ్లండ్ కాదు. భారతదేశం, అందులోనూ ఆంధ్రదేశం, సందుదొరికితే చాలు అవతల వాళ్ళని ఆడిపోసుకునే అంధదేశం. ఎక్స్ట్రా (extra) మారిటల్ రిలేషన్స్‌ని అర్థం చేసుకునేంత ఉన్నతంగా యింకా ఎదగలేదే మనం."

"పూర్వం అయితే ఏమోగాని, ఇప్పుడు మాత్రం, తనకికూడా, ఎవరయినా "ఫ్రెండ్" ఉంటే బాగుండును అనిపిస్తూంది."

"నీఆలోచన మండిపట్లేఉందినిన్నొకసైకియాట్రిస్ట్ దగ్గరికి తీసికెళ్ళాలిముందు. నే చెప్పినట్లు వింటావా నువ్వు," సీరియస్‌గా అడిగేసు.

"సారధిని కల్సుకోవద్దంటావు,అంతేగా" అరుణలో నిరుత్సాహం.

"అంతేకాదు, నువ్వు కొన్నాళ్ళు లీవు పడేసి యింటిలో వుండు."

ఇంకా పిచ్చిపట్టిపోతుంది. అయినా లీవెక్కడ ఏడ్చింది" విసుక్కుంటూ అంది.

"లాస్ ఆఫ్ పే అవుతుంది. అంతేకదా! అదీ ఒకందుకు మంచిదే, మీ ఆయన ఒక్క జీతంతో సంసారం నెట్టుకొస్తూ, సరదాలు గడుపుకోవాలంటే కాదుగా, చచ్చినట్లు ఇంట్లో పడివుంటాడు. ఇంక నీకు పిచ్చిపట్టకుండా చిట్కా నేచెప్తా. భోంచేసి కాసేపు పడుకో, ఆ తర్వాత ఎప్పట్నించో "షాల్" వేసుకోవాలను

కుంటున్నావుగా, అది మొదలుపెట్టు, వెర్రి, మొర్రి ఆలోచనలు మాని "ప్రాక్టికల్"గా బతకడం నేర్చుకో. రవేమంత మొండివాడుకాదు, మెల్లిగా నచ్చజెప్పు తన ఏబ్‌సెన్స్ నిన్నెంతగా బాధపెడుతున్నదీ-"

"ఏమోనే, నాకంత ఓపిక ఉందా అని, ఆయనకంటే ముందు నాకే కోపం, ఆ తర్వాత ఏడుపువచ్చేస్తాయి ప్రతి చిన్న విషయానికీ, అసలేం మాట్లాడలేను, యిదంతా సరే మరి సారధి" సందిగ్ధంగా ఆగిపోయింది.

"ఆ ఏమిటి సారధి, ఏం చెప్పాలనా, ఏదో ఒకటి చెప్పేయ్యి"

"చాలా 'హర్ట్' అవుతాడేమో," ఆమె అన్న 'ఆ' తీరే చెప్తోంది సారధంటే ఆమెకున్న యిష్టాన్ని.


"యూ జస్ట్ కాన్ట్ హెల్ప్ ఇట్ అరూ", నాలో సహనం పోతూంది, 'మతులెన్ని చెప్పినా వచన పక్కనే' అన్నట్లు, ఇంత చెప్పాక కూడా ఆమె మొదటికే రావడం పిచ్చి కోపాన్ని తెప్పిస్తుంది నాకు. "ఏం మీ ఆయన కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నావా సారధిని"?

"ఎంత దారుణంగా మాట్లాడుతున్నావే" ఇంక ఏడుపొక్కటే తరువాయి, "నాకిద్దరూ ఇష్టమే అనుకుంటాను" గొణిగినట్లుగా అంది.

"అనుకుంటాను! బాగానే ఉంది వరస, డోంట్ ఏక్టు లైక్ ఛైల్డ్ అరూ" మీది గమ్యంలేని స్నేహం, ఇదంతా ఇక్కడ కుదరదుగాని నామాట విని సారధిని మర్చిపో, నేను వార్న్ చేయలేదని అనొద్దు తర్వాత. యిది యిలాగే సాగితే, అటు సారధినీ, ఇటు రవిని కూడా కోల్పోతావు నువ్వు. మనిషినిబట్టి మంచాలు మోస్తారే మనవాళ్ళు. వాళ్ళని సమ్మదం అంత తెలివి తక్కువ యింకోటి లేదు. పెళ్ళి చేసుకున్నాం కాబట్టి తప్పదు కాబట్టి పిల్లలకోసమయినా మనకు అనుగుణంగా వాళ్ళని (భర్తల్ని) మార్చుకుందికి ప్రయత్నించాలి. సారధికి పెళ్ళాం అంటే చచ్చేంత భయంట, ఈ సంగతి ఆవిడకి తెలియనంత కాలమే, ఆతర్వాత నీ మొహం కూడా చూడడు. మొదట్లో నీకు కొంచెం కష్టం అన్పించవచ్చు. తర్వాత అదే అలవాటయిపోతుంది. లోకాన్నెదిరించి బతకడం కష్టమే. అందరూ కాకుల్లా పొడుస్తు, మన్నివేలెత్తి చూపిస్తుంటే మనకు సుఖంగా ఉంటుందా చెప్పు. సారధికి క్లియర్‌గా చెప్పెయ్యి, నువన్నంత మంచివాడయితే తప్పకుండా అర్థం చేసుకుంటాడు. యింక వెళ్దాం పద, పీళ్ళు మన్ని తగిలెయ్యమందే" మనీ బిల్ ఫోల్డర్‌లో పెట్టి చేను:

"చాలా థాంక్స్ సరూ, ఇప్పుడు నాకు కొంచెం శాంతిగా ఉంది. నువ్వు చెప్పింది నేనెంతవరకూ ఆలోచించగలనో చూడాలి. తప్పకుండా ప్రయత్నిస్తాను." తనూ లేస్తూ అంది అరుణ. "సారధిని మరిచిపోవాలంటేనే బాధగా ఉంది ఐ లైక్ హిమ్ వెరీ మచ్"

"చెప్పాగా మొదట్లో అలాగే ఉంటుంది. ఎనీవే ఆల్ ది బెస్టు, మరి నేవెళ్ళతా." అంటూనే ఎంతవరకు ఈ విషయంలో అరుణ కృతకృత్యురాలవుతుందా అని ఆలోచిస్తూ నా టి.వి.యస్. 50 దగ్గరకు నడిచేను●




సూపర్ రిన్
చిమ్ముతూన్న మరింత తెల్లదనం
దీనికి సరిపడే డిటర్జంట్ బిళ్ళ మరొకటి లేదు.

సూపర్ రిన్ తెల్లదనం
మిరుమిట్లు గొల్పుతుంది :
దగ్గరగా వచ్చి చూడండిక.
ఆకర్షణీయమైన కొత్త ర్యాపర్,
మరి దాంతోబాటే తాజాదనం
చిందే సరికొత్త సువాసన!



LINTAS RIN 74 1810 TL

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి



మోటారుబైకు దొరబాబుదే.
"థళ్ థళ్" మెరుస్తూ హోటేలు పక్కనుంది. సరికొత్త మోటరుబైకు దొరబాబుదే.
రోడ్డువార హోటలు పెద్దపాక. అయినా అదేం చిన్న హోటలుకాదు. బస్సులు ఆగేచోటు. పాతిక గ్రామాలవాళ్ళు తెల్లారేసరికి అక్కడికి వస్తారు పాకనిండా పాకడు జనం కిటకిటలాడుతూ కూర్చుని కాఫీ ఫలహారాలు సేవిస్తున్నారు.
నేను లోపలికెళ్ళాను.
"రారా బ్రదర్" అని దొరబాబే నన్ను పిలిచాడు, వాడోబెంచీ మీదున్నాడు. కాస్త చోటు చేసి పెట్టేడు. వెళ్ళి కూర్చునాను.

దొరబాబు నన్నంత అభిమానంతో పిలవడం విడ్డూరమే. మేం ఓ ఊరివాళ్ళమే అయినా ఉభయులం మాట్లాడుకునేది తక్కువ." ఓహో అంటే ఓహో" అని పలకరించుకుంటాము. నా తోవని నేను పోతాను. వాడి తోవని వాడు పోతాడు, వాడంత అభిమానంతో పిలిచాడూ అంటే విశేషమే!
"సన్నాసీ, ఒకటికాదు. రెండు ప్లేట్లు" అని గట్టిగా అరిచి రెండు వేళ్ళు చూపించాడు దొరబాబు. హోటలు సర్వరు పేరు సన్నాసే వాడు రెండు ప్లేట్ల ఇడ్లీ పట్టుకొచ్చి మా ముందు పెట్టేడు.
"సన్నాసీ ఇటు చూడు. రెండు. ఏమిటి రెండు?" అని వాణ్ని ప్రశ్నించాడు.

పణుకుల వాగు

చాసో కథ ఇది. చాసో కథకి రైటప్ ఇవ్వటం కాస్త సాహసమే! కథానిక అనగానే రొమాన్సూ - చివర్లో మెరుపుల థ్రిల్లూ కాదూ, ఒక వాతావరణం కూడా ముఖ్యం అనే విషయాన్ని మరిచిపోతున్నారా కుర్ర రచయితల్లారా అని చెప్పటం కోసమే ఈ కథ రాసినట్టున్నారు.

చాగంటి సోమయాజులు

"పెసరట్లు" అన్నాడు సన్నాసి.

"అదిరా ఎదవనాకొడకా. రెండు స్పెషల్ పెసరట్లు, అల్లం మిర్చి బాగా తగిలించమను. తెలుసునుగా నా పెసరట్లు" అన్నాడు దొరబాబు.

"దొరబాబుకి రెండు పెసరట్లు" అని లోపలికి అరిచాడు సన్నాసి. దొరబాబు పెసరట్లు అందరి పెసరట్లు కావు.

"పొద్దున్నే వచ్చేవు" అన్నాడు దొరబాబు. ఎక్కడికి వెళుతున్నావు అని అడగలేదు.

"పట్నం వెళ్ళాలి" అన్నాను.

"చచ్చావ్. వెళ్లలేవు. ఓ బస్సు మూల పడ్డాది. ఓ బస్సు బ్రేకు కెళ్ళింది" అన్నాడు.

చిక్కు. అన్ని బస్సులూ వస్తూ ఉంటేనే ఖాళీ వుండడంలేదు. రద్దీ ఇంతా అంతా కాదు.

"ఏం చేస్తాం వెళ్ళవలసిందే" అన్నాను.

"వెళ్ళవలసిందే. ప్రయాణాలు తప్పవుగా. నేను ఆరేళ్ళు ఈ బస్సులో ప్రయాణాలు చేశాను. జిల్లా జిల్లా అంతా చుట్టబెట్టి సాయంకాలానికి ఇల్లు చేరుకునే వాణ్ణి. చూస్కో మరి. తలుచుకుంటే ఆ ప్రయాణాలు నేనే చేశానా అనిపిస్తుంది" అన్నాడు

"నీది నిత్య ప్రయాణం" అన్నాను.

"ఆహా నిత్య ప్రయాణమే. ఏభై అరవై మైళ్ళు తిరిగిరాక తప్పదు. బైకు కొన్నాను. బతికాననుకో"

వాడిధోరణిని వాడు చెప్పుకుపోతున్నాడు నేను వింటున్నాను. పట్నం నన్ను బైకు మీద మోసుకుపోతే బాగుణ్ణనుకుంటు న్నాను. తీసికెళ్ళు అని చచ్చినా అన లేదు.

"ఆరువేలరూపాయలు—అదనం బ్లాకులో ఇచ్చి కొన్నాను ఏం చెయ్యను, మనకా బండి ఉండాలి. అవసరం" అన్నాడు.

"నీకు అవసరమే" అన్నాను.

"ఊళ్ళో నువ్వొక్కడివే నాకు నచ్చేవు. ఏ వూసుకీపోవు. ఎవణ్ణి చూసీ ఏడవ్వు" అన్నాడు. వాడన్నది నా గురించి నిజమే. ఊళ్ళో వాడిమీద చాలామందికి ఈర్ష్యా వుంది, గుర్రూ వుంది.

"నాకెందుకురా గొడవలు. వాళ్ళన్నం మనం తింటామా మనన్నం వాళ్ళు తింటారా? ఏఅమ్మ వండినా ఆ పులుసూ అన్నమే" అన్నాను. నాలిక కరుచుకున్నాను. మా యింటి అమ్మ-అనగా మా ఆవిడ అందరూ తినే పులుసూ అన్నమే పెడుతుంది. ఆ మాట వాడి దగ్గరని చిన్నబోయాను. ఎంచేతా అంటే వాడు ఊళ్ళో అందరిలాగా పులుసు అన్నం తిండంలేదు. వాడి ఇంటిముందు పెంటచూస్తే తెలిసిపో తుంది, తరుచు కోడివెంట్రుకలు కుప్ప పోసి కనబడుతూ ఉంటాయి. రోజుకో కోడి పీకకోసేసి దాని ఈకెలు పీకేసి పెంటకుప్పమీద పోస్తున్నట్టు కనబడు తుంది.

"ఏ అమ్మ వండినా ఆ పులుసూ అన్నమే" అని అనేశాను. చాలా చిన్న బోయాను.

"మంచి మాట అన్నావు" అన్నాడు దొరబాబు. సన్నాసి పెసరట్టు తెచ్చి పెట్టాడు.

"ఓరి సన్నాసీ! రోజూ పరగడపే? ఉప్మా—రెండుప్లేట్ల ఉప్మా-ఈ పెసర ట్లకి తగిలించు, ఇలాగచూడు- చెట్నీ- గట్టి చెట్నీ—"


దొరబాబు సన్నాసికి ఆర్డరిచ్చేడు.

"బ్రదర్! ఇవాళ నువ్వు బస్సులో వెళ్ళలేవు. అంచేత నా బైకుమీదపట్నం మోసుకుపోతాను" అన్నాడు.

"బతికించావ్?" అన్నాను. వాడామాట అంటాడా అని ఎదురు చూస్తున్నాను అన్నాడు. ఎందుకు తీసికెళతానన్నాడు? వాడి హోషు, గొప్ప నా దగ్గర ప్రద ర్శించడానికా? కావొచ్చు. నాకేం? నాక్కావల్సింది సుఖంగా పట్నం చేరడం.


తిని కాఫీ తాగడానికి అరగంట పట్టింది కాఫీ తాగి వాడు లేపలేదు. హోటల్లో జనం కిటకిటలాడుతున్నారు.

నేను కూర్చోడం న్యాయంకాదు. కానీ దొరబాబు సిగరెట్టు పెట్టి తీసేడు. నాకో సిగరెట్టు ఇచ్చి తాపీగా అగ్గిపుల్ల వెలిగించేడు. తాను ముట్టించుకొని నా సిగరెట్టుకి అగ్గిపుల్ల అంటించేడు.



"ప్రియా! నీ అందమయిన పెదాల మీద ముద్దు పెట్టుకో వాలంటే నీకేం ఇచ్చుకోవాలి ఈ దీనుడు?"

"క్లోరోఫాం!"



సిగరెట్టు దమ్ములు తాపీగా తీసి తాపీగా లేచాడు· అప్పుడు ఒంగి బెంచీకింద నుంచి హెల్మెట్ తీసేడు
నేనో పదిరూపాయల నోటు తీసి వాడి కన్నా ముందు వెళ్ళేను, బిల్లు యిద్దామని.

"నువ్వు యివ్వడానికి వీల్లేదు. ఏయ్! వాడి దగ్గర పుచ్చుకోకు" అన్నాడు. హోటలువాడు చచ్చినా నా దగ్గర పుచ్చుకోలేదు. దొరబాబే యిచ్చేడు.

"ఇదిగో నాతో నువ్వు ఎప్పుడొచ్చినా హోటలు బిల్లు నేనే యివ్వాలి. నువ్వు యివ్వకూడదు. నువ్వేకాదు. ఎవరు నాతో కాఫీ తాగినా బిల్లు నేనే ఇవ్వాలి" అన్నాడు. అది వాడి స్టేటస్ బిల్లు వాడే యిచ్చేడు. నేనే యివ్వాలీ అనుకున్నాడు, అంటే వాడు మనకన్నా పదిమెట్లు కాదు, వందమెట్లు పైనున్నాడన్నమాట.

ఆ గీర, గోరోజనం వాడికుంది. వాడి దగ్గర మనం చిల్లిగవ్వకి మారం. ఒకప్పుడు నాకన్నా, చాలామందికన్నా తక్కువవాడు. ఇంతింతై, వటుడింతై, నభోవీధిలో అల్లంతై అని చూస్తూండగా వామనావతారం లాగ ఆకాశమంత ఎత్తు లేచిపోయేడు.
అనేక వ్యాపారాలు చేస్తున్నాడు, రెండేళ్ళు మామిడి తోటలు కొని మామిడి కాయలు బుట్టలు కట్టి రవాణా చేసేడు. రాజా అయిన వ్యాపారం ఎందుకో మానేశాడు. అందులో తెగలాభం వచ్చిందన్నాడు. వాడికి దుకాణం లేదు, ఏ లైసెన్సూలేదు. అమ్మకం పన్నులేదు. రాబడి పన్నులేదు. అనేక వ్యాపారాలు చేస్తున్నాడు. అన్నీ చట్టరీత్యా మహా నేరాలే.

కాఫీ బిల్లు యిచ్చేక తాపీగా రోడ్డుమీదకి వచ్చేడు.

"చూసావా? హెల్మెట్టు - మనం అన్ని జాగ్రత్తలూ తీసుకొంటాం" అన్నాడు. రోడ్డుమధ్య నిలబడ్డాడు. హెల్మెట్టుని ఈ చేత్తో పట్టుకొని ఊపుతూ, ఆ చేత్తో పట్టుకొని ఊపుతూ, ఈ చంకలో పెట్టుకొని, ఆ చంకలో పెట్టుకొని హెల్మెట్టు ప్రదర్శన అందరికీ చేస్తున్నాడు.

బస్సుకోసం ఎదురుచూస్తున్న వాళ్ళ సంఖ్య బాగా పెరిగి పోయింది. బస్సులో బస్సుడు జనం వస్తారు. మూడు బస్సుల జనం అక్కడ పోగయేరు. దొరబాబు కదలడంలేదు. ప్రక్క బడ్డీనుంచి కుర్రవాడు వచ్చేడు. రెండు కిళ్ళీలు, నాలుగు సిగరెట్టు పెట్టెలూ పట్టుకొచ్చి దొరబాబుకిచ్చేడు.

"ఇందుకోసం మనం యిక్కడింకా ఉన్నాం. ఈ కిళ్ళీ వెయ్యి. కిళ్ళీ ఏమిటనుకున్నావ్? ఎవ్వరికీ ఈ కిళ్ళీ కట్టడు. ఇది మన స్పెషల్. దానిమీద ఈ సిగరెట్టు కాల్చు. మజా చూడు" అన్నాడు. వాడు కిళ్ళీ బిగించి సిగరెట్టు ముట్టించేడు నాకూ యిచ్చేడు. ఘుమఘుమలాడుతూ కిళ్ళీ అద్భుతంగా ఉంది. దానిమీద సిగరెట్టు కాలిస్తే విచిత్రంగానే ఉంది. చాలా బాగుంది చాలా ఖరీదైన సిగరెట్టు.


"ఈ సిగరెట్టు పెట్టెలు పొద్దున్నే వాడు మనకి నాలుగు సప్లయ్ చేయాలి తెల్సిందా? మనకి ఈ నాలుగు పెట్టెలూ ఉంచేవాడు ఎవరికన్నా అమ్మాలి. అయినా ఈ సిగరెట్లెవడూ కొనడులే." అన్నాడు. రోడ్డు చివరనుంచి ఖడ్గమృగంలాగ బస్సువస్తూ కనబడ్డాది ప్రయాణీకులలో కోలాహలం కనబడ్డాది. ఏం లాభం? బస్సు వచ్చింది, ఆగకుండా బస్సు వెళ్లిపోయింది. బస్సు కడుపుతో వున్న మండ్రకప్పలా ఉన్నాది. దాని టాపునిండా కూర్చుని వెనక నిచ్చెన నిండా నిలబడి జనం ఉన్నారు.

"నేను చెప్పేను చూసేవా? చూడు చూడు చెవల పిల్లుల చినబాబుగారి అవస్థ" అన్నాడు దొరబాబు. చినబాబుగారు పాతిక ముప్పయి చెవల పిల్లులని పెంచుతున్నారు. అన్నీ తెల్లవే. అది ఆయన సరదా. ఊర్లోకి చాలా గౌరవనీయులు.

"ఏం? బైకు కొనుక్కొని ఏడవకూడదూ? అన్నాడు దొరబాబు. చినబాబుగారిని వాడు అలాగ్గ అనడం నాకు నచ్చలేదు. చినబాబుగారి లోగిలే ఊర్లోకి పెద్ద లోగిలి. ఈనాడు దొరబాబు ఊర్లో చాలా పెద్ద సిమ్మెంటు మేడ కట్టుకొన్న మాట నిజమే. దానికి రెండు లక్షలే అయిందో, ఇంకా ఎక్కువే అయిందో! అంత మేడ కట్టిన వాడికి వెనక ఇంకెంతో ఉండాలి. చినబాబుగారిని ఈసడిస్తూ వాడు అనడం నాకు నచ్చలేదు. సిగరెట్టు దమ్ములు లాగి లాగి పీక పారేసేడు.

"ఇంక బయలుదేరుదాం" అన్నాడు. బతికించేడు. వాడు జాగ్రత్తలు చాలా తీసుకుంటాడు. పంట్లాం జేబులోంచి గాగుల్సు తీసేడు నల్లటి మొహానికి నల్లటి గాగుల్సు తగిలిస్తే గానుగెద్దులాగున్నాడు. తలమీద హెల్మెట్టు పెట్టుకున్నాడు. వాడు మోటారుబైకు ఎక్కేవాడిలా లేడు. అంతరిక్ష నౌకలో అంతరిక్షానికి పోయే వాడిలాగున్నాడు.

బైకుని రోడ్డుమధ్యకి తీసుకొచ్చేడు. అది నిగనిగలాడుతూ కడిగిన నేరేడుపండులా



ఉంది. హేండిలు బారుమీద హైస్పీడులో గాలి ఇబ్బంది పెట్టకుండా షీల్డు ఉంది దొరబాబు గొప్ప జాగ్రత్తలు ఎరిగిన వాడు. జాగ్రత్తలు తీసుకోనేవాడు, వాడు బైకెక్కి ఓ తన్ను తంతే అది గుర్రుమంది. "కూర్చో" అన్నాడు నాతో.

"రెండు కాళ్ళూ పెట్టుకోడానికున్నాయ్. పెట్టుకో. జారబడ్డానికెనకున్నాది. జారబడు, నీకు కొత్తా భయమూ ఉంటే నాసీటు వెనక రింగు గట్టిగా పట్టుకో" అని సలహాలు యిచ్చేడు. నేను మోటారు బైకుల వెనకాల కూర్చుని ప్రయాణాలు చాలా చేసేను. ఎక్కి కూర్చున్నాను.

"రడీ" అన్నాడు. "ఓపదా" అన్నాను.

వదిలిపెట్టేసేడు. జర్రని స్పీడు అందుకుంది. నా దగ్గర గొప్పకి ఆస్పీడు ఎక్కించేదనుకున్నాను. అది వాడి మామూలు స్పీడేనని తరవాత తెల్సింది. ఆ స్పీడు వాడికి కావాలి. దూరదూరాలు పోయి పనులు ముగించుకొని ఉదయానికి ఉదయం మధ్యాహ్నం యింటికి పోతున్నాడు. జిల్లాజిల్లా అవసరమైతే చుట్టపెట్టుకు వస్తాడు. ఏ ఊర్లో పడితే ఆ ఊర్లో కనబడతాడు. తెగతిరుగుతాడు. నా చెవుల్లో గాలి "గీ(గీ(" పెట్టడం మొదలెట్టింది. అది మామూలు గీ(గీ(కాదు. రెండు చెవుల్లోనూ దూరిన కందిరీగల్లాగ గాలి గీ(గీ(పెడ్తూ పొడుస్తున్నాది. భుజంమీది కండువా తీసి తలకి చుట్టుకోడానికి భయం వేసింది. అది పడవ తెరచాపలాగ విడి, వాడ్నీ, నన్నూ బైకుతోసహా పొలాల్లోకి ఎగరగొడ్తుందేమోననిపించింది. అతి కష్టంమీద మెల్లిమెల్లిగా విప్పి తలకి చుట్టుకొన్నాను. కళ్ళనీళ్ళు తుడుచుకొని కళ్ళకి గాలి తగలకుండా తలకాయ దించుకున్నాను. అటుంచి లారీ వస్తున్నాది. ఇటుంచి లారీ వెళుతున్నాది. ఆ రెండింటి మధ్య నుంచీ బైకుని తీసుకుపోయేడు. రెండెడ్ల బాను వెళుతూంటే రోడ్డు ఒడ్డునుంచీ అంత స్పీడులోనూ పోనిచ్చేడు నాకు భయం పట్టుకుంది. వణుకుల వాగు దగ్గరపడుతున్నాది. దాన్ని అందరూ ఎరుగుదురు కదా? దాని బ్రిడ్జి ఎంత

ఎత్తున ఉంది? రోడ్డు ఎంత ఎత్తుకి లేస్తుంది? అక్కడి నుంచి ఎంత కిందికి దిగుతుంది? ఆ బ్రిడ్జి దగ్గర కాస్త జోరు తగ్గించమని చెబుదామనుకుని తర్జనభర్జన పడుతున్నాను. ఇంతలోనే వాగు వచ్చేసింది. అంత స్పీడుతోనూ బైకుని బ్రిడ్జి ఎక్కించేడు. అంత స్పీడుతోనూ బ్రిడ్జిదించేడు. రోడ్డునపడి జామ్మనివదిలి పెట్టేడు. మహాప్రమాదమయిన ఎగుడు, మహా ప్రమాదమయిన దిగుడు. భయం పట్టుకుంది.


స్పీడు తగ్గించమని చెబుదామనుకుంటూనే ఉన్నాను. మేము కూర్చున్న చోటునే, సీట్లమీద కూర్చున్నాం. రోడ్డు క్షణాలమీద మైళ్ళకి మైళ్ళు వెనక్కి అదృశ్యమయి పోతున్నాది. మేం ముందుకి పోతున్నాం.

మూడు రోడ్ల జంక్షన్ గ్రామంవచ్చింది. అంటే సగంపైన ప్రయాణం అయిపోయిందన్నమాట - అని నేననుకుంటూన్నానో లేదో బైకుతో సమానంగా పరిగెడుతూ, గట్టిగా మొరుగుతూ కుక్క తరుముకొచ్చింది. అది మీద పడిపోతుందేమో అని భయపడ్డాను. లిప్తకాలంలో దాని మొరుగులు వెనకబడిపోయాయి. బైకు రెండు ఒంపులు కొట్టింది. నా గుండె ఒంపులు కొట్టింది. వాడు మాత్రం ఠంచనుగా కూర్చుని బైకుని లాక్కుపోతున్నాడు. చాలా సమర్థవంతంగా ఒంపులని తట్టుకొని పోనిస్తున్నాడు. మూడోసారి మరో ఒంపుకొట్టింది. "దొరా!" అని గట్టిగా అరిచేను. వాడికి వి ని పిం చ లే దు. వి ని పిం చే సా వ కా శం లే దు. వాడి చెవులోకి వంగి. అరిస్తే తప్ప వినబడేట్టు లేదు. నా నోట్లో మాటని నోటిలోంచే గాలి వెనక్కి మోసుకుపోతున్నాది. స్పీడు తగ్గించరా బాబూ, ప్రమాదం! అని చెబుదామనే అనుకుంటున్నాను. గుంజాటన పడుతూనే ఉన్నాను. చేత్తో తట్టి చెప్పనా, అనుకున్నాను.

ఒరి పిరికి వెధవా, అంటాడనిపించి-ది. అంటాడు ఖాయమే.

అటూయిటూ చూడ్డంమానేసి వాడిపీపుని చూస్తూకూర్చున్నాను. అది కదలకుండా నిఠారుగా ఉంది. వాడి వెన్నెముకకి వంపులేదు. కొంచెం సేపట్లోనే తల పక్కకి తిప్పిచూసి నిర్ఘాంతపోయేను. పట్నం దగ్గర పడిపోయింది. ఊరికి చిట్టచివర రోడ్డువార సుస్వాగతం చెపుతూ బోర్డు కనపడి అదృశ్యం అయిపోయింది సిటీబస్సులు కనడ్డాయి ఏడు గంటలైనా కాలేదు. రోడ్డు రద్దీలేదు. మైన్ రోడ్డు మీద ఉన్నాం. అప్పుడు దొరబాబు స్పీడు తగ్గించి బాగా తగ్గించి, వెనక్కి తిరిగి "నిన్నెక్కడ దింపమన్నావ్?" అని అడిగేడు "ఇక్కడే దింపి" అని ఠకీమని నా నోట్లోంచి వచ్చింది. అది వాస్తవంగా నేననలేదు. అంతర్గతంగా నాలో ఉన్న భయం నాచేత అనిపించింది వాడు బండి ఆపేడు.

"ఇక్కడెందుకు ఆపేనో తెలుసా, చూడు ఈ రోడ్డు చివరికి పోతే నేను కొన్న ఇంటి స్థలం వెయ్యి గజాలు ఉంది. రెండు లక్షలిస్తామంటున్నారు. చచ్చినా యివ్వను. ఏ లాడ్జింగ్ హవుసో మనమే కడదాం." అన్నాడు. "తప్పకుండా



కట్టు. నువ్వుకాకింకెవరు కడతారు? కానీ యమస్పీడులో వచ్చేవు" అన్నాను.

"అది మన మామూలు స్పీడే. ఆస్పీడు లేకపోతే ఈ బండి ఉండి ఎందుకు?" అన్నాడు.

"మంచి ఉపకారం చేసేవు. థేంక్స్." అన్నాను.


"నో మెన్షన్" అని ముందుకు సాగిపోయేడు నేను కన్నెత్తేసరికి మైన్‌రోడ్డు చివర అదృశ్యం అయిపోయేడు.

నిజంగా నేను మరో అరమైలుకి పైగా మైన్‌రోడ్డు చివరికి వెళ్ళవలసి ఉంది. వాడు ఆపేసరికి భయమే నన్ను దింపేసింది. పక్కనున్న రిక్షావాడినడిగితే మూడు రూపాయలిమ్మన్నాడు మాఊరు నుంచి బస్సుచార్జి పటాన్నికి నాలుగు రూపాయలు. అందుకు నేను నడక పుచ్చుకున్నాను.

హోటల్లో తాగిన కాఫీవేడి, వాసనానోట్లో ఉన్నట్టే ఉంది. పెసరట్టు అల్లం తేన్పు వస్తూనే ఉంది. నలభై కిలోమీటర్లు ముప్పై నిముషాల్లోవచ్చి పట్నం మైన్‌రోడ్డుమీద ఉన్నాను. పరమాశ్చర్యం వేసింది.

పెందరాళే పట్నం వచ్చేనేమో నా పని బాగా సానుకూలం అయింది. సాయంత్రం బస్సూ దొరికింది. తిరుగు ప్రయాణం హాయిగా ఉంది.

ఊళ్ళోకెళ్ళేను. ఘోరమైన వార్తవిన్నాను దొరబాబు ఏక్సిడెంటయి చచ్చిపోయేడు. పణుకులవాగు బ్రిడ్జి ఎత్తుకి ఎక్కి పల్లానికి దిగడంలో వాగులోనికి బోల్తా కొట్టేసేడు (పణుకులమీదపడి వాడిబైకు పప్పు పప్పు అయిపోయింది. వాడు పచ్చడి పచ్చడి అయిపోయేడు) శవ పంచాయితీలో వాడిదగ్గర నాలుగు బంగారంబిస్కత్తులు దొరికేయి. కొన్ని సంవత్సరాలై బంగారం వ్యాపారం చేస్తున్నాడని ఎవరికీ తెలియదు. చచ్చిపోయేకే వాడు ముప్పయి లక్షల సంసారి అనితేలింది.



వ్యాకరణం

కోనే నాగ వెంకట ఆంజనేయులు

రాజారావుకి రాణి అనే ఎనిమిదేళ్ళ కూతురుంది. ఉద్యోగరీత్యా రాజారావు-రాణి పుట్టక ముందునుండే ఢిల్లీలో ఉంటున్నాడు. ఈ మధ్య నే రాజారావు విజయవాడలో ఉన్న వాళ్ళ బ్రాంచి ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చేశాడు కుటుంబ సమేతంగా. చాలాకాలం తరువాత "తెలుగుదేశం"లో ఉండబోతున్నందుకు చాలా ఆనందించాడు రాజారావు.

రాజారావుకి తన మాతృభాష తెలుగంటే చాలా అభిమానం. కానీ పుట్టినప్పటి నుండీ ఢిల్లీలోనే ఉండడంవలన, కాన్వెంట్ చదువు కావడంవలన రాణికి ఇంగ్లీషు, హిందీ మాత్రమే వచ్చు. తెలుగసలు రాదు.

సరే! రాణికి తెలుగు నేర్పడానికి ఓ తెలుగు టీచర్‌ను కుదుర్చుకున్నాడు రాజారావు. ఆ టీచర్—రాధ—రోజూ సాయంత్రం రాజారావు యింటికే వచ్చి తెలుగు నేర్పిస్తోంది రాణికి. రాణి తెలివయినది చాలా త్వరగా తెలుగు మాట్లాడడం, వ్రాయడం, చదవడం నేర్చుకుంది. కాని తెలుగు గ్రామర్ రాణికింకా కొరుకుడు పడలేదు.


ఒకరోజున టీచర్ రాధ రాణికి గ్రామర్ బోధిస్తోంది.

ఒక వాక్యం చెప్తూ రాణి-"నిన్న రాత్రి నేను నాన్నగారి పక్కలో పడుకుంటాను" అంది.

"కాదమ్మా! నిన్నరాత్రి నేను నాన్నగారి పక్కలో పడుకున్నాను" సరిదిద్దింది వెంటనే తెలుగు టీచర్ రాధ.

రాణి ఒక్కనిముషం రాధ ముఖంలోకి చూసింది అదోరకంగా. ఆ తరువాత అంది—

"ఓహో! అయితే నేను నిద్రపోయిన తరువాత అయి ఉంటుంది.



సిగ్నల్ దాటిన కథ:

చంద్రకళకు రెండు రోజుల్లో డాక్టర్ జస్వంత్‌తో ఢిల్లీలో వివాహం జరగబోతోంది. రావ్ ఎంతోకాలం తర్వాత తనింటికొచ్చిన చంద్రకళ అందానికి దాసుడయి ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు.

డివిజనల్ ఆపరేటింగ్ సూపరింటెండెంట్ మహీధర్-అలనాడు తనను కవ్వించిన-తులసిని స్టేషన్లో కలుసుకుని, తనిప్పుడు ధైర్యవంతుడినని రుజువు చేయడానికని తనింటికి తీసుకెళ్ళాడు.

ప్రమాదకరమయిన గుండెజబ్బుతో బాధపడుతున్న సహాసినినికూడా స్కూల్ ఎక్స్‌కర్షన్‌కి తీసుకెళ్ళింది స్వప్న. ఆమెను వెంబడించాడు శివానీ శంకర్.

అందరి కోరికలకూ అడ్డుగా సైక్లోన్!

ఇక చదవండి!

"గుడ్‌మార్నింగ్ మేడం." అన్నాడు చిరునవ్వుతో దగ్గరకొస్తూ

"గుడ్‌మార్నింగ్!" అంటూ తను అతనిని దాటి వెళ్ళిపోబోయింది. కానీ అతనూ తనతోపాటే పక్కనే వడివడిగా నడవసాగాడు.

"నిన్న నాతో అలా కోపంగా మాట్లాడినందుకు రాత్రంతా ఎంతో పశ్చాత్తాప పడ్డారు కదూ?" అడిగాడతను తన కళ్ళల్లోకి చూడ్డానికి ప్రయత్నిస్తూ

"నేనేం పశ్చాత్తాప పడలేదు!"

"పైకి అయిష్టంగా ఉన్నా లోలోపల నన్ను ప్రేమించిన విషయం ఇవాళ తెల్లారుజామున మీకు తెలిసింది కదూ?"

"ఏం కాదు!"

"కాదా? ఆశ్చర్యంగా వుందే! మరి మన సినిమాల్లో హీరోయిన్లు అలా పశ్చాత్తాపపడటం, హీరోని ప్రేమించినట్లు తెలుసుకోవడం అన్నీ రాత్రిళ్ళే చేస్తారుగా?"

"అదంతా రబ్బిష్!"

"ఐ సీ! ఆల్‌రైట్! మీరు చెప్పారు కాబట్టి వప్పుకుంటున్నాను. సరే! అదలా వదిలేయండి! మనం సరిగ్గా కలిసి ఏడడుగులు నడిచాం. ఇప్పటికయినా మీ హృదయంలో..."

తను అతనివంక సీరియస్‌గా చూసేసరికి అతను మాట ఆపేశాడు-తను చరచరా స్కూల్ ఆవరణలో కెళ్ళిపోయింది.

ఆ తరువాత రెండురోజులు అతను కనిపించలేదు. ఆ రెండు రోజులూ అతనిక కనిపించడేమో అనిపించిందిగానీ మూడోరోజు మళ్ళీ తయారు.

సాయంత్రం స్కూలునుంచి బయటికొచ్చేసరికి ఎదుర్చొస్తూ కనిపించాడు.

"హలో స్వప్నాజీ! ఎట్లా వున్నారు మీ లిటిల్ జయంట్స్? మిమ్మల్ని నంచుకు తినేస్తున్నారా? అందుకే మీ అందమయిన ముఖారవిందం అలా చిన్నబోయి, అలసట కనులనిండి, మనసు కలత చెంది..."

"మీరు వెళ్తారా లేదా?" అనేసింది చిరాకుగా.

"ఒక్క కండిషన్ మీద వెళ్తాను!"

"..................."

"ఏమిటది అని అడగరేం?"

"నేనడగను!"

"అయితే నేనే చెప్పేస్తాను! మరేం లేదు మీ హృదయం ఇప్పటికయినా నా వేపు మొగ్గిందో లేదో సె:విస్తే,"

తను ఖాళీగా వెళ్తోన్న రిక్షాను పిలిచి ఎక్కి కూర్చుంది.

"అయ్యో! అయ్యో! మేడం! నేను రిక్షా నడిపినా అదృష్టవంతుడయేవాడిని! మిమ్మల్ని మోసే భాగ్యం కలిగేది. హు! పాడు జన్మ...పాడు జీవితమూ యౌవనం-మూడునాళ్ళా ముచ్చటలోయి-అయ్యయ్యో - నీదు రిక్షా ఎచటికోయి" పాడుతూ నిలబడిపోయాడతను.

కర్చీఫ్ నోటి కడ్డు పెట్టుకుని నవ్వాపుకుంది తను.

"స్వప్నా! వాట్ హాపెన్డ్?" అంటూ రేనీ సిస్టర్ భుజాలు పట్టుకుని కుదిపేసరికి ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చి పడింది స్వప్న. ఖంగారుగా చుట్టూ చూసింది.

పిల్లలంతా రైలు దిగి ప్లాట్‌ఫారం మీద మూడు లైన్లలో నిలబడ్డారు. సామానంతా కోచ్‌లోనే ఉంచి తాళం వేసింది సిస్టర్. నిజానికి ఆ పనులన్నీ తను చేయాల్సి వుంది!

"సారీ సిస్టర్! ఏదో ఆలోచిస్తూ నిలబడిపోయాను!" నొచ్చుకుంటూ అంది స్వప్న.


రేనీ సిస్టర్ ఆమె భుజం తట్టింది నవ్వుతూ.

"డే డ్రీమ్స్ ఆర్ డేంజరస్ యూ నో!"

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఏజెంట్ వాళ్ళ దగ్గర కొచ్చాడు.

"బస్ రెడీగా ఉంచండి! ఇంక బయల్దేరతారా!"

అందరూ స్టేషన్ బయటకు నడిచి సిద్ధంగా ఉన్న బస్ ఎక్కారు.



"సక్కూ!"
"ఊఁ!"
"నువ్వు అద్భుతమయిన అందగత్తెవని ఎవరయినా చెప్పారా?"
"ఊహు! ఎవ్వరూ చెప్పలేదు!"
"మరి నీకా అభిప్రాయం ఎలా ఏర్పడింది?"

"ముందు ఏదయినా మంచిహోటల్ కి తీసుకెళ్ళండి! ఫలహారాలు చేశాక అప్పుడు సైట్ సీయింగ్ కి బయల్దేరదాం!" ఏజంట్ తో చెప్పింది స్వప్న.

అయిదు నిమిషాల్లో బస్ ఓ హోటల్ చేరుకుంది.

డెబ్భయిమందికి వెంటనే ఫలహారాలు ఏర్పాటు చేయగలరేమో కనుక్కోడానికని బస్ దిగి మేనేజర్ దగ్గరకు నడిచిందామె.

ఈలోగా రివ్వున వచ్చి ఆగిన ఆటోలోనుంచి స్ప్రింగులా బయటకుదూకాడు భవానీశంకర్.

"వెల్ కం టు హోటల్ మమతా మేడం!" అన్నాడు చిరునవ్వుతో ఎయిర్ ఇండియా మహారాజు ఫోజులో. "వాతావరణం చాలా అద్భుతంగా ఉంది కదూ! మబ్బులు మూసుకొచ్చేసినయ్. చల్లనిగాలి. వర్షం ఏక్షణంలోనయినా మనల్ని వెంటబడి తరమవచ్చు! లవ్లీ వెదర్" స్వప్న ఉక్కిరి బిక్కిరయింది. తనను రేనీ సిస్టర్ గమనిస్తోందేమోనని!

"పదండి స్వప్నాజీ! డెబ్భయి మందికి ఈ హోటల్ ఫెలో ఫలహారాలు సప్లయ్ చేయాలని ఆదేశాలివ్వటమే కదా కావలసింది. అదంతా నా కొదిలేయండి." అనేసి కౌంటర్ దగ్గరకెళ్ళి స్వప్నను మాట్లాడనీకుండా తనే మాట్లాడేశాడు.

"పదండి స్వప్నాజీ. వెళ్ళి మన సైన్యాన్నంతా హోటల్ తాలూకా కాన్ఫరెన్స్ హాల్లో కూర్చొబెడదాం. ఫలహారాలన్నీ అక్కడికే పంపిస్తానన్నాడు."

"మీ సహాయమేం అఖ్ఖర్లేదు." అంది స్వప్న అసహనంగా.

"ఉచితం మేడం. నేనేం ఛార్జీ చేయబోవటంలేదు దీనికి. ఫ్రీ ఆఫ్ కాస్ట్.

హలో కిడ్స్. ఒకరి తర్వాత ఒకరు లైనుగా బస్ దిగి నా వెనుకేరండి. స్వప్నా టీచర్ గారు చెప్పారలా అని." బస్ లోకి తొంగిచూస్తూ అన్నాడతను.

రెనీ సిస్టర్ ఆశ్చర్యంగా చూసిందతనిని.

పిల్లలందరూ బస్ దిగసాగారు.

"హు ఈజ్ దిస్ జంటిల్మన్?" వివరాల కోసం స్వప్న నడిగిందామె.

స్వప్న "అయి దోన్ట్ నో" అని చెప్పేలోగానే అతను తక్కున అందుకున్నాడు.

"మేమిద్దరం చిన్నప్పటినుంచీ క్లోజెస్ట్ ఫ్రెండ్స్ మేడం. ఆఫ్ కోర్స్ చాలా బంధుత్వం కూడా ఉంది. మీరంతా ఇక్కడికి టూర్ కొస్తున్నట్లూ, నేను మీఅంద

రికీ సర్వీస్ చేయాల్సిన అవసరం చాలా ఉన్నట్టూ ముందే నాకు ఎనిమిది పేజీల ఉత్తరం రాసింది." అన్నాడు భవానీశంకర్ తనఅద్భుతమయిన చిరునవ్వుచిందిస్తూ.

"అంతా అబద్ధం!" ఉక్రోషంగా అంది స్వప్న.

"అహ్హహ్హా!" పగలబడి నవ్వాడు భవానీశంకర్ "అయితే-నేను వుత్తరాలు రాయటంలేదని ఇంకా నా మీద కోపం పోలేదన్నమాట! సిస్టర్! స్వప్నకి నేనంటే భలే కోపం ఉత్తరాలు రాయనని! మీరే చెప్పండి సిస్టర్! ఉద్యోగాలు వెతుక్కునే నిరుద్యోగికి. టైమూ, డబ్బూ ఎక్కడినుంచి వస్తాయ్?"

"ట్రూ!" అంది సిస్టర్ అతనిని జాలిగా చూస్తూ.

"పదండి సిస్టర్! మేడ మీదకు దారి ఇటు! స్వప్నాజీ! పదండి!"

స్వప్నకు అతన్ని చూస్తూంటే కోపం ముంచుకొస్తోంది.

'వాటీజ్ దిస్ నాన్సెన్! ఈ కథలేమిటో, వ్యవహారం ఏమిటోగానీ చాలా దూరం పోతున్నట్లుంది'

పిల్లలంతా మేడ మెట్లెక్కి కాన్ఫరెన్స్ హాల్ కి చేరుకున్నారు. స్వప్న కూడా అన్యమనస్కంగానే వారి ననుసరించింది.

"అన్నట్లు స్వప్నాజీ! ఓ చిన్న విషయం."

"షటప్" అతి ష్టంమీద కోపం అణచుకుంటూ అంది.

"ఏం ఫరవాలేదు! అలాంటి మూడక్షరాల తిట్లంటే చాలా ఇష్టం నాకు! ఇంతకూ మరి ఇప్పటికయినా నన్ను ప్రేమించటం ప్రారంభిస్తున్నారా?" ఆమె వెనుక మెట్లెక్కుతూ అడిగాడతను.

"నో! నో! నో - నెవర్!" అందామె ఎదిరించి కొడుతూ.

"నెవర్ అంటే "అప్పుడప్పుడూ" అనీ, అప్పుడప్పుడూ అంటే ఎప్పుడూ అనీ ఆడవాళ్ళ భాషలో అర్థం మేడం-పదండి! మళ్లీ సైట్ సీయింగ్ కి ఆలస్యం అయిపోతుంది."

సుహాసిని చేయి పట్టుకుని విసురుగా లోపలకు నడిచింది స్వప్న.

o o o o

మహీధర్ కి ఇప్పుడు కొంచెం వుత్సాహంగా వుంది.


గోదావరి, బొకారో ఎక్స్ప్రెస్ లు ఎలాగోలా ప్లాట్ ఫారంమీదకు తీసుకోవడం జరిగిపోయింది ఢిల్లీ-మద్రాస్ జి. టి. ఎక్స్ప్రెస్ ని నెంబర్ సిక్స్ ప్లాట్ ఫారం మీదకు తీసుకునే ఏర్పాటు ప్రారంభమయాయ్ ఇంక తను చేయాల్సిందేమీ లేదు ఈ సమయంలోనే రావ్ కి నచ్చ జెప్పి కొద్దిసేపు పర్మిషన్ తీసుకుని బయటపడాలి!

ఏఎస్సెం వెంకటేశ్వర్రావ్ కి ఫోన్ చేశాడతను.

"ఏ ఎస్.ఎం. సార్!"

"జి టి. వచ్చిందా వెంకటేశ్వర్రావ్?"

"ఇంకా లేదుసార్! వస్తోంది-"



అవినీతిపై అధికారుల దండయాత్ర
LAKSHMI PUBS.
రాయపరాజు
A
హిమామూవీస్
దండయాత్ర
నిర్మాత: D.హిమబిందు
దర్శకత్వం: కె.బాపయ్య

"రాగానే జి.టి ని మళ్ళీ ఇంకేదయినా ప్లాట్‌ఫారంమీదకు బాక్ చేసి, నెంబర్ సిక్స్ ప్లాట్‌ఫారం ఖాళీగా ఉంచండి."

"కానీ—ఎక్కడ బాక్ చేస్తాం సార్?"

మహీధర్ కొద్దిక్షణాలు ఆలోచించాడు.

"నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ని బొకారో ఉన్న ప్లాట్‌ఫారంమీదకు బాక్‌చేసి, జి.టి. ఎక్స్‌ప్రెస్‌ని ఆ ప్లాట్‌ఫారం మీదకు బెర్త్ చేసెయ్.''

"ఓ. కే. సార్.''

ఫోన్‌మీద రిసీవర్ ఉంచి రావ్ వంక చూశాడు మహీధర్. "పొజిషన్ అంతా బాగానే ఉందిసార్." అని చెప్పి తనింటికి వెళ్ళేవిషయం మాట్లాడాలనుకున్నాడ తను. అప్పుడే డివిజనల్ కమర్షియల్ సూపరింటెండెంట్ రాజగోపాలన్ తడిసి పోయిన బట్టలు పిండుకుంటూ లోపలికొచ్చి, కుర్చీలో కూర్చున్నాడు.

"మహీధర్." రావ్ పిలిచాడు.

"యస్సార్."

"నేను ఇందాక చెప్పిన ప్రాబ్లెం గురించి ఏమి ఆలోచించారు?"

మహీధర్ గతుక్కుమన్నాడు.

తెల్లారేసరికి పదిహేను వేలమందికి ఫలహారాలూ, మధ్యాహ్నం భోజనాలూ ఏర్పాటు చేసే విషయం గురించి తను ఆలోచించనేలేదు.

మహీధర్ చకచక ఆలోచించసాగాడు. ఏదొకటి ఠక్కున చెప్పేయాలి. క్షణాల్లో చెప్పేయాలి. లేపోతే తనో డల్ హెడ్ అని ఋజువవుతుంది.

అందరూ మహీధర్ వంకే చూస్తున్నారు.

అతని మెదడు విపరీతమయిన వేగంతో ఆలోచిస్తోంది.

ఇలా ప్రాణంమీద కొచ్చిన సమయంలో తన మెదడు తననెప్పుడూ ఓడి పోనీలేదు. ఠక్కున ఓ ఉపాయం తట్టిందతనికి.


"ఈ పరిస్థితిని కోప్ అప్ చేయాలంటే ఓ మార్గం ఉందిసార్ సిటీలోని మంచి హోటళ్ళు కొన్నిటిని అర్జంటుగా కాంటాక్ట్ చేసి-కాఫీ ఫలహారాలూ, భోజనాలూ సప్లయి చేసేందుకు-వాళ్ళకు కంట్రాక్టు ఇస్తే సరిపోతుందనుకుంటాను..." రావ్ ఓ క్షణం ఆలోచించి "యస్! దటీజ్ గుడ్ ఆయిడియా!" అన్నాడు మెచ్చు కుంటూ

"రాజగోపాలన్? మహీధర్ ప్లాన్ అమలుపరిచే బాధ్యత మీది!" అన్నాడు సీనియర్ డి. సి. యస్. తో.

రాజగోపాలన్ గుండెలు గుభేల్‌మన్నాయ్.

ఈ సైక్లోన్‌లో, ఈ కుంభవృష్టిలో, ఈ అంధకారంలో మంచి హోటల్స్‌కి వెళ్ళి వాళ్ళతో మాట్లాడి ఏర్పాట్లు చేయాలా? ఇంపాజిబుల్?

"నోసార్! అది ప్రాక్టికల్ కాదు!" అన్నాడతను ఖంగారుగా.



"ఏం? ఎందుక్కాదు?" చిరాకుగా అడిగాడు రావ్.

"ఇక్కడికి రావడానికే ఈ గాలిలో చాలా కష్టమయిపోయింది సార్! అదీ గాక రేపు ఉదయానికల్లా సైక్లోన్ మచిలీపట్నం దగ్గర క్రాస్ చేస్తుందని రేడియోలో చెప్పారు. కనుక రాత్రనాను గాలి ఫోర్స్, వర్షం ఎక్కువయి పోతాయట! ఎవరూ ఇళ్ళల్లోనుంచి బయటకు రావద్దనీ, పూరిళ్లు రేకుల కప్పులు, పెంకుటిళ్ళు వున్నవారు-సిమెంట్ కన్‌స్ట్రక్షన్స్‌లోకి మారాలనీ కూడా హెచ్చరిక చేస్తున్నారు."

రావ్‌తోపాటు రాధాకృష్ణ కూడా ఆలోచనల్లో పడ్డాడు. నిజమే! ఈ పరిస్థితిలో ఎవరయినా చేయగలిగిందేమీ లేదు. అయినాగాని జనరల్ మేనేజర్ ఇవన్నీ వినేందుకు సిద్ధంగా లేడు. ఆయనక్కావలసింది ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా వుండటం! అంతే!

టేబుల్ మీదున్న ఫోన్ మోగేసరికి రావ్ ఫోన్ అందుకున్నాడు.

"హలోసార్! నేను ఏ ఏస్సెం వెంకటేశ్వర్రావ్‌ని మాట్లాడుతున్నాను!

"ఎస్. వెంకటేశ్వర్రావ్! ఎనీ ప్రాబ్లెం?"

"అవున్సార్? ఒక లేడీ పాసింజెర్‌కి సీరియస్‌గా వుందిట! అర్జంటుగా డాక్టర్ కావాలంటున్నారు ఆమె బంధువులు."

"ఓ! ఇప్పుడు డాక్టరెక్కడినుంచి వస్తాడు? ఆలోచనలోపడుతూ అన్నాడు రావ్." హఠాత్తుగా అతనికో ఆలోచన తట్టింది.

"మన రైల్వే హాస్పిటల్ డి.యం.ఓ.కి ఫోన్‌చేసి స్టేషన్‌కు రమ్మని చెప్పండి!"

"సైక్లోన్ తగ్గేవరకూ రాలేనన్నారండీ ఆయన..."

రావ్‌కి డి.ఎం.వో మీద కోపం ముంచుకొచ్చింది. "ఇది పండగకాదు. "రాలేను", "రాను" అనడానికి! కనెక్ట్-మీ టు డి. ఎం వో!" రాధాకృష్ణతో అన్నాడతను.

పరిస్థితి తెలుసుకోకుండా రావ్ డి.ఎం.ఓ. మీద కోపం తెచ్చుకోవటం రాధాకృష్ణకు నచ్చలేదు.

"మీరేమీ అనుకోనంటే ఓ విషయం చెప్తానండీ!" అన్నాడతను.

"యస్! వాటీజ్ దట్?"

"సైక్లోన్ క్రమక్రమంగా చాలాసివియర్ అవుతోందండీ! గాలివేగం పెరిగిపోతోంది. దాని సుమారు వేగం తెలిస్తేగానీ మనం ఎవర్నయినా ఇంట్లోనుంచి బయలుదేరి ఇక్కడకు రమ్మనటం భావ్యం కాదు!"

"కానీ కారులో రావటానికేమిటి కష్టం?" అడిగాడు రావ్.

"అది కూడా గాలులు గంటకు ఎన్ని కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయి అన్న విషయం మీద ఆధారపడి ఉంటుందండీ!"

రాధాకృష్ణ ఖచ్చితంగా మాట్లాడడంతో రావ్ ఇంకేమీ అనలేకపోయాడు.

"ఇంతకూ ఇప్పుడీ విండ్స్ విలాసిటీ మనకెలా తెలుస్తుంది?" అడిగాడు మహీధర్.

"వైజాగ్‌నుంచి ఈపాటికే రెండో సైక్లోన్ వార్నింగ్ వచ్చి ఉండాలి! అది చూస్తే గానీ మనకు తెలీదు!" అంటూ కంట్రోల్ ఆఫీస్‌కి రింగ్ చేశాడు రాధాకృష్ణ.

చీఫ్ కంట్రోలర్ శామ్యూల్ ఫోన్ అందుకున్నాడు.

"హలో శామ్యూల్! సీనియర్ డివిజనల్ ఇంజనీర్ రాధాకృష్ణ హియర్! సెకండ్ సైక్లోన్ వార్నింగ్ వచ్చిందా?"

"వచ్చింది సార్!"

"డిటెయిల్స్ చెప్పండి!" అంటూ అతను చెప్పే విషయాలన్నీ తన డయిరీలో రాసుకున్నాడతను.

అందరూ అతనేమి చెప్తాడా అని ఆతృతగా చూడసాగారు.

"ఇది చాలా సివియర్ సైక్లోన్ సార్! తెల్లవారుజామున అయిదు, ఆరు గంటల మధ్య తీరాన్ని తాకవచ్చని అంచనా! గాలులు గంటకు నూటఏభయ్ నుంచీ రెండు వందల కిలోమీటర్లవరకూ వీస్తాయట! మనం అతి భయంకరమయిన తుఫాన్ నెదుర్కోబోతున్నాం ఈసారి..."

"అంటే అదివరకొచ్చిన తుఫానులకంటె ఇది పెద్దదంటారా?" అడిగాడు రావ్. "అవున్సార్! ఇంతకుముందు తుఫానులలో గాలులవేగం సుమారుగంటకునూట యాభై కిలోమీటర్లు దాట లేదెప్పుడూ! ఈ స్థాయిలో చెట్లు కూలటం, పాకలుఎగిరిపోవడం, ఫాక్టరీలు, రైల్వేస్టేషన్లో బస్ షెల్టర్ల—పై కప్పులు ఎగిరిపోవడం జరుగుతుంది. టెలిగ్రాఫ్, ఎలక్ట్రిక్ స్తంభాలు వంకర్లు తిరుగుతాయ్. మనుషులు అతి కష్టంమీద కొద్దిదూరం నడవగలరు. కానీ ఆ స్టేజి దాటిందంటే మాత్రం చాలా కష్టం!

గంటకు రెండువందల కిలోమీటర్ల వేగంతో వీచేగాలులున్న పెద్ద తుఫానులయితే మాత్రం అంతా సర్వనాశనం అయిపోతుంది. అంత భయంకరమయిన



TARA - CBNPW - 1310/83 - TEL

గాలులు ఈ మధ్యకాలంలో ఎవరూ ఎక్స్‌పీరియన్స్ చేసి ఉండరు. ఆ అనుభవాన్ని జన్మలో మర్చిపోలేరెవరూ. మన చెవిపక్కనే పదిజెట్ విమానాలు ఎగురుతున్న శబ్దంలో ఉంటుంది గాలి హోరు.

వర్షం చినుకులు నిటారుగా పడవు! పక్కలకు గాలితోపాటు ప్రయాణిస్తాంటాయ్, అసలు ఎంత పెద్దవర్షం కురుస్తున్నా మనకది కనిపించదు. తెల్లటి తుంపరలా గాలితోపాటు ఎగిరిపోతూంటుంది. మనుషులు గాలికి ఎదురు నడవడం అసలు సాధ్యం కాదు. బాలెన్స్ తప్పితే ఎగిరిపడడానికి కూడా అవకాశం ఉంది."

"ఇప్పుడు వీస్తున్న గాలులవేగం ఎంత ఉంటుందంటారు?" అడిగాడు మహీధర్.

"నూటయాభై కిలోమీటర్ల వేగం వుంటుంది షుమారుగా!....

రావ్‌కి ఆశ్చర్యంగా ఉంది-రాధాకృష్ణ సైక్లోన్ గురించి అన్ని వివరాలందించటం.

"మీరు సైక్లోన్‌గురించి ఇంత డిటెయిల్డ్‌గా ఎలా తెలుసుకోగలిగారు?"

రాధాకృష్ణ చిరునవ్వు నవ్వాడు.

"ఫోర్స్‌డ్ నాలెడ్జ్ సర్! మా మిసెస్ మీటియోరాలజీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టరు-"

"అంటే ఆమె హైదరాబాద్‌లో ఉంటారా?"

"అవునండీ!"-

"మరి సంసారం?"

"సెలవుల్లోనే సంసారం! అందుకే ఎప్పుడూ ఇద్దరిలో ఎవ్వరోకరు 'లీవ్' లో ఉంటాము-" నవ్వుతూ అన్నాడు రాధాకృష్ణ.

"ఐసీ! అయితే మీరిప్పుడు మాకు చాలా విలువయిన వ్యక్తి అన్నమాట!" తలపంకిస్తూ అన్నాడు రావ్.

"ఆల్వేస్ ఎట్ యువర్ సర్వీస్ సర్!" వినయంగా అన్నాడు రాధాకృష్ణ.

"మహీధర్" పిలిచాడు రావ్.

"యస్సర్!"

"ప్రస్తుతానికి హోటల్స్‌ని కంటాక్ట్‌చేసే విషయం అలా ఉంచండి! ముందు ఆమె ఎవరికో సీరియస్‌గా ఉందనీ, డాక్టరు కావాలంటున్నాడు గదా ఏ. ఎస్. ఎమ్? ఏంచేద్దామంటారు?" అందరూ కొద్ది క్షణాలు నిశ్శబ్దం అయిపోయారు. హఠాత్తుగా మళ్ళీ మహీధర్ మెదడు పనిచేసింది.

ప్లాట్‌ఫారం మీదున్న ప్రయాణీకుల్లో ఎవరయినా డాక్టర్స్ ఉన్నారేమో తెలుసుకుని వారిని మన ఎడ్మినిస్ట్రేషన్ తరపున రిక్వెస్ట్‌చేస్తే ప్రాబ్లెమ్ సాల్వ్ అవుతుంది సార్!"

"వెరీగుడ్ మహీధర్! ఆ ఏర్పాట్లేవో కూడా మీరే చూడండి!"

"ఓకే సర్-"

మహీధర్ లేచి రంగనాయకులవేపు చూశాడు.

"రంగనాయకులూ!"

"యస్సార్!"

"నాతో రండి!"

"అలాగే సార్!"

ఇద్దరూ ఏ.ఎస్.ఎమ్ ఆఫీసుకు నడిచారు.

మరి కాసేపట్లో ప్లాట్ ఫారమ్ లన్నిటిమీదా స్పీకర్స్‌లో ఎనౌన్స్‌మెంట్స్ వినిపించసాగినయ్.

"ప్రయాణీకులకు గమనిక!

ప్రయాణీకుల్లో ఎవరయినా డాక్టర్స్ ఉన్నట్లయితే వారు వెంటనే స్టేషన్ సూపరింటెండెంట్‌ని కలుసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము. ప్రమాద పరిస్థితిలో ఉన్న ఒక స్త్రీకి వైద్య సదుపాయంకోసం ఈ ప్రకటన చేయుచున్నాము! ధన్యవాదాలు!"

"ప్రయాణీకులకు గమనిక!

మీలో ఎవరయినా డాక్టర్స్ ఉన్నట్లయితే వారు వెంటనే స్టేషన్ సూపరింటెండెంట్‌ని కలుసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము. ప్రమాద పరిస్థితి..."

రావ్ సంతృప్తి చెందాడు.

పది నిమిషాలపాటు అదే ప్రకటన పదే పదే రిపీట్ చేశాక మరో పది నిమిషాలకు లావుగా, పొడుగ్గా నైట్‌గౌన్‌లో ఉన్న ఓ వ్యక్తి నోట్లో పైప్ పెట్టుకుని చెదిరిన క్రాపూ, నిద్రమత్తు కళ్ళతో స్టేషన్ సూపరింటెండెంట్ గదిలో అడుగు పెట్టాడు. రావ్ వంక ఓ క్షణం చూసి.

"వాటీజ్‌ది ప్రాబ్లెమ్ అయ్‌సే?" అన్నాడు కళ్ళు చిట్లిస్తూ. ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు చాలా కాంతిగా కళగా ఉన్న ముఖంతో అతని చేయి పట్టుకుని నిలబడి ఉన్నాడు.

రావ్‌కి అతనెవరో అర్థం కాలేదు.

అతను ఏ విషయం గురించి మాట్లాడుతున్నాడో కూడా తెలీటంలేదు.

అతను మాట్లాడేది రైలు గురించా, పేషెంట్ గురించా?

"మీరు మాట్లాడేది ట్రైన్ గురించా?" అడిగాడు రావ్.

"నోనోనో! ట్రైన్స్ ఇంకోరోజువరకూ కదలవని నాకు తెలుసు! మీరెదో

ఎనౌన్స్‌మెంట్ ఇస్తున్నారని మా అబ్బాయి నన్ను నిద్రలేపి తీసుకొచ్చాడు. వాటీజ్ దట్? ఈజెనీబడి సీరియస్?"

రావ్ మొఖంలో ఆనందం కనిపించింది.

"మీరు " అన్నాడు వివరాలకోసం ఎదురుచూస్తూ

"అయామ్ డాక్టర్ రాంజీరావ్ అయ్‌సే-హార్ట్ స్పెషలిస్ట్-"

అక్కడున్న వారంతా ఆపేరు చెప్పటంతో ఉలిక్కిపడ్డారు.

డాక్టర్ రాంజీరావ్ పేరు భారతదేశమంతా తెలుసు. మనదేశంలో హార్ట్ స్పెషలిస్ట్‌గా అద్భుతమైన పేరు ప్రఖ్యాతులు గాంచిన ఇద్దరు ముగ్గురు డాక్టర్లలో అతనొకడు.

"వెరీ ప్లీజ్ టు సీ యూ సర్! కూర్చోండి" అన్నాడు రాధాకృష్ణ చప్పున లేచి. బై ది బై- వారు మా డివిజనల్ మేనజర్ మిస్టర్ రావ్! రావ్‌తో కర చాలనం చేశాడు డాక్టరు.

పేషంట్ ఎక్కడ? వాటీజ్ ది ప్రాబ్లెమ్?" అడిగాడతను.

"లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో ఒకఅమ్మాయి పాయిజన్ తీసుకుందండి! నోట్లో నుంచి బ్లడ్ వస్తోందట..."

డాక్టర్ కొంచెం ఆత్రుతగా చూశాడు.

పాయిజన్ ఎందుకు తీసుకుంది?"

"ఆత్మహత్య చేసుకోడానికి! కట్నం గొడవల్లో భర్తతో పేచీపడిందట- ఈ మధ్యనే పెళ్ళయిన అమ్మాయి పాపం!" మహీధర్ చెప్పాడు.

"వట్సాల్‌రైట్- అయ్ విల్ ట్రీట్ హర్! కానీ నా బిల్లు ఎవరిస్తారు? నేనే కేస్ తీసుకున్నా అయిదువేల రూపాయలు ఛార్జి చేస్తానన్న విషయం మీకు తెలుసా?

రావ్‌కేం మాట్లాడాలో తోచలేదు, మహీధర్‌వేపు చూశాడు సాలోచనగా. మహీధర్‌క్కూడా ఏమీ తోచడం లేదు.

"కమాన్ జంటిల్మన్- సే సమ్‌థింగ్ అయ్ సే, యువర్ రైల్వే కెన్ పే ది బిల్ అయ్ హోప్! ఓ డాక్టర్‌కి అయిదువేలు బిల్లు కట్టలేదా మీ రైల్వే?"

"అఫ్ కోర్స్! కట్టొచ్చనుకోండి! కానీ చాలా సమస్యలున్నాయి దానికి! చిన్న మొత్తం అయితే ఫరవాలేదు-"

"డాడీ!" అన్నాడా కుర్రాడు మెల్లిగా.

"డాక్టర్ రాంజీరావ్ కొడుకువేపు చూసాడు."

"యస్ డియర్!"

"నేను చెప్పింది అడగరూ?"

"వాటీజ్ దట్ అయ్‌సే?"

"అదే డాడీ! ఎలక్ట్రిక్ ఇంజన్లో ఎక్కుతా."

"సే-మిస్టర్ రావ్! మావాడు ఎలక్ట్రిక్ ఇంజన్‌లో జర్నీ చేయాలని చాలా



జయలక్ష్మీ ఆర్ట్ ప్రొడక్షన్స్
LAKSHMI PUBS
దర్శకత్వం వి.వి.యస్.రెడ్డి నిర్మాతలు జగ్గుబాబు సత్యారెడ్డి

ఇదిగా ఉన్నాడు-కెన్ యూ ఓ బ్లైజ్?"

రావ్ చిరునవ్వు నవ్వాడు.

"బై ఆల్ మీన్స్ మీరు వెళ్ళే ట్రైన్ ఇంజన్‌లోనే-మీరు దిగేస్టేషన్‌వరకూ మీవాడు ఇంజన్‌లో వెళ్ళే ఏర్పాటు చేస్తాను. ఈజిట్ ఆల్ రైట్!"

కుర్రాడి మొఖంలో ఆనందం వెలిగిపోయింది.

డాక్టర్ ముఖంలోకూడా ఆనందం కనిపించింది.

"థాంక్యూ!" అన్నాడు పొలైట్‌గా.

"కానీ-మీవాడు ఇంజన్‌లో ట్రావెల్ చేసినందుకుగాను మీరు స్పెషల్‌ఛార్జ్ కట్టాల్సి వుంటుంది." అన్నాడు రావ్ కొద్ది క్షణాలాగి.

"హౌమచ్ అయ్‌సే?"

"అయిదువేలు!"

ఒక్కక్షణం అక్కడ నిశ్శబ్దం తాండవం చేసింది.

ఆతరువాత అందరూ మనసారా నవ్వేశారు.

"యూ ఆర్ టూ స్మార్ట్ మిస్టర్ రావ్! ఓ,కే! లెటజ్ ఫర్‌గెట్ మనీ! ఛార్జి చేయను-మీరూ ఛార్జి చేయవద్దు. నన్ను ముందు పేషంట్‌ని చూడనీండి-"

అక్కడున్న వారంతా డాక్టరుతోబాటు బయటకు నడిచారు.

రంగనాయకులు ఒక్కడే తన గదిలో మిగిలాడు.

"హమ్మయ్యా" అనుకున్నాడతను ప్రశాంతంగా.

"చాక్‌లెత్తు-"

రంగనాయకులు చటుక్కున ఆలోచనల్లోనుంచి తేరుకుని ఆ మాటలు వచ్చినవేపు చూశాడు.

ఓ చిన్న పాపాయి! తప్పటడుగులు వేస్తూ గదిలోకొచ్చి నిలబడ్డాడు. చిన్నచొక్కా, నిక్కరూ, కాళ్ళకు బూట్లూ వేసుకుని నోట్లో వేలు పెట్టుకున్నాడు తనవంకేచూస్తూ రంగనాయకులకు గుండెల్లో కలుక్కుమంది. తన బాబిగాడిది కూడా ఇదే వయసు అప్పుడు! అచ్చం ఇలాగే డ్రస్‌వేసుకుని తప్పటడుగులతో ఇల్లంతా తిరుగుతూండేవాడు.


రూమ్ బయట స్పీకర్‌లో ఎనౌన్స్‌మెంట్ వినిపించసాగింది.

"ఒక ముఖ్య ప్రకటన.

షుమారు రెండేళ్ళ వయసుగల బాలుడు అయిదవ నెంబరు ప్లాట్‌ఫారం మీద తప్పిపోయినాడు ఎర్ర రంగు చొక్కా, నిక్కరు, బూట్లతో ఉంటాడు. నలుపు ఛాయ-ఈ బాలుని చూచినవారు వెంటనే స్టేషన్ మాస్టరు ఆఫీస్ వద్దకు చేర్చవలసిందిగా కోరుతున్నాము! థాంక్ యూ-"

రంగనాయకులు ఆ కుర్రాడి దగ్గరకొచ్చాడు.

(సశేషం)



వ్యవస్థ

కాపిటలిస్టులు
రోజూ రేప్ చేస్తున్న
పిచ్చిది—

మాంత్రిక సంధి

జీవి +
విత్తం =
జీవితం

నోటు

మనిషి మెదడును
నమిలేస్తుంది
అందుకే కాబోలు
దాన్లో మూడు సింహాలున్నాయ్

సున్నా

ప్రేమ క్రికెట్‌లో
నువ్వెన్ని
త్యాగాల పరుగులు చేసినా
ఆమె వేసిన ఒకే ఒక
మోసపు బంతికి
క్లీన్ బవుల్డ్
నీ స్కోరు
శూన్య
o

విప్లవం

౧ ౨ ౩ ౪ ౫

— ప్రసేన్ —



ఆపదేనా?

తెల్లవారేటప్పటికి మా వీధంతా గుప్పుమంది-శేషగిరి కూతురు పార్వతి లేచిపోయిందని. నేనుపొద్దున్నే కాఫీ తాగుతూ వుండగా నా భార్య ఈ వార్త తెచ్చి నా చెవిలో వేసింది. ఇలాంటి పుకార్లను నమ్మడానికి యిష్టం లేక, కాస్త విసుగ్గా "యెవరన్నారు?" అన్నాను "ఒక రనడ మేమిటండీ, వీధిలో అందరూ అనుకుంటుంటేనూ!" అన్నది నా భార్య. యే మనడానికీ తోచక కాఫీ తాగుతూ వుండిపోయినాను. ఒక నిమిషం తర్వాత నా భార్యే మళ్ళీ అన్నది. "వాళ్ళింటికి వెళ్ళి కాస్త విచారించిరాకూడదూ! యెంతయినా ఆయనా, మీరూ స్నేహితులే కదా!" నిజమే, శేషగిర్రీ, నేనూ స్నేహితులమే. కానీ, నా భార్య ఉద్దేశమేమిటా అని నాకు సందేహం కలిగింది. లేచిపోవడాలన్నా రంకుతనాలన్నా, ఆడవాళ్ళకు మహా ఆసక్తి. అపనిందలను పదేపదే వినడం పట్లా, ప్రచారంచేయడంపట్లా వున్నంత అభిలాష వీళ్ళకు దేనిపట్లా వుండదని నాకు గట్టి నమ్మకం. అందుకని నా భార్య ముఖంలోకి పరీక్షగా చూసినాను. యేమీతొణక్కుండా ఆమె "అలాచూస్తారేమిటి! ఆపదలో వున్నవాళ్ళను కాస్త వెళ్ళి పలకరిస్తే తప్పా! పాప, ఓదార్చే వాళ్ళుకూడా లేక వాళ్ళెంతగా కుమిలిపోతున్నారో!" అన్నది. ఈ మాటలతో నాకు కొంత పశ్చాత్తాపం కలిగింది. మిత్రుడు ఆపదలో వుండగా

రాచమల్లు రామచంద్రారెడ్డి



నాకు సానుభూతి కలక్కపోగా, నా భార్య చిత్తశుద్ధిని శంకించే స్థితికి వెళ్ళినాను. శేషగిరి ఇంటికి పోవడానికి సిద్ధమౌతూ, హఠాత్తుగా యేదో మనసులో మెదలి, "ఇంతకూ, యిది ఆపదేనంటావా?" అన్నాను. నా భార్యకు చురుక్కుమన్నట్లుంది. "కూతురు లేచిపోతే ఆపద కాక, వేడుక అవుతుందా! మీకూ ఆడపిల్లలున్నారు. గుర్తుంచుకోండి" అంటూ విసవిసా లోపలికి వెళ్ళింది.

"ఇది ఆపదేనంటావా?" అని నేను వూరకే అడగలేదు శేషగిరి యెన్నాళ్ళున్నా కూతురుకు తగిన సంబంధం తెచ్చే స్థితిలో లేడు పార్వతికి ఇంతవరకు పెండ్లి కాకపోవడమే దానికి నిదర్శనం. ఈ పవిత్ర భారతదేశపు తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు తాము పెండ్లి చేయనూలేరు; ఆ పిల్లలు తెగించి తమ పెండ్లి తామే చేసుకుంటామంటే సహించనూ లేరు. పార్వతి లేచిపోయిందంటే, ఆ పిల్ల సుఖపడినా, సుఖపడకపోయినా, శేషగిరికి మాత్రం పెద్దభారం తొలగిపోయినట్లే అని నాకు అనిపించింది. "ఇది ఆపదే నంటావా?" అని నేను అనడం అందువల్లనే. అయినా నా మనసులోని మాట మనసులో వుంచుకోకుండా ఆడవాళ్ళముందు బయటపెట్టడం తప్పే అని ఒప్పుకోవాలి ఈ ఆడవాళ్ళకు తోడి ఆడవాళ్ళపట్ల అభిమానం పుట్టినా, అసూయపుట్టినా పట్ట శక్యం

కాదు. అదొక చిత్రమయిన వర్గ చైతన్యమో, వర్గ సంఘీభావమో అనుకోవాలి. లేచిపోయినవాళ్ళపట్లా, అపనిందలకు గురయిన వాళ్ళపట్లా యెంతకసిగా యెంత క్రూరంగా ప్రవర్తించగలరో మగని మరణం వల్లనో, మగవాళ్ళ దౌష్ట్యం వల్లనో ఆపదలో వున్నవాళ్ళ పట్ల అంత దయా, అంత సానుభూతీ చూపించగలరు ఈ ఆడవాళ్ళు. అందుకనే పెండ్లీ, పేరంటం లాంటి శుభకార్యాల్లో అంత ఐకమత్యంగా, అంత అన్యోన్యంగా మెలగగలరు; నెలతప్పినా నెలలు నిండి నొప్పులు వచ్చినా, అంత నిష్కపటమయిన సహానుభూతి చెందగలరు.

నేనూ, శేషగిరీ ఒకే ఆఫీసులో పనిచేయడమేకాక, ఒకే వీధిలో కాస్త దగ్గర దగ్గరగా నే కాపురం వుంటున్నాం. సాధారణంగా ఇద్దరమూ కలిసే ఆఫీసుకు పోతాం, ఆఫీసునుండి కలిసే ఇంటికి వస్తాం. అందువల్ల యిద్దరమూ స్నేహితులమని చెప్పుకోదగిన స్థితి ఏర్పడింది. అయినా అది పట్నవాసపు స్నేహితంగానే మిగిలిపోయింది. మనసులు విప్పి మర్మాలు బయట పెట్టుకునే స్థితికి ఆ స్నేహితం ఎప్పుడూ ఎదగనేలేదు. ఏమైనా, ఏదో ఒక స్థాయిలో మేమిద్దరం స్నేహితులమే. కనుక శేషగిరిని పరామర్శించడం మిత్రధర్మమని నాకూ అనిపించింది.

నేను వెళ్ళేటప్పటికి శేషగిరి వరండాలో కూర్చొని ఉన్నాడు. లోపల గదిలో శేషగిరి భార్య నాగరత్నమ్మా, పిల్లలూ, నలుగురైదుగురు ఇరుపొరుగు ఆడవాళ్ళూ ఉన్నట్లుంది. నన్ను చూసి, "రా" అంటూ శేషగిరి తన పక్కనున్న కుర్చీ చూపించినాడు. నేను మౌనంగా కూర్చున్నాను. అతని ముఖంలోని దిగులూ, దుఃఖమూ చూసి నాకు నోటమాట రాలేదు. అతన్ని ఎలా పరామర్శించాలో, ఏమని ఓదార్చాలో, నాకేమీ తోచలేదు లోపలినుండి నాగరత్నమ్మ ఏడుపూ, ఆ ఏడుపులో నే కూతురుమీద తిట్లూ, శాపనార్థాలూ కురిపించడమూ – అన్నీ వినిపిస్తున్నాయి. "దాని నెత్తిన నిప్పులు పొయ్యా, దాని ముండమొయ్యా, దాని కడుపున కల్లగొట్టా" అంటూ ఆమె పార్వతికి శాపాలు పెడుతున్నది. "ఊరుకో అక్కా, ఎంతైనా నీ కడుపున పుట్టినబిడ్డ. అంతంత మాటలు అనవద్దు" అంటూ ఎవరో ఆమెను ఊరడించడానికి ప్రయత్నిస్తున్నారు. "అది నా బిడ్డ కాదు, నా కడుపున పుట్టిన పుండు పాడు ముండ! పీడముండ! పోతూ పోతూ నా గొంతులో ఇంత విషం పోసి పోకూడదూ!" అంటూ నాగరత్నమ్మ వెక్కిళ్ళమధ్యనే తిట్టుతున్నది.

రెండు మూడు నిమిషాలు నేను మౌనంగానే కూర్చున్నాను. శేషగిరి కూడా మౌనంగానే వున్నాడు. ఏమీ మాట్లాడకపోవడం బాగుండదని నేనే మొదలు పెట్టినాను. "ఏం శేషగిరీ, ఏం చేద్దామనుకుంటున్నావ్?" అన్నాను మెల్లగా. "చేసేదేముంది! ముఖం చాటు చేసుకోపడమూ, ముసుగుపెట్టి పండుకోవడమూ తప్ప!" అన్నాడు శేషగిరి. ఒకక్షణం ఆగి అతనే మళ్ళీ అన్నాడు. "మళ్ళీ తల ఎత్తుకొని తిరగడం ఎలాగో

అమాయకరావ్ తన ప్రియురాలితో రైల్లో ప్రయాణం చేస్తోంటే హఠాత్తుగా రైలు ఓ సొరంగంలోకి ప్రవేశించి అంతా చీకటి మయం అయిపోయింది. మళ్ళీ వెలుగులోకి వచ్చాక అతను ఆమె దగ్గరగా జరిగి "ఇందాక ఆ చీకట్లో నిన్ను ముద్దు పెట్టుకుని ఉన్నట్లయితే ఏమనేదానివి?" అనడిగాడు ఉత్సాహంగా. "అంటే–ముద్దు పెట్టుకుంది నువ్వు కాదా?" ఆశ్చర్యంగా అడిగిందామె.



తెలియకుండా వుంది." ఈ మాట అన్నప్పుడు దుఃఖంతో అతని కంఠం వణికింది. అతని దుఃఖం చూసి నాకూ నిజంగా బాధ కలిగింది. ఏదైనా సలహా ఇస్తే బాగుంటుందేమో అనే ఉద్దేశంతో నేను "పోలీసులకు రిపోర్టు ఇవ్వదలచుకున్నావా?" అన్నాను. అప్పుడతను ముఖం ఎత్తి నావైపు చూస్తూ 'ఎందుకూ? లేచిపోయిన ముండ అనే అపకీర్తి ఎలాగూ తప్పదు కదా! పోయిన ముండ పోనీ. పోలీసులు పట్టుకొని తీసుకు వచ్చినా ఆ ముండకి కొంపలో ఇక స్థానం లేదు" అన్నాడు. మాట కటువుగా వున్నా, అతని గొంతులో కోపంకంటె దుఃఖమే ఎక్కువగా ధ్వనించింది. వెంటనే అతను జేబులోనుండి ఒక కాగితం తీసి నా చేతికిచ్చాడు. పార్వతి రాసిపెట్టిపోయిన జాబు అది. దానిలో మూడే వాక్యాలున్నాయి. "పోలీసులకు ఫిర్యాదు చేసినా, నన్ను పట్టుకోడానికి ప్రయత్నించినా, మీకు నా శవం మాత్రమే దొరుకుతుంది. కొన్నాళ్ళ తర్వాత నేను క్షేమంగా తిరిగి వస్తాను. అంతవరకు క్షమించండి" అంతే ఆ జాబు. ఆ జాబులో కనపడిన ఆ దృఢ నిశ్చయమూ, ఆ ఆత్మవిశ్వాసమూ చూసి నాకు ఆశ్చర్యం కలిగింది పార్వతిపట్ల నాకు ఎప్పుడూ లేని గౌరవభావం కలిగింది. జాబు తిరిగి అతని చేతిలో పెడుతూ నేను "ఇంతకు ఎప్పుడు పోయింది? ఎలా పోయింది?" అని అడిగినాను. నిజానికి "ఎవరితో పోయింది" అనేది నేను అడగదలచుకొన్న ప్రశ్న. ఆ ప్రశ్న అడగలేక అలా మరేదో అడిగినాను. నేను అడగలేకపోయిన ప్రశ్నకు కూడా శేషగిరి జవాబు చెబుతున్నట్లుగా మాట్లాడినాడు. "ఎప్పుడు పోయిందో, యెలా పోయిందో, ఎవరితో లేచిపోయిందో యేమీ తెలియడంలేదు. ఏ కులం తక్కువవాడో అయివుంటాడు. అర్ధరాత్రి తర్వాత వెళ్ళిపోయినట్లుంది. పోదలచుకున్నవాళ్ళకు ఏ వేళప్పుడైనా రైలో, బస్సో ఏదో ఒకటి దొరుకుతుంది గదా!" అన్నాడు అతను. నేను మరో రెండు మూడు నిమిషాలు మౌనంగా కూర్చొని, తర్వాత సెలవు తీసుకొని వచ్చేసినాను. వస్తూ, వస్తూ, శేషగిరి కులం ప్రస్తావన తెచ్చినందుకు ఆశ్చర్యపడుతూ వచ్చినాను. కూతురు లేచిపోవటం తలిదండ్రులకు మోయలేని అవమానమే అయితే, కులస్థునితో లేచిపోతే ఆ అవమాన భారం తక్కువౌ

తుందా, అనే సందేహం నాకు కలిగింది. ఇది జరిగి మూడు నెలలకు పైగా అయింది. శేషగిరి ఒక నెల సెలవు పెట్టి. తరువాత యధావిధిగా ఆఫీసుకు వస్తున్నాడు ఆ దుఃఖంనుండి అతను మెల్లగా కోలుకుంటున్నట్లుంది. ఈలోగా పార్వతిని గురించి కొన్ని వార్తలు తెలుస్తూనే వచ్చినాయి. ఆమెను లేవదీసుకుపోయినవాడు బాంకిలో గుమాస్తా అనీ, హైదరాబాదుకు బదిలీ అయి. పోతూ పోతూ పార్వతిని లేవదీసుకు పోయినాడనీ వెల్లడయింది. కొంతకాలం తర్జన భర్జనలు జరిగిన తర్వాత అతను హరిజనుడని కూడా ధ్రువపడింది. మనిషి అందంగానే వుంటాడనీ, మొత్తంమీద బుద్ధిమంతుడే అనీకూడా తెలిసింది.

ఈ దినం సాయంత్రం నేను కాంపు నుండి తిరిగి వచ్చేటప్పటికి నా భార్య తలవాకిట్లోనే యెదురయి, ముసిముసి నవ్వులతో "విన్నారా?" అన్నది వినడానికి నేను ఆగినాను. "పొద్దునపార్వతి వచ్చింది. అంటూ ఆమె నా ముఖంలోకి చూసింది. "ఎవరూ? శేషగిరి కూతురా?"అన్నాను. "ఆఁ. కూతురూ, అల్లుడూ ఇద్దరూ వచ్చినారు. ఎంత చూడముచ్చటగా వున్నారనుకున్నారో! చిలకా గోరింకల్లా ఉన్నారు. పార్వతి ఇంకా అందంగాతయారయింది. సంతోషంతో ముఖం వెలిగిపోతున్నదంటారే అలాంటి వెలుగు నాకీనాడు పార్వతి ముఖంలో కనిపించింది" అన్నది నా భార్య. "నీ వెప్పుడు చూసినావు?" అని అడిగినాను నేను. "ఎప్పుడేమిటి! మధ్యాహ్నం భోంచేసి, తీరికగా వెళ్ళి, రెండు గంటలకు పైగా వాళ్ళింట్లోనే వున్నాను. పార్వతి యింటందరికి బట్టలూ,బహుమతులూ తెచ్చింది. తమ్ముళ్ళకూ, చెల్లెలికీ రెడీమేడ్ బట్టలు తెచ్చింది. తల్లికి మంచి చీర తెచ్చింది. ఇంకా ఏమేమి తెచ్చిందో! ఇల్లంతా కళకళలాడిపోతున్నది. అల్లుడినీ, కూతురినీ చూసుకొని శేషగిరీ, నాగరత్నమ్మా యెంతగా పొంగిపోతున్నారో! కండ్లారా చూస్తే గానీ మీరు నమ్మలేరు." అంటూ నా భార్య ఉపన్యాసం ముగించింది. చిరునవ్వు నవ్వుతూ నేను వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను. "అసలు విషయం అది కాదండీ, ఇప్పుడు మనం వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాలి" అన్నది ఆమె. "ఎందుకంట?" అన్నాను. "ఎందుకేమిటి! ఇంట్లో శుభకార్యం జరిగితే చుట్టపక్కాలను భోజనానికి పిలవరూ! అంతే ఇది. కూతురూ, అల్లుడూ వస్తే ఇంట్లో పండగ చేసుకోరూ! అంతేఇది. మిమ్మల్ని పిలవడానికని శేషగిరి ఇప్పటికే నాలుగుసార్లు మన ఇంటిచుట్టూ తిరిగినాడు. తన సంతోషాన్ని మీతో పంచుకోవాలని ఆయన యెంతగా ఉబలాటపడుతున్నాడో మీరు ఊహించలేరు" అంటూ నా భార్య చిన్న ఉపన్యాసం ముగించింది. "నిజంగా అంత ఉబలాట పడుతున్నాడా?" అన్నాను నేను. "అయ్యో! మీరు చూసిందాకా నమ్మలేరు. మధ్యాహ్నం వెళ్ళి అక్కడ రెండు మూడు గంటలసేపు వున్నానా. అంతసేపూ శేషగిరి అల్లుడిచుట్టూ తిరగడమూ అల్లునికి అవసరాలు కనుక్కోవ


కవితాగానం చేసే కళ్లకు...
ఐటెక్స్
చూపులనే మాటలుగా మార్చే ఐటెక్స్
అపురూప సౌందర్యంతో పొంగిపోయే
యువ్వనంతో మురిపించే వనితల వదనాలను
ఆకర్షించే అతివల కళ్లను, అందంగా
కొనచూపులతో సరసమాడించేది ఐటెక్స్
శాస్త్రీయ విధానంలో తయారుచేయబడు
ఐటెక్స్ కాటుక అందాలు చిందేటి
యువతుల కళ్లను దోషమేమీ చేరనీయక
చల్లగా కాపాడుతుంది...
ఐటెక్స్ 42 సంవత్సరములుగా మీ నమ్మకానికి
EYETEX
REGD.
Eyetex
Regd.
అరవింద్ లాబొరేటరీస్
మద్రాసు 600 033
ప్రగతి ఏజెన్సీస్, పో. బా. 162, విజయవాడ-1

స్వాములవారికి భక్తులు సేవలు చేసినట్లు అనిపించింది నాకు," అంటూ నా భార్య ఒక క్షణం ఆగి, "అయ్యో, నామతి మండా! ఇంతకూ అసలు విషయం మీకు చెప్పనే లేదు. ఇంట్లో పిండి వంటలు చేయిస్తున్నారు. యెన్నినుకున్నారో! అదే పనిగా ఒక వంటమనిషిని పిలిపించి, పది కిలోల చక్కెరతెప్పించి నాలుగైదు రకాల పిండివంటలు చేయిస్తున్నారు. "ఇన్నెందుకు కక్కా?" అని అడిగినాను. నాగరత్నమ్మ సంబరంపట్ట లేక ముఖం చాటంత చేసుకొని, "యెన్ను న్నయ్ లేమ్మా! పార్వతికి నెల తప్పింది గదా," అని జవాబు చెప్పింది. అదీ అసలు విషయం, అంటూ నా భార్య ఉపన్యాసం ఆపి, తానే యేదో ఘనకార్యం చేసినట్లు విజయగర్వంతో నావైపు చూసింది. నేను లోపలినుండి వస్తున్న నవ్వును అణచుకుంటూ మెల్లగాఅన్నాను. "పార్వతి లేచిపోయిన రోజున శేషగిరికి ఆపద వచ్చిందన్నావే—ఇప్పుడు చెప్పు, అది ఆపదేనా?" నా భార్య ఒక క్షణం తెల్లబోయి, వెంటనే తేరుకొని, కిలకిల నవ్వుతూ, "యెప్పటి మాటలో! యిప్పుడవన్నీ యెందుకండీ!" అన్నది. నేను అంతటితో వదలిపెట్టకుండా, "కూతురు లేచిపోతే ఆపదేనంటావా? నీకూ ఆడపిల్లలున్నారు, ఆలోచించి చెప్పు" అన్నాను. నా భార్య జవాబుచెప్పకుండా బుంగమూతి పెట్టుకొని ఇంటోకి పోయింది ●

శ్రీ పంచవటి చిత్రాలయ

బంగారు కాపురం



నిర్మాత:
కోగంటి విశ్వేశ్వరరావు

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం:
చంద్రశేఖరరెడ్డి బి.ఏ.,

మాటలు: సత్యానంద్

సంగీతం: జె.వి.రాఘవులు

కెమెరా: లక్ష్మణ్ ఘోరే

PADMALAYA PUBS.

పండగ నవ్వు

సదానంద్ శారద



ఉగాదిరోజు పొద్దున్నే వినతి లేచి భర్త చలపతి భుజాల చుట్టూ చేతులు వేసి గోముగా చూసింది.

భార్య తనకేదో ఆదేశించబోతున్నదని అర్థంచేసుకున్న చలపతి—

"ఊ...చెప్పు" అన్నాడు.

"ఇవ్వాళ ఉగాది పండుగ కదా..."

"అవును-"

"ఈరోజు ఆనందంగా, నవ్వుతూ గడిపితే సంవత్సరమంతా ఆనందంగా హాయిగా నవ్వులతో గడిచిపోతుందట"

"ఊ...."

"అంచేత మనం ఈ రోజంతా నవ్వుతూ గడిపేయాలి, పొరపాటున కూడా విచారం రానివ్వద్దు-విసుగుపడొద్దు- త్వరగా పనులు పూర్తిచేసుకొని అలా షికారు వెళదాం-"

"సంవత్సరమంతా అలా షికార్లతో గడిపేస్తామా?"

"ఆఁ...ఈ రోజు మనం అస్సలే ఎవరితో గొడవ పడకూడదు. నవ్వుతూ ఉండాలి... ప్లీజ్ పతీ అలా చేస్తావు కదూ?"

"సరే...అలాగే-"

చటుక్కున వంగి అతని పెదాలమీద ముద్దుల వర్షం కురిపించింది...

"అంటే సంవత్సరమంతా ప్రతిరోజూ పొద్దున ఇలా..."

"ఛీ పో కొంటే...." లేచి బయటకి వెళ్ళిపోయింది వినతి.

కొంచెం సేపటికి ఆమె చిరునవ్వుతో తిరిగి వచ్చింది.

"ఇవ్వాళ పాల ప్యాకెట్ దొరకలేదట" అని చెప్పింది.

"పోనీలే ఈరోజు కాఫీ ఏదైనా హోటల్లో తాగుదాం..." నవ్వుతూ అన్నాడు చలపతి.

భర్తవంక ఎంతో మురిపెంగా చూసి వంటింట్లోకి నడిచింది వినతి.

స్నానంచేసి వచ్చి-

"త్వరగా లే పతీ- స్నానంచేసి వేపపువ్వు, మామిడికాయ కొనుక్కురావూ- పచ్చడి చేయాలి కదా-" అంది.

"ఓ యస్ అలాగే..."

లేచి టాయిలెట్ రూంవేపు నడిచాడు చలపతి వెళ్ళినవాడువెళ్ళినట్టే తిరిగివచ్చాడు. ఏమైంది అన్నట్టు చూసింది వినతి.

"ఖాళీలేదు-"నవ్వుతూ చెప్పాడు చలపతి

"పోనీ ఈలోగా పళ్ళు తోముకోరాదూ-"

"సరే-"

బ్రష్ తీసుకుని పేస్టుకోసం వెదికాడు. ఇంకా ఆ నెలలో సామాన్లు తేలేదని గుర్తుకొచ్చింది. కంపెనీలో స్ట్రయిక్, జీతం ఇంకో వారం రోజులకిగానిరాదు. ఇంవాక వినతి "అ లా షి కా రు కు" అన్నట్టు గుర్తు...

జేబులన్నీ వెదికితే ఐదురూపాయల చిల్లర దొరకొచ్చు

ఐదు రూపాయలతో "భార్యతో షికారు" అంటే హైదరాబాద్ సిటీకి ఎంత నామోషి! షికారుకొద్దు గదిలోనే హాయిగా కబుర్లు చెప్పుకుందాం అంటే వినతి మొహం చిన్నబుచ్చుకుంటుందేమో!

గళ్ళ లుంగీకట్టి, బనీను చిరుగుమీద తువ్వాలు కప్పుకొని గదిబయట నిల్చొని ఆలోచిస్తున్నాడు చలపతి.

చేతిలోచిక్కిన పేస్ట్ట్యూబ్‌వంకఒకసారి చూశాడు. వత్తిలా మిగిలిన ఆట్యూబ్‌ను వొత్తివొత్తి అతనికి విసుగొచ్చింది.

రేపు కొత్త వాతేలి అనుకుంటూ నాలుగు రోజుల్నించి దానితోకు స్తిపడుతున్నాడు. వినతి ఎలా తోముకుందో-ఇలాగే అవస్థ పడి ఉంటుంది. లేక పండగరోజు కదా నవ్వుకుంటూ ఏ బొగ్గుముక్కనో కర కర నమిలి ఉంటుంది.

ఆట్యూబ్‌నేచించి రెండుముక్కలుచేశాడు ఒక్కోముక్కను చదరంగాచేసి కొంచెం నీళ్ళుచల్లి బ్రష్‌తో అందులోని పేస్ట్ అవశేషాలను గీకి తీరాడు-

○ ○ ○

స్నానంచేసి తల తుడుచుకుంటూ గదిలోకి వచ్చిన చలపతికి భార్య మొహం చూడాలంటే భయమేసింది.

అయిదు రూపాయలతో షికారా! అయిదు రూపాయలతో షికారా! అతని మనసులో ఒకటే హోరు...పోరు-

"వచ్చావా త్వరగా డ్రెస్ వేసుకో మామిడికాయ, వేపపువ్వు, బెల్లం.." గడగడ లిస్టు చదివేస్తున్నది.

అమ్మబాబోయ్! షికారుమాటదేవుడెరుగు- ముందీ లిస్టును ఎదుర్కొనేది ఎలా?

పరీక్షలో తప్పిన మొద్దబ్బాయిలా మొహం పెట్టబోయి పండుగనవ్వు గుర్తు కొచ్చి నవ్వుతూ భార్యవంక చూశాడు-

"ఓస్ ఇంతేనా...కొనేద్దాం-" అన్నాడు తల దువ్వుకుంటూ-

"వినతి నా పేంటొకసారి పట్రా-" అన్నాడు.

తెచ్చింది.

"జేబులో ఎంతుందో చూశావా?"

"చూశాను-"

"మరి?" నవ్వుతూ చూశాడు.

"నీకెందుకు నేనిస్తాగా-"

అర్థం కాలేదు చలపతికి-

"పండుగపూట అప్పు తెస్తావా వినతీ! సంవత్సరమంతా అప్పులేకావూ?..."

"ఛీ నేనంత తెలివితక్కువదాన్ని అనుకున్నావా! పండుగరోజు అప్పుతేవడానికి నిన్ననే అడిగిపెట్టాను- ఇదిగో" యాభై రూపాయలనోటు అందించింది.

"నెలకు అయిదు రూపాయలు వడ్డీ-" నవ్వుతూ చెప్పింది-

"ఓస్ అంతేనా-జీతం రాగానే ఇచ్చేయమూ-" నవ్వుతూ అన్నాడు చలపతి-

ఇద్దరు మరోసారి జంటగానవ్వుకున్నారు.

ఆ తరువాత చలపతి ఈలపాటకూడా అందుకున్నాడు-

రఘురామయ్యగారు ఎక్కడున్నా సంతోషించాలి ఇలాంటి ఏకలవ్యులనుచూసి-

అతని షర్ట్ గుండీలు వినతే పెట్టింది. చెప్పులు తుడిచి ఇచ్చింది.

ఆమె బుగ్గన చిటికేసి బ్యాగ్ అందుకొని బజారుకు నడిచాడు చలపతి-

"పతీ..." అని పిలిచింది.

"ఏమిటోయ్?" వెనక్కు తిరిగొచ్చాడు.

"తోరణాలకు మామిడాకు, వేపకొమ్మలు మరచిపోకు-"

"ఊహు...మరచిపోను-మరి భక్ష్యాలకు నెయ్యి కావద్దూ?"

"ఆ భక్ష్యాలు నాకు చేయరావు బాబూ-" నవ్వుతూ అంది వినతి.

"నాకు వచ్చుకదా...నువ్వైతె శనగపప్పు ఉడకబెట్టు-" నవ్వుతూ చెప్పాడు చలపతి.

"శనగపప్పులేదు-వచ్చేటప్పుడు తీసుకరా-అలాగే కిలో గోధుమపిండి.... యాలకులు..."

"సరె సరె అవన్నీ నేను చూసుకుంటాలె..."

నవ్వుతూ ఈలవేసుకుంటూ వెళుతున్న భర్తను చూసి హాయిగా నవ్వుకుంది వినతి-

ం ం ం

బజారునుంచి వచ్చిన చలపతికి భార్య ముందు గదిలోనే ఎదురయింది-

"తోరణాలకు మావిడాకు, వేపకొమ్మలు తెమ్మన్నావుకదోయ్ వాటికే రెండు రూపాయలు-" నవ్వుతూ చెప్పాడు.

"అంతేకదా..." నవ్వింది వినతి.

"మొత్తం ముప్పై రూపాయలు"


"ఊ...ఇవ్వాళ పంపు తొందరగా బందయింది పతీ వంటగది ఒక్కటే కడిగాను. ముందు రూము కడగలేదు"

"ఫరవాలేదులే-రేపు కడుగొచ్చు."

"పచ్చడికో చెంబెడు. తాగడానికి పెద్ద చెంబెడు నీళ్ళు చాలుకదా...మనం అలా షికారుకు వెళ్ళొస్తాం కదా-"

"ఓ బస్ బస్..."

ఆనందంగా భర్త షర్ట్ గుండీలు విప్పింది అతడు లుంగీ చుట్టుకుంటుంటే పేంటు కూడా తనే విప్పింది.



ఇద్దరు కష్టపడి పచ్చడి చేసుకొని, బక్షాలు చేసుకొని తినేసరికి మధ్యాహ్నం రెండయింది.

మ్యాట్నీకి కుదరదు కనుక ఫస్ట్‌షోకు వెళ్దాం అనుకున్నారు.

అంతలో ప్రక్క వాటావాళ్ళ అబ్బాయి "అంకుల్ మీకు ఉత్తరం" అంటూ ఒక కవరు అందించి వెళ్ళాడు.

"ఎవరో ఉగాది శుభాకాంక్షలు పంపించి వుంటారు తెరువు" అంది ఆసక్తిగా వినతి

కవరు తెరచి అందులోని ఉత్తరాన్ని చదివాడు చలపతి.

వడ్డీ సరిగా కట్టడంలేదని వార్నింగ్ ఇస్తూ చలపతి తీసుకున్న మూడువేల రూపాయలు అప్పు ఇప్పుడు నాలుగు వేలు అయిందని గుర్తుచేస్తూ అతని నేటివ్‌ప్లేస్ నుంచి గునిశెట్టి గుర్నాథం రాసిన ఉత్తరం అది.

ఉద్యోగానికి లంచం అవసరంపడి చేసిన అప్పు అది.

నవ్వుతూ భార్యవంక చూశాడు చలపతి.

"ఆఁ? రెండు సంవత్సరాల్లో తీర్చేస్తామని ఉత్తరం రాసేయ్" నవ్వుతూ చెప్పింది వినతి.

"ఓయస్ అలాగే తీర్చేద్దాం" అన్నాడు చలపతి.

కొంచెంసేపయాక—

"ఏ సినిమాకు వెళ్దాం పతీ?" అని అడిగింది వినతి.

"నువ్వే చెప్పు-"

"శాంతిలో శ్రీవారికి ప్రేమలేఖ నిండా నవ్వులేనట..."

"ప్రేమలేఖ నిండా నవ్వులా?"

"ప్రేమలేఖ నిండా కాదోయ్...సినిమా నిండా...."

"ఉహుఁ..."

"పండగ రోజు బాగుంటుంది-హాయిగా నవ్వుకోవచ్చు—దానికే వెళ్దాం"

"సరే అలాగే"

పండుగరోజు హాయిగా వెళ్ళాలని వాళ్ళ సాయంకాలం ఆటోలో సినిమాకు బయల్దేరారు.

ఆటోవాడికీ ఆ రోజు పండుగే ఉన్నట్టుంది. నిదానంగా నడుపుతూ మధ్య మధ్యలో ఆపి స్కేలుతో పెట్రోలును కొలుస్తూ మొత్తంమీద ఆరుగంటలకు థియేటర్ ముందుకు చేర్చాడు వాళ్ళను. అప్పటికే హౌస్‌ఫుల్?

నవ్వుతూ "హౌస్‌ఫుల్" అంది వినతి.

"మరో సినిమా ట్రై చేద్దాం" అన్నాడు చలపతి.

"అమ్మో ఏ సినిమా ఎలాగుంటుందో కొంపదీసి ఏ ట్రాజిడో చూశామంటె..." ఆ ఊహనే భరించలేకపోయింది.

"సినిమా మరోనాడు చూద్దాంలే అలా హాయిగా టాంక్‌బండ్ మీద కూర్చుందామా?" అని అడిగింది సరదాపడుతూ.

"సరే"

"టాంక్‌బండ్‌కు వెళ్దామా సార్" ఆ ఆటోవాడు ఇంకా అక్కడే ఉన్నాడు. ఎలాగూ సినిమా డబ్బులు మిగిలాయి కనుక మారుమాట్లాడకుండా ఇద్దరు ఆటోలో ఎక్కి కూర్చున్నారు.

ఆటో ముందుకు దూసుకుపోయింది.

టాంక్ బండ్ చేరి ఓ ఖాళీ సిమెంట్ బెంచ్‌నో, చెక్క బెంచినో వెదికి పట్టుకొనేసరికి వాళ్ళకు పావుగంట పట్టింది. రెండు రూపాయలుపెట్టి మూరెడు పూలదండకొని టాంక్ బండ్ మీద తమ సాయంకాలానికి మరింత అందాన్ని, ఆనందాన్ని తెచ్చాడు చలపతి.

రాత్రి ఎనిమిది గంటలదాకా అక్కడే కూర్చున్నారు.

సెకండ్ షోకు వెళ్ళడానికి వీల్లేను ఇంటి ఓనరు ముందే వార్నింగు ఇచ్చాడు పదకొండుదాటిందంటే బయటి తలుపులు తెరవబడవని.

"ఇక వెళ్దామా వినతీ..." అడిగాడు చలపతి అతని భుజం మీద తలవాల్చిన వినతి "ఊ" అంది మెల్లగా.

పర్సులో ఇక ఏడు రూపాయలు మిగిలాయని చలపతికితెలుసు. మళ్ళీ ఇప్పుడు ఆటోలో ఇంటికి వెళ్తే ఆ ఏడు రూపాయలూ హారతి కర్పూరం!

ఎంత స్ట్రయిక్ నడుస్తున్నా రోజూ కంపెనీకి పోక తప్పదుకదా! ఏడు రూపాయలుంటె ఎందుకైనాపనికొస్తాయ్.మళ్ళీ చేతిలో డబ్బులు పడేదాకా బస్సుచార్జీలకే కావాలి రోజూ రెండు రూపాయలు.

"హాయిగా బస్సులో పోదామా వినతీ" నవ్వుతూ అడిగాడు చలపతి.

"అలాగే" అంది నవ్వుతూ వినతి.

మరో అరగంట తరువాత అతి కష్టం మీద ఒక బస్సులో ఎక్కగలిగారు. అసలే బస్సుల నిండా ఎప్పుడూ జనం. అందులో పండుగరోజు ఫస్ట్ షోలు వొదిలేసిన సమయం...

గంటసేపు బస్సులో నరకాన్ని నవ్వుతూ అనుభవించారు.

బస్సు దిగి ఇంటి వేపు నడుస్తున్నారు. దాహంగా ఉంది చలపతికి సోడా తాగుదామని జేబులో చేయిపెట్టాడు.

"పతీ..." అంది మెల్లగా వినతి.

ఏమిటన్నట్లు చూశాడు.

"బస్సులో రష్ బాగా ఉంది కదా... ఒకపక్కకు ఒదిగి నిల్చున్నాను. బస్సు


ఉషోదయా క్రియేషన్స్
తెల్ల గులాబీలు
ఆర్.యస్.రామరాజు
ఎమ్.వి.రఘు. శంకర్-గణేష్
నరసింహారావు రేలంగి
రావిళ్ళ తులసీకుమార్ బి.ఇ.
లక్ష్మీ ఫిలింస్

రేకు తట్టుకొని ఇదిగో..." చిరిగిన చీరెను చూపించింది.
రెండు వందల యాభై రూపాయలు పెట్టి ఆ చీరెనుకొని రెండు నెలలు కాలేదు. నిజానికి వినతికి ఉంది అదొక్కటే మంచి చీరె.

"డార్నింగ్ చేయిస్తే బాగానే ఉంటుంది కదూ" అంది నవ్వుతూ.
"అవును" అన్నాడు చలపతి నవ్వుతూ. ఆ నవ్వులో... ఉన్న ఏడురూపాయలు బస్సులో ఎవరో కొట్టేశారన్న విషయం దాచేశాడు.

ఇల్లు చేరుకోగానే ఎదురైన ఇంటి ఓనర్‌నుచూసి గుండె గుభేలుమంది చలపతికి గడియారం వంక చూసుకున్నాడు- పదిమాత్రమే అయింది.
"వచ్చావా నాయనా నీకో శుభవార్త" అన్నాడు ఇంటి ఓనర్ చలపతిని చూడగానే-
ఏంవార్తోనని ఆనందంతో వినతిమొహం విప్పారింది.

"మీ కంపెనీ స్ట్రయిక్ కాలాఫ్ అయింది నాయనా- మీ డి.ఏ. పెంచ డానికి కంపెనీ యజమాన్యం ఒప్పుకున్నదట-సాయంకాలంవార్తల్లోచెప్పారు.
"అలాగా..."
"అయితె నీ జీతం ఎంత పెరుగుతుంది బాబూ?"
"నెలకు ఇరవై రూపాయల దాకా ఉంటుంది-"
"ఊహుఁ..."
"ఇంకా నిద్రపోలేదా బాబాయ్ మీరు?" తాళం తీస్తూ అంది వినతి-

"ఆఁ...మా బామ్మర్ది ఇందాక వచ్చి వెళ్ళాడు-మీరుంటున్న పోర్షను అద్దెంత అని అడిగాడు - రెండువందలయాభై అని చెప్పాను-తన దోస్తు ఎవరికో కావాలి రెండొందల డెబ్భయ్యయిదు అద్దె ఇస్తారు అన్నాడు-నేను ఒప్పుకోలేదు-చలపతి మంచి కుర్రాడు-ఆ మాత్రం అద్దె వాళ్ళు ఇవ్వగలరు అని చెప్పాను-"
గదిలో అడుగుపెట్టిన చలపతి మొహం మీదికి ఝుమ్మని దోమలు దాడిచేశాయి-
"అలాగే బాబాయ్—" నవ్వుతూ లైటు వేసింది వినతి-భర్తను మోచేత్తో పొడిచింది.
"అలాగే అంకుల్ దానికేం అలాగే ఇస్తాం..." నవ్వుతూ చెప్పాడుచలపతి-
లౌక్యంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు ఇంటి ఓనర్-
తలుపులులేని కిటికీగుండా దూకి పిల్లులు వంటగదిలో పోట్లాడుకుంటున్నాయి. పెద్ద చెంబెడు మంచినీళ్ళు వొలక బోశాయి-

అంతలో కరెంటుపోయింది-
"ఇంకెంతసేపు ఉంటుంది వినతీ పండుగ?" అడిగాడు చలపతి-
"ఎందుకు?"
భర్త అలా ఎందుకడిగాడో అర్థంకాలేదు వినతికి.
"ఎందుకు పతీ?" అని మళ్ళీఅడిగింది.
"ఇక నేను నటించలేను- ఈ అబద్ధపు నవ్వులు నవ్వలేను-" చలపతి బాధగా-
వినతి మాట్లాడలేదు.
కిటికిలోంచి ఆకాశంలో కనిపించేమిణుకు మిణుకు తారలవంక చూస్తోంది..."•

పాపము నుండి విముక్తి ఎలా ?

మానవులెందుకు నీతితప్పి నడుస్తుంటారు? ఎందుకు చెడు మార్గమును ప్రేమిస్తుంటారు? ఎందుకని తెలుసా? పాపపు పనిలో కనిపించే ఆనందం, ఆకర్షణ వారికి పవిత్ర ప్రేమలో కనిపించదు. కన్నులకు కనిపిస్తున్న ఈ స్వర్గాన్ని కాలదన్ని, కన్నులకు మరుగైన, ఆ స్వర్గంకోసం ఇప్పటి నుండి ఎందుకు పరితపించాలి? అని తమలో తాము సరిపెట్టుకుంటారు.

తాను నడుస్తున్న మార్గం కంటకావృత్తం అని తెలుసు. దీనివలన తన్ను నమ్ముకొన్న భార్యాబిడ్డలు, తనమీద వెర్రి ఆశలు పెంచుకొన్న వృద్ధ తల్లి దండ్రులు, తీరని ఆవేదనకు గురికాగలరని కూడా తెలుసు. త్రాగుడు, జూదం, పరస్త్రీవ్యామోహం వలన, ధనవ్యయం, పరువు నష్టం అని కూడా బాగుగా తెలుసు. పాపం నిప్పువంటిది. నీవు తెలిసి ముట్టుకొన్నా, తెలియక ముట్టుకొన్నా నీ చెయ్యికాలకమానదు. బాధపెట్టినంతకాలం, మనిషిని బాధించి చివరికి అసహ్యమైన మచ్చలుగామిగిలిపోతాయి. అందుకే పాపమనే నిప్పుతో చెలగాటాలాడక దూరంగా తొలగిపోవటం శ్రేయస్కరం, అక్కడి నుండి దూరంగా తొలగిపోగలిగిన హృదయంకూడ దేవునివలనకలగాలి. దేవునికృప వలన మార్పు చెందిన మనస్సే మనస్ఫూర్తిగా పాపాన్ని ద్వేషించగలదు. పాపమువలనకలిగే భయమువలనగాని, రాబోయే శిక్షను తప్పించుకొనవలెననే కోర్కె వలన స్వాభావికముగానే ఈపాప ద్వేషముకలుగుతుంది. మీరుకూడా మీ హృదయంలో మార్పు పొందగోరుచున్నారా? అయితే మాకు వ్రాయండి.

ఉచితం !	ఉచితం !
భగవత్స్వరూపుడు, కరుణామయుడు అయిన ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, మానవాళికి ఆయన అందించిన కమనీయ బోధలు తెలియజేసే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే, ఈరోజే మీ చిరునామా మాకు వ్రాయండి వెంటనే పుస్తకం పంపుతాము.	డా॥ ఎస్. జాన్ డేవిడ్, పోస్టుబాక్సు నెం. 14, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా (ఏ. పి.)

Gospel Message



ఎ. శ్యామలారాణి

దీపశిఖ

జరిగిన కథ:

మాషిమా దీపకి ముకుల్ గది చూపింది-గదిలో కవితాసుకుమారుడి భావ తరంగాల మధురనాదం మాషిమాకైతే తెలిసిందికాదుగానీ దీపని కవితా లోకంలో తిప్పింది...ఐతే ముకుల్‌లో చిత్రకారుడిద్వారా తన చిత్రాన్ని చూడాలనుకుంది దీప. ప్రేమనీ, సౌందర్యాన్నీ రంగులమయం చేసేడు అతగాడు-అనూజా కొంటెతనం, చందన్‌నగర్ విహారం, మాషిమా ప్రేమనీ, ముకుల్ మధుర భావాల్నీ-దేన్నీ వదలాలని లేదు దీపకయితే

మాషిమా ప్రేమ లోంచీ, ముకుల్ కవితా చిత్ర రూపం నుంచీ ఒక్కసారిగా దీప కదిలిపోవలసి వచ్చింది - తండ్రి ఆరోగ్యం గురించిన వైర్‌తో - తీరా వస్తే తండ్రి కోలుకుంటున్నారు - కానీ చెల్లెలు ఇందు మాత్రం డా॥ కేదార్‌ని పొగడడంలో నిండిపోయి వుంది...పైగా తలిదండ్రుల మద్దతు-

ధైర్యం తెచ్చుకుని నాన్నగారితో ముకుల్‌దా గురించి చెప్పేసింది. ఆలోచించుకోమని నాలుగు రోజులు సమయమిచ్చినాడు...——ఇక చదవండి

మేమిలాంటి నిర్ణయం చేసుకున్నాక అది రెండోరోజు మధ్య వాక్కరోజే మిగిలిఉంది. నన్ను నాన్నగారు, నాన్నగారిని నేను కనిపెడుతూనే ఉన్నాం. మాఇంటి వాతావరణం మాత్రం చాలావరకు మారిపోయిందనే చెప్పాలి. జీవితంలో అసలు "నవ్వు" అంటే ఏమిటో ఎరగని వాళ్ళలా తయారయ్యేం.

చలాకీగా ఉండే ఇందుకూడా సీరియస్‌గా మారిపోయింది, అమ్మ సరేసరి.

రోజూ వచ్చే కేదార్ ఆ రెండు రోజులూ రాలేదు. విజయవాడ" వెళ్ళేడట. బ్రతికించాడనిపించింది.

ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలప్పుడు-

ఇందు ఇంట్లో లేదు. అమ్మ, నాన్నగారు పడుకున్నారు. నేను రేడియో లోంచి వినవస్తూన్న మాల్‌కౌంస్ రాగం వింటున్నాను. నిర్మలంగా మెరిసేకళ్ళ, చేతిలో సితారతో ముకుల్‌బాబు రూపం కళ్ళకు కడుతూంది.

టెలిఫోన్ మ్రోగింది. నా కల చెదరిపోయింది. రిసీవర్ ఎత్తేను. అది కేదార్ కంఠం. నేను కొంచెం కంగారుపడ్డాను.

"నాన్నగారేం చేస్తున్నారు? అహ...పడుకుంటే లేపద్దు...చిన్న విషయం చెబుదామని" అతనుకూడా కొంచెం తడబడుతున్నాడు.

ఏం చెప్తాడోనని గుండె లయ తప్పుతూంది.

"ఊఁ" అన్నాను ప్రాణాలు బిగబట్టుకుని. ఎవరో దుష్టరాక్షసుడు కామ రూపంలో కేదార్ నామధేయంతో నాపాలిట దాపురించాడన్నట్లుంది నాకు. అసహనంగా విన్నాను.

సాయంకాలం మినీథియేటర్లో ఏదో ప్రోగ్రామ్ ఉందట- మమ్మల్ని ఆహ్వానిస్తున్నాడతను.

"పిలవుతుందనుకోను" సంభాషణ తుంచేయాలనిపించింది అలా అన్నాను.

"ఏం? ఇంకేదైనా ఎంగేజ్‌మెంట్ ఉందా?"

ఇతగాడికెందుకో ఆ వివరాలన్ని? అమ్మ-నాన్నగారు కలిసి నెత్తినెక్కించుకున్నారని ఒళ్ళుమండిపోయింది నాకు. నేనేం మాట్లాడకపోతే సిగ్గు అనుకుని ఉంటాడు.

"అరె! ఏమిటా మౌనం? స్తరే...నేనే వస్తాను కాసేపట్లో. ఉండనా మరి?" నా జవాబుకోసం ఆగేడు.

"ఊఁ" ఎలాగో వదిలించుకోవాలన్నట్లు అని ఫోన్ పెట్టేశాను.

సాయంకాలం ఐదయింది. కావాలని నేను జడకూడా తీప్పేసుకుని, తల నొప్పెడుతూందని పడుకున్నాను. "ఇలాంటప్పుడు పడుకుంటే నిజంగా వస్తుంది తలనొప్పి! లే'' అంది అమ్మ. నా దొంగతలనొప్పిని పసిగడుతూ. ఉక్రోషంతో లేచాను. గుమ్మంలో కారాగింది. తాళ్ళు టకటక లాడించుకుంటూ ఇందు, ఆ వెనుక కేదార్ వస్తున్నారు. మొదటిరోజు నేనలా ఎందుకనుకున్నానోగాని ఇందు

అతనిముందు బొత్తిగా చిన్నపిల్లలా తెలుస్తూంది. అందరూ కూచుని మాట్లాడు కుంటున్నారు. ఇందు నా దగ్గర కొచ్చింది.

ఇంకా తయారవనే లేదా? లే. లే బేగం. నీ కతిఇష్టమైన బెంగాలీ డాన్స్ డ్రామా. "చండాలిక" అంది ఊరిస్తున్నట్లుగా.

"నే రాలేను. నువ్వెళ్ళు" అన్నాను.

"అన్నట్టు మధ్యాహ్నం బావగారు నీతో చెప్పేరటగా?"

"నోర్ముయ్! వెధవ్వాగుడూ నువ్వూను-బావగారు-బగ్గిగారు!" రగులు కుంటున్న కోపాన్నంతా దానిమీద చూపించేను.

"నువ్వెళ్ళు ఇందూ. దీపూ ఐదు నిమిషాల్లో తయారై వస్తుంది." అంటూ నాన్నగారు ప్రవేశించేసరికిమాత్రం నీరుకారిపోయాను. ఇందు వెళ్ళిపోయింది.

"దీపూ! నువ్వు నాకేమని ప్రామిస్ చేశావు?" నాన్నగారడిగారు.

"అతనితో షికార్లు వెళ్తాననిమాత్రం ప్రామిస్ చెయ్యలేదు." నేనూ సీరి యస్‌గానే అన్నాను ధైర్యం తెచ్చుకుంటూ.

"అతన్ని గురించి తెలుసుకుందికి, అర్థం చేసుకుందికి నీకిదొక ఛాన్సు. అందుకే వెళ్ళమంటున్నాను. కాదంటే బలవంతం చెయ్యను" అనేసారు. అదో అస్త్రం నా మీదకి!

తర్వాత ఏది ఎలా జరిగినా ముందునుంచీ మొండికెత్తేనన్న పేరెందుకులే? అని లేచాను తయారవటానికి.


ఇందు ముందు సీట్లో కూచుంది. కారు బ్యాక్‌డోర్ తెరచి మర్యాదగా నించున్నాడతను. ఎందుకో వి ఐ పీ ట్రీట్‌మెంట్! చిరాకేసింది నాకు. తోవలో ఎవ్వరం మాట్లాడుకోలేదు.

పావుగంటలో మినీ థియేటర్ చేరాం. అక్కడందరూ గౌరవంగా అతన్ని పలకరిస్తూంటే వచ్చి మూడే మూణాళ్ళయినా పరిచయాలకేం తక్కువ లేనట్టుంది అనిపించింది.

ముందు వరసలో నేను కూచున్నాను. ఇందుకోసం మధ్య కుర్చీ వదిలి కూర్చోబోయాడతను. "ఫరవాలేదు ఆ మాత్రం జ్ఞానముంది!" అనుకున్నాను కాని, ఇందుకే నామీద అలకగా ఉంది-నేను కసిరినందుకు. తన ఫ్రెండు ప్రక్కన కూచుంటానని వెళ్ళిపోయింది. ఇబ్బందిగా కదిలి నా ప్రక్క సీట్లోనే కూర్చున్నా డతను.

మమ్మల్ని చూసి ఎవరో గుసగుస లాడుకుంటున్నారు. ఒంటికి కారం రాసు కున్నట్టుగా వుంది నాకు. అతని బట్టలకు వేసుకున్న సెంటెడ్‌స్ప్రే నన్ను చుట్టు ముడుతోంది. కుర్చీలమధ్య దండెలులేనందువలన అతని షర్ట్ నా చేతి కప్పుడ ప్పుడు రాచుకుంటుంది. నాకు ముళ్ళు గుచ్చుకున్నట్టుగా ఉంది. నేను ముకుల్ బాబుని మరచిపోయి ఇతని గురించే ఆలోచించాలట! ఏమి తమాషాగా వుంది.

ధీన్‌కుమార్ సినిమా థియేటర్ లోపలికి అడుగు పెడుతోంటే విజయ్‌కుమార్ ఎదురొచ్చాడు.
"అదేమిటి? నిన్నరాత్రి నువ్వూ, నీ ప్రియురాలుకలిసి ఈసినిమా సెకండ్ షో చూశారు కదా?" అడిగాడు విజయకుమార్ ఆశ్చర్యంగా.
"అవును! ఇప్పుడు కేవలం సినిమా చూద్దామని" అన్నాడు దీన్‌కుమార్.



స్టేజికి కళ్ళు అతికించి కూచున్నానే కాని ఏంజరుగుతుందో నాకేమీ పట్టటంలేదు.

"దీపూ!" చెవిదగ్గర గుసగుసగా వినిపించిందతని కంఠం.

నేను ఉలికిపడ్డాను. చనువు తీసుకుంటున్నాడన్నమాట!

''నాకు నిన్నలాగే పిలవాలనుంది. అభ్యంతరంలేదు కద?"

అలాగే పిలవాలనుందట! ఉండదూ మరి!

"అదుగో ఏమీ మాట్లాడకపోతే ఇది సిగ్గు కాదు, కోపమేననుకుంటాను."

ఖర్మ! సిగ్గనుకుంటున్నాడు కాబోలు మహానుభావుడు నాకు నవ్వొచ్చింది.

"అదీ! అలా నవ్వాలి!"

హత విధీ! దానికీ పెడర్థమే వస్తూంది.

"నీకు డ్రామా నచ్చుతుందా?" ఏదో మాట్లాడించాలని ప్రయత్నం!

"ఇదివరకు చూసిందే!" జవాబు పొగరుమోత్తనంగా ఉందని కూడా గ్రహించలేనంతమైకంలో ఉన్నాడన్నమాట! లేకపోతే నేను మాట్లాడినందుకే ఎందుకంత పొంగిపోతాడు?

డాన్స్ డ్రామా ముగిసింది. జైల్లోంచి విడుదలైనట్టు నా కనిపించింది.

రాత్రి పడుకోబోతూంటే నాన్నగారు పిలిచారు.

"దీపూ! అలా వెళ్ళమన్నందుకు కోపంగా ఉందా?"

ఆయనతో అదే చిక్కు! కోపం తెచ్చుకుందికి కూడా వీలుపడదు.

"కేదార్‌లో నీ కేమైనా అసభ్యత కనిపించిందా?" మరో ప్రశ్న.

అతని చొరవ, నన్నేకవచన ప్రయోగం చెయ్యటం నాకు నచ్చలేదు కాని, అది "అసభ్యత" అంటే సిల్లీగా ఉండదూ? అందుకే "లే"దన్నట్లు తలూపేను.

"సరే! వెళ్ళిపడుకో!" నామీదొక పాయింట్ గెయిన్ చేసినట్లు చూసారు.

ఇక మానవుడికి ఒకేరోజు మిగిలింది. క్షణక్షణం గడుస్తూన్నకొద్ది నా తల వేడెక్కిపోతూంది. తిండి తినలేను. నిద్రపోలేను. అలాంటి స్థితిలోకూడా నాన్నగారిమీద గౌరవంకొద్దీ ఆరోజు ముకుల్‌బాబుని మరచిపోయి కేదార్‌గురించి సీరియస్‌గా ఆలోచించాలని ప్రయత్నించాను. ఫలితంగా—సాయంకాలం మెడికల్

షాపుకి వెళ్ళి ట్రాంక్విలైజర్ కొని వేసుకోవలసివచ్చింది. అంతే.

ం ం ం ం ం

మళ్ళీ తెల్లవారింది. మా పరీక్షాసమయం వచ్చేసింది. ప్రసవించి కబళించేది ఏదంటే చట్టున 'పులి, పాము' అంటారేమో. కాని ప్రసవించేది, కబళించేది "కాలం" అంటాను నేను. కాలం సృష్టించిన ఈ సమస్యల్ని కాలమె తీర్చాలి తప్ప మనుష్యులచేతిలో ఏమీ ఉండదు. వ్యర్థ ఆరాటం తప్పించి!

ఉదయం బ్రేక్‌ఫాస్టు కాగానే నాన్నగారు పిలిచారు. జడ్జిమెంట్ వినబోతున్న నేరస్థురాలిలా వెళ్ళే నాయన ముందంకి. నన్ను చూస్తూనె ప్రసన్నంగా నవ్వేరు. కొంత తేలికదనం వచ్చింది నాకు. నాన్నగారికి తమలపాకులందిస్తూ! అమ్మకూడా అక్కడే వుంది.

"ఇప్పుడు చెప్పమ్మా. ఏం నిర్ణయించావ్?" స్థిమితంగా ఉందాయనకంఠం.

"మీ నిర్ణయమే ముందు చెప్పండి!" తొణకుక్కుండానే అన్నాను.

"ఊఁహూఁ... నువ్వే చెప్పు."

"కాదు...మీరే చెప్పండి."

ఓడిపోయినట్లు చూసారు నాకేసి-నాకేదో బలం వచ్చినట్లయింది.

"నిజం చెప్పనా? ఆరోజు ఏదో అనేసానే కాని ఆ పద్ధతిలో మనిద్దరి ఆలోచనలూ సాగటం అసంభవం! అవునా?"

"అవును."

"అయితే, ఇంకేం చెయ్యాలో నువ్వే చెప్పు!"

"నాకు తెలియదు."

"పోనీ, కేదార్‌గురించి నీకేమీ చెడు అభిప్రాయం లేదన్నది స్పష్టమేకదా! నాన్నగారు తెలివైన వారని నాకు గర్వమే. కాని, ఇప్పుడు నామీద ప్రయోగిస్తున్నారు. ఆయన కూతుర్నేననిపించుకోవాలని నాకూ అనిపించింది.

"ముకుల్‌బాబు గురించి కూడా మీకేదైనా అభిప్రాయం కలిగిందా?"

నాన్నగారు కొంచెం తికమక పడ్డారు. "ఎలా? నువ్వంటే ఇద్దర్నీ చూసేవు. నేనతని గురించి వినటమేకాని చూడలేదుగా?"

"యువరానర్! ప్లీజ్ నోట్‌దిస్ పాయింట్! మీ నోటితో మీరే చెప్పారు" నవ్వుతూ ఆ మాటలు అన్నానేకాని నా కళ్ళంట నీళ్ళు తిరిగిపోతున్నాయి. ఇప్పుడు మన నిర్ణయాల వెనుక పరిశీలన-నాది సంపూర్ణంగాను, మీది అసంపూర్ణంగానూ ఉంటుంది." అన్నాను వణుకుతున్న కంఠంతో

"శభాష్! నా కూతుర్ననిపించుకున్నావు!" ఆనందమో ఆవేదనో తెలియదు కాని ఆయన కళ్ళు కూడా తడితో మెరిశాయి. రెండు నిముషాలతర్వాత" అంటే నీ నిర్ణయం మారలేదన్నమాట!" అన్నారు.

"మీది?" పీలగా వచ్చింది నా గొంతు.



ఆనందరావ్, అన్నపూర్ణ ఖాళీగా ఉన్న సినిమా హాల్ బాల్కనీలో కూర్చున్నారు.

"సీటు వెనుక ఏదో తడుతున్నట్టు వినబడుతోందేమిటిది?" అడిగాడు ఆనందరావ్ ఆశ్చర్యంగా.

"అవకాశం!" అంది అన్నపూర్ణ వెనక్కి తిరిగి చూచి.



"మారలేదు" తంగున గంట కొట్టినట్టుందా కంఠం.

అంటే? మీ...మీ ఇద్దరిమాటా ఒకటి కాలేదన్నమాట!" అమ్మ భయంగా చూసింది.

"డోంట్‌వర్రీ! మా ఇద్దరిదీ ఒకే మాటవుతుంది" అన్నారు. ఆశగా చూసాన్నేను" "దీపూ నా మాట కెదురు చెప్పదు,"

నాలో దు:ఖంతో, కోపంతో కూడిన విచిత్రమైన పంతం చెలరేగింది. ఆవేశంలో ఒళ్ళు తెలియలేదు.

"ఇంతవరకూ అలాగే జరిగింది. ఇప్పుడు తప్పదేమో!"

"దీపూ!" గర్జించారు నాన్నగారు జీవితంలో మొదటిసారిగా.

"నీ బాగోగులు నా కంటే ఎక్కువగా నీకు తెలుసని భ్రమపడకు. నే నన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చేను. నువ్వు కేదార్‌ని చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం.'' తీక్షణంగా అనేసి చట్టున లేచి పోయారాయన.

అలా జరుగుతుందనుకోలేదు నేను.

అమ్మ మతిపోయినదానిలా మా ఇద్దరినీ చూస్తుంది.

అసహాయ స్థితిలో ఏమీ చెయ్యలేక రెండు చేతులతో ముఖం కప్పుకుని బోరున ఏడుస్తూ నా గదికి పరుగుతీసాన్నేను.

ఇంట్లో నిస్తబ్దత ఆవరించింది.

ఓ రాత్రివేళప్పుడు-

"దీపూ!" అమ్మ పిలుపు దీనంగా వినిపించింది. నేను దిండులోంచి తల తీయలేదు. నా వీపు నిమురుతూ అంది. "దీపూ! నువ్వు....చిన్నదానివి...నాన్నగారితో పంతానికి పోకమ్మా!"

"నిన్ను నాన్నగారు పంపించారా?" ఛర్రున లేచాను నేను.

"లేదు...నేనే వచ్చాను....ఆయన తత్వం నాకు తెలుసు. ఆయనిక నీకేమీ చెప్పరు- మంచిదని తోచింది చేస్తారంతే."

"నేను ఆయన కూతుర్నేనని చెప్పు!" కాస్త కటువుగానే ఆమాట అన్నానేమో! అమ్మ మౌనంగా లేచి వెళ్ళిపోయింది.

ఆ రోజు—పదిహేను సంవత్సరాల తర్వాత నాన్నగారు వరసపెట్టి సిగరెట్లు కాల్చడం ప్రారంభించారు. ఆయన ఆరోగ్యానికది మంచిది కాదు. కాని, వద్దనే సాహసం ఎవరిలో ఉంది?

సాయంకాలం-ఐదుగంటలు కొట్టింది గోడగడియారం.

ఉన్నట్టుండి ఇందు వెర్రిగా కేక పెట్టింది. నేను ఒక్క ఉదుటున మంచం దిగి హాల్లోకి పరుగెత్తేను. గాభరాలో నా గుండె ఆగినంత పనయింది. నాన్న గారికేం రిగిందోననే భయం.

నేనొచ్చేసరికి అమ్మ నేలమీద పడివుంది. బాధతో "అమ్మా....అమ్మా" అంటూ ఒకటే ఏడుస్తూంది.

నాకు మతి పోయింది. రాతి బొమ్మలా నిల్చుండిపోయాను. అప్పుడే గుమ్మంలో కారాగింది. మెడలో స్టెతోస్కోప్‌తో కేదార్ వస్తున్నాడు. ఎంచేతో ఆ క్షణంలో నాకతను ఆపద్బాంధవుడిలా, దేవుడిలా కనిపించేడు. ఒకే పరుగున వెళ్ళి అతని రెండు చేతులూ పట్టుకుని "మా అమ్మ...ప్లీజ్...తొందరగా రండి" అంటూ పిచ్చిదానిలా అతన్ని ఈడ్చుకుపోయాను.

అతను అమ్మదగ్గరికి వెళ్ళేడు. నేను పాపిని ఎవరినీ తాకకూడదన్నట్లు ఓ వారగా నిల్చున్నాను. ఐదునిముషాల్లో ఏంబులెన్స్ వచ్చింది. అంతే ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలియలేదు.

ఎప్పటికో నాకు తెలివొచ్చింది.

నేను కేదార్ చేతుల్లో ఉన్నానని మాత్రం తెలిసింది. లేపడానికి నా కణుమాత్రపు శక్తికూడా లేదు అతని పెదవులు నా చెవి దగ్గరగా గుసగుసమంటున్నాయి అవి స్వీట్ నథింగ్స్ కావు- "సారీ! దీపూ?" అది సారాంశం. మా ఇంటి దీపం ఆరిపోయింది. పసిపిల్లలా, పిచ్చిగానిలా అతన్ని పెనవేసుకుని బోరుమన్నాన్నేను, అతని చేతులుబలంగా నన్నింకా ఇంకాఅతని గుండెల్లోకిలాక్కుంటున్నాయి. అక్కడొక అగ్నిగుండముంటే అందులోపడి మాడి మసైపోవాలని, అక్కడొక సుడిగుండముంటే అందులో మునిగిపోయి రూపుతేలకుండా అధఃపాతాళానికి పోవాలని అనిపించింది. ఏమీ జరగలేదు. జీవచ్ఛవంలా నేనతని గుండెలమీదే పడివున్నాను.

o o o o o

"మనిషి అనుకున్నది అనుకున్నట్టు జరిగిపోతూంటే 'విధి, దైవం" అనే పదాలీ ప్రపంచంలో విన్పించకపోవునేమో! దుఃఖం ఎంత శక్తివంతమయినది? వేయి సంతోషాలనయినా కబళించే శక్తి దానికే ఉంది. దానినిరూపుమాపేశక్తి సృష్టించి జీర్ణించుకునే కాలానికి మాత్రమే ఉందేమో! కాలానికి బందీలై తిరిగే ఈ అల్ప జీవులకు ఇష్టాఇష్టాలు, సుఖదుఃఖాలు అసలు ఈ చావు పుట్టుకలనేవే లేకపోతే ఎంత బాగుండును. మనిషి మనుగడ కేమిటి ప్రయోజనం? ఎందుకీ సృష్టి?" ఇలా ఉండేది అప్పట్లో నా ఆలోచనలు.

మూడు నెలలు గడిచిపోయాయి. (సశేషం)

ఈతకోట సుబ్బారావు

క్షుద్ర సమస్య



రఘు మంచి రచయిత.

దాదాపుగా పది సంవత్సరాల కృషి. అంటే ఉత్తరాల రచయితనుంచి ఎదిగినవాడు. గత నాలుగు సంవత్సరాలలో రఘు కథలేని వార, మాస పత్రిక లేదు.

కానీ, ఆర్నెల్లు నుంచి రఘు రచన ఒక్కటి ఏ పత్రికలోనూ కనిపించటం లేదు. ఓనపత్రికలోనడుస్తున్న సస్పెన్స్ సీరియల్ కూడా అర్ధాంతరంగా ఆగిపోయింది. రఘును ఏదో తీవ్ర సమస్య వెంటాడుతుందనిపించింది. మనిషి చిక్కి శల్యమయి ఉన్నాడు ఎన్ని ప్రశ్నలడిగినా రఘు పెదవి విప్పలేదు. చివరకు "నా జబ్బు ఎవరికి ఎలా చెప్పుకోవాలో తెలియకుంది. ఎంతమంది డాక్టర్లుకు చూపెట్టి, ఎన్ని వందలు ఖర్చుపెట్టినా నయం కావటం లేదు." రఘు చెబుతూనే ఒక్క క్షణం ఆగి "నాకు ఎవరో చేతబడి చేశార్రా. వ్రాసేటప్పుడు మాత్రమే ఏదో కాంతి కళ్ళకు అడ్డుపడుతుంది. ఈ కాంతి కూడ కేవలం కళ్ళకే. అదీ వ్రాసేటప్పుడే. అందుకే ఇటీవల ఏమీ రాయలేకపోతున్నాను. అంతెందుకు-నాన్నకు ఈ రెండు ముక్కల ఉత్తరం పదినిముషాల నుండి వ్రాస్తున్నాను" బాధలోనే చెబుతున్నాడు రఘు. వాడి కళ్ళలో నీళ్ళు తిరగటం నేను గమనించాను.

చెప్పేవరకూ ప్రాణాలు తీశాను. చెప్పేసరికి ఏం చెయ్యాలో, ఎలా ఓదార్చాలో నాకేమీ అర్థం కాలేదు తలొంచుకొని వాడి పెన్‌తో గీతలు గీస్తూ కూర్చున్నాను.

రఘు ఏదో చెబుతూనే ఉన్నాడు. చేతబడులు లాటివి నేను నమ్మని మాట నిజమే అయినా-రఘుకు ఏ విధంగా ధైర్యం చెప్పాలి అదే ఆలోచిస్తున్నాను. ఉన్నట్టుండి---

పెద్ద బాంబు పేలింది-నా మెదడులో.

"రఘూ! నీకు ఎప్పడినుంచి ఈ జబ్బు. అదే...చేతబడి"

"ఆరు నెలలనుంచి"

"ఈ స్టీలుపెన్‌కొని ఎంతకాలమయింది"

"ఆ...ఇంచుమించు ఆరునెలలయిందనుకుంటా" ఒక్కక్షణం ఆగి నెమ్మదిగా అన్నాడు.

నాకు నవ్వు ఆగలేదు.

"రేయ్! రఘూ! చూశావా. ఈ స్టీలు పెన్‌మీద లైటింగ్ పడుతుంది గదా! అది రిఫ్లెక్ట్ అయి కళ్ళమీద పడుతుంది. చూడు....చూడు"

రఘు తలవంచుకొనే ఉన్నా, వాడి ముఖంలోని భావాలు నేను చదవగలిగాను●



ఉదయాస్తమానం పని వుంటూనేవుంటే ఉత్తేజాన్నిచ్చే టీ వుండాలంతే...


Lipton
RUBY DUST
ఉత్తేజాన్నిచ్చే, అతి చిక్కని టీ లిప్టన్ రుబి డస్ట్ టీ!!
లిప్టన్
రుబి డస్ట్
టీ
LINTAS(C)/RD/19/1822 TI

తియ్యటి బహుమతి
పొందిన మరో
కథ



బీచ్ లో సాయంత్రం

ఆదివాల్తేరు యూనివర్సిటీలో చదివిన ఆఖరిరోజు. ఎప్పటినుండో కోరిక ఉంది సాయంత్రం దగ్గరలోనే ఉన్న బీచ్‌కు వెళ్ళాను.

మనసంతా హాయిగా ఉంది ఓ చోట ఇసుకపై కూర్చున్నాను.

కెరటాల ఆటల్ని చూస్తుంటే వయసులో ఉన్న మనసులో ఏదో మబాల గోలగా ఉంది.

ఆమె దివినుండి అప్పుడేసముద్రతీరంలో రాలిన పారిజాత పుష్పంలా వుందనిపించి దా క్షణంలో.

ఆమె నవ్వింది. పలకరింపుగా నవ్వినట్లుందామె.

ఆ నవ్వుకు అర్థం తెలియక తెల్లబోయి చూసాను.

మళ్ళీ మెల్లగా నవ్వింది. అందంగా నవ్వింది. అదోలా నవ్వింది. హాయిగా నవ్వింది.

ఎవ్వరూ చూడకుండా నేనూ నవ్వాను. ఉరకలు వేస్తున్న ఆనందాన్ని అణచుకుంటూ.

సిగ్గుతో ఆమె తల వాలిపోయింది.

ఆమె చిరునవ్వు నవ్వింది. చిన్నగా నవ్వింది. చిత్రంగా చిలిపిగా నవ్వింది. సన్నని గులాబీ రేకులవంటి ఆమె పెదవులు తెరిస్తే కనిపించే ముత్యాల కోవలాంటి అందమైన పలువరస ఒక్కసారిగా తళుక్కుమంది.

అందాలరాశి ముందు కూర్చుని ఆమె నవ్వులో పాలు పంచుకున్నందుకు గర్వంగా కాలర్ సవరించుకుంటూ మరీ నవ్వాను.

తనలో తాను నవ్వుకుందామె.

వెన్నెలలాంటి ఆ చిరునవ్వులో శారీరక స్వాంతనకాక మానసికంగా ఏదో చల్లదనం లభించినట్లయింది నాకు.

ఒక్కసారిగా నవ్వింది. కిసుక్కున నవ్వింది తమాషాగా నవ్వింది. గమ్మత్తుగా నవ్వింది.

మళ్ళీ నవ్వితే ఆ నవ్వు మూలంగా బుగ్గల్లో ఏర్పడ్డ సొట్ట చూడాలని కోరికగా వుంది.

ఈసారి ఆమె కిలకిలా నవ్వింది. గలగలా నవ్వింది. ఫకాల్న నవ్వింది. పకపకా నవ్వింది. పడిపడీ నవ్వింది.

నాకు గట్టిగా నవ్వొచ్చింది. నాలో సంతోషం పరవళ్ళు త్రొక్కేస్తుంది.

మళ్ళీ నవ్వింది. మువ్వలు జల్లినట్లు నవ్వింది. పువ్వల్లే నవ్వింది. నిండుగా నవ్వింది.

ఆమె నవ్వినపుడు కుడిచివర బయటికి తొంగిచూసే సన్నటి పంటినొక్క నాకు చాలా యిష్టం.

నావైపే చూస్తుంది ఆమె నవ్వుతూ. నా హృదయం ఆనందంతో తేలిపోతోంది. ఆ అనుభూతిని గుండెలో పదిలంగా దాచుకున్నాను.

ఆమె పొట్ట పట్టుకుని నవ్వసాగింది. విరగబడి నవ్వింది పగలబడి నవ్వింది గుక్క తిప్పుకోకుండా నవ్వుతోంది. మరోసారి పెద్దగా నవ్వింది. నవ్వి నవ్వి అలసిపోయింది.

ఇద్దరం అలా మృదుమధురంగా మనసారా నవ్వుకుంటున్నాము.


అంతలో చుట్టూ కలవరం.

నా నవ్వుల పువ్వుని ఎవరో బలవంతాన తీసుకుపోతున్నారు. ఆమెతోపాటు నన్ను కూడా వింతగా చూస్తున్నారు జనం.

చెవులను తాకిన మాటలు "ఆమె దగ్గరలోనే ఉన్న మెంటల్ హాస్పటల్ నుంచి తప్పించుకుని వచ్చింది. హాస్పటల్ సిబ్బంది వచ్చి పట్టుకుపోతున్నారు."


అప్పుడు అనిపించింది నాకు.

నేను కూడా ఓసారి వెళ్ళి టెస్ట్ చేయించుకుంటే మంచిదని ...



— బొమ్మారెడ్డి మురళీధర్

రాష్ట్రానికి వెన్నెముక రైతన్నే !



ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు

వ్యవసాయ ప్రధానరాష్ట్రమైన మన ఆంధ్రప్రదేశ్ లో ఆర్థికవ్యవస్థ పటిష్టతకు రైతాంగం వెన్నెముక.

ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు స్ఫూర్తివంతమైన నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం రైతులసర్వతో ముఖాభివృద్ధిని, అధికాహారోత్పత్తిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకంగా అనేక రాయితీలు ప్రకటించింది.

-: విశేషించి చెప్పుకోదగ్గ కొన్ని ముఖ్యాంశాలు :-

- 1984-85 వార్షిక ప్రణాళికలో వ్యవసాయరంగానికి రూ. 117 కోట్లు కేటాయింపు.

1983-84	1984-85
• వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటైన ధరలు • పొగాకుఉత్పత్తిదారులనుండి దిగువ శ్రేణికి చెందిన పొగాకు కొనుగోలుకు రూ. 2 కోట్లు ఆర్థిక సహాయం • 36,810 టన్నుల మేలిరకం విత్తనాల పంపిణీ. • 168 టన్నుల అధిక దిగుబడి వంగడాలు ఆయా ప్రాంతీయ విత్తనాలతో మార్పిడి. • 6.99 లక్షల టన్నుల ఎరువుల పంపిణీ. • సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులద్వారా రూ. 415 కోట్లు స్వల్పకాలిక రుణాలు రూ. 10.74 కోట్లు శాఖాపరమైన రుణాలు. • ఖరీఫ్ కాలంలో 206 తాలూకాలకు రబీపంట తరుణంలో 116 తాలూకాలకు పంటభీమాపథకంవిస్తరణ.	• 40,000 టన్నుల మేలిరకం విత్తనాల పంపిణీ. • రూ. 20 లక్షల విలువైన విత్తనాల మార్పిడి కార్యక్రమం అమలు • రూ. 9.25 లక్షల టన్నుల ఎరువుల పంపిణీ. • రైతులకు రూ. 5 కోట్లు శాఖాపరంగా రుణసౌకర్యం. • పంట భీమాపథకం కొనసాగింపు.

రైతన్న సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో కృషి చేస్తోంది.

డి.ఐ.పి.ఆర్., ఆంధ్రప్రదేశ్. Lr.No. 12045/Advt/C-4/84 dt. 21-6-1984


రొమాంటిజిలింగ్



భవానీశంకర్ తన ప్రియురాలిని ఫ్రంట్‌సీట్లో కూర్చోబెట్టుకుని కారు డ్రైవ్ చేస్తున్నాడు రాష్‌గా!

"శంకర్ దయచేసి రెండో చేయికూడా ఉపయోగించు" అంది ప్రియురాలు ఖంగారుగా.

"నాకూ ఉపయోగించాలనే ఉందిగానీ, ఒంటి చేత్తో డ్రైవింగ్ చేయటం కష్టం డియర్" అన్నాడు శంకర్ విచారంగా.




ఇద్దరు పెద్ద మనుషులు హోటల్లో కాఫీ తాగుతున్నారు.

హఠాత్తుగా ఇద్దరూ చేతిలోని పుస్తకాలు తీసి మొఖానికి అడ్డం పెట్టుకున్నారు.

"ఏమిటి మీరూ పుస్తకం అడ్డుపెట్టుకున్నారు?" ఒకాయనడిగాడు

"అదిగో ఆ మూల టేబిల్‌మీద చూడండి! ఇద్దరు స్త్రీలు మాట్లాడుతున్నారు గమనించారా? వాళ్ళల్లో ఒకామె నా భార్య—రెండో ఆమె నా ప్రియురాలు! మరి మీరెందుకు పుస్తకం అడ్డు పెట్టుకున్నారు?" అడిగాడు రెండో అతను.

"నాదీ అదే కేసండీ బాబూ! వాళ్ళిద్దరిలోనే ఒకావిడ నా భార్య రెండో ఆవిడ నా ప్రియురాలు!!



"ఈ డ్రస్ నువ్వే కుట్టుకున్నావని మీ చెల్లాయి చెప్పింది! నిజమేనా సుమిత్రా?" అడిగాడు ప్రేమారావ్,

"అవును బావుందా?"

"అద్భుతంగా ఉంది!"

"కానీ నిజానికి ఈ డ్రస్ ఏముందనీ? ఏమీలేదు"

"అందుకే నాకంత బావుంది!"



స్మగ్లర్స్ గాంగ్

రోజుల్లో అవే వ్యాపార చిత్రాలు! ఆ మషాలా పెట్టి, మిగతా మషాలాలు కొంచెంగా తగిలిస్తే చాలు!" అన్నాడు సాయిరామ్.

"అవునవును!" అంది పార్వతీదేవి.

"కానీ మార్క్సిస్ట్ సినిమా ఎలా తీయాలో మనకెలా తెలుస్తుంది?" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి.

"నాకుతెలుసు నేను చెప్తానులే!" అన్నాడు జనార్ధన్.

జనార్ధన్ వాళ్ళ అన్నయ్యకు ఆ మధ్య వ్యాపారంలో లక్షలు లక్షలు లాభం వచ్చేసరికి ఆ కుటుంబమంతా మార్క్సిస్ట్ లతో చేరిపోయారు.

మార్క్సిస్ట్ నాయకులవాలంటే లక్షలకు లక్షల ఆస్తి ఉండాలట! కాదనిమేమెంత చెప్పినా వినిపించుకోలేదు. కావాలంటే మన రాష్ట్రంలోని కమ్యూనిస్టు, మార్క్సిస్టు పార్టీల నాయకుల ఆస్తి వివరాలు కనుక్కోమంటాడు.

"మార్క్సిస్టు సినిమా అంటే ఇలా ఉండాలన్న రూలేం లేదు. మనిష్టమొచ్చిన సినిమాయేతీసి పబ్లిసిటీమాత్రం "మార్క్సిస్టు" సినిమా అని ఇస్తేచాలు!" అన్నాడు జనార్ధన్.

"మరి దీనికి కథెవరు తయారుచేస్తారు?" అడిగాను నేను.

"ఇంకెవరు? నేనే! ఎలాంటి కథయినా

"రాయగలను నేను" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఉరఫ్ రామసుబ్బయ్య.

"నువ్వా! నీకసలు మార్క్సిజం అంటేనే తెలీదు కదయ్యా?" అడిగాను చిరాకుగా.

"భలేవారే సార్! మార్క్సిజం సినిమా తీయడానికి మార్క్సిజం అంటే ఏమిటో తెలియాలా? భలేవారే సార్! విమానం ఎక్కడానికి విమానం డ్రైవింగ్ తెలిసుండాలా? భలేవారే సార్ మీరు"

అందరూ నన్ను చూసి నవ్వారు.

"అయితే ఓ వారంలో కథ తయారు చెయ్! లాగించేద్దాం!" అన్నాడు సాయిరామ్.

చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఆనందంగా కాగితాలు కలం తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ వారమంతా సినిమా వ్యవహారంతో బిజీ అయిపోయేవాళ్ళమే గానీ ఈలోగా మా కాలనీ పిల్లలందరూ చదువుతోన్న స్కూల్ తాలూకు ప్రిన్సిపాల్ గారి దగ్గర్నుంచి మా అందరకూ ఉత్తరాలు వచ్చాయ్. అన్నిట్లోనూ మేటర్ ఒక్కటే.

"మీ పిల్ల/పిల్లగాడు......కి టి. సి ఇచ్చి స్కూలునుంచి గెంటేయాలని ఆలోచిస్తున్నాము. ఆ విషయంలో మీ సహకారం కోసం అర్థిస్తూ-

ప్రిన్సిపాల్"

పిడుగుపడ్డట్లు అందరం స్కూలుకి పరుగెత్తాం పిల్లకాయలను వెంట బెట్టుకుని. అప్పటికే అక్కడ ఓ జాతరలాగుంది. తల్లిదండ్రులూ, పిల్లలతో! ప్రిన్సిపాల్ రూమ్ బయట అప్పుడప్పుడూ పిల్లల్ని మింగేసేలా చూస్తూ తల్లిదండ్రులు నిలబడి ఉన్నారు

రంగారెడ్డి చాలామందితో ఇంటర్వ్యూ చేసి వచ్చాడు.

"అందరికీ అవే ఉత్తరాలు వచ్చాయట. ఇప్పటికిప్పుడే ఇద్దరు పిల్లలకి టి.సి. ఇచ్చి పంపించేసిందిట కూడాను" వివరాలు చెప్పాడు మాకు.

ఈలోగా ప్రిన్సిపాల్ రూమ్‌లోనుంచి ఓ తండ్రి గొంతు గద్గదంగా బ్రతిమాలుతూ వినిపించింది.

"అలా అనకండి మేడమ్-ప్లీజ్ మేడమ్ ఇప్పుడు టి.సి. ఇస్తే సీటెక్కడదొరుకుతుంది మేడమ్"

"లేపోతే ఏమిటిది! ఏమిటీ చదువు? ఏమిటీ మార్కులు? మాత్స్-ట్వంటీ పర్సెంట్, సైన్స్ ఫిఫ్టీన్ పర్సెంట్- నో! నో! టి.సి. తీసుకెళ్ళిపోండి! పిల్లల చదువుమీద శ్రద్ధ లేని తల్లిదండ్రులు మాకక్కర్లేదు-మా స్కూల్లో "సీటు"కు ఎంత డిమాండ్ ఉందో తెలుసా మీకు?"

"తెలుసండీ!"


"సీటు" ఇస్తాను అంటే చాలు రెండు వేలు డొనేషన్లు కట్టే పేరెంట్స్ వేలకు వేలున్నారన్న సంగతి తెలుసా మీకు?"

"తెలుసండీ!"

"తెలిసే ఇంత నిర్లక్ష్యం అన్నమాట! టి. సి. తీసుకుపోండి!"

"క్షమించండి మేడమ్—ఈసారికి క్షమించండి! వచ్చే పరీక్షలకు ముందు నేనే సెలవు పెట్టి బాగా చదివి-మా పిల్లల కూడా చెప్పి-మంచి మార్కులు వచ్చేలా..."

"ఇప్పు పరీక్షల సంగతి మాట్లాడు! ఇప్పుడెందుకు మంచి మార్కులు రాలేదు?"



"నాదే బుద్ధితక్కువండీ! చాలా పొరపాటుచేశాను-"

"అందుకే టి.సి తీసుకెళ్ళమంటున్నాను"

"బాబోయ్! అంతమాటనకండి మేడమ్-టెక్స్టుపుస్తకాలు లేకపోవటంవల్ల అ రెండింట్లో తప్పారండీ..."

" టెక్స్టుపుస్తకాలెందుకులేవు?"

"ఏమో మేడమ్! అర్ధమయిన షాపులూ తిరిగాను. ఇంతవరకూ ఎక్కడా రాలేదంటున్నారు-"

"పిచ్చివాగుడు వాగకూడదు! క్లాస్‌టీచర్ దగ్గర ఒక టెక్స్టుపుస్తకం నేనుచూశాను ఇంతవరకూ రాకపోతే క్లాస్‌టీచర్ దగ్గర కెలావచ్చాయ్?"

"ఆవిడ భర్త సవుదీ అరేబియాలో పని చేస్తున్నాడుమేడమ్! అక్కడినుంచి తెప్పించుకుందేమోమరి..."

"సీ-మిస్టర్! మీరు టెక్స్టుపుస్తకాలెలా తెచ్చుకుంటారో, ఎక్కడ తెచ్చుకుంటారో నాకనవసరం! టి.సి. తీసుకుపొండి..."

"ఈసారికి క్షమించండి మేడమ్! మేడమ్, మేడమ్,మేడమ్, ప్లీజ్ మేడమ్"

"నో-నో-నో-యూ ఆర్ టూ ఎడామెంట్-టి.సి. తీసుకుపోవల్సిందే-"

అందరం ఊపిరి బిగబట్టి వింటున్నాము అతనిగొంతు వినిపించలేదీసారి.

హఠాత్తుగా "ధన్" మన్న శబ్దం వినిపించింది.

దాని వెనుకే ఆవిడ కీచుగొంతు 'కయ్' మంది.


"ఛీ! వాటీజ్ దిస్! వాటీజ్ దిస్ నాన్సెన్స్! మేరీ-మేరీ-రిమూవ్ హిమ్ ఫ్రమ్ దిస్ ప్లేస్..."

మాకు అర్ధమయిపోయింది, అతను రాజకీయ నాయకులు వాడే ఆఖరి అస్త్రం ప్రయోగించాడు. ఆమె కాళ్ళమీద పడిపోయాడు.

"అలా అనకండి మేడమ్! ఇప్పుడు ఇంకో స్కూల్లో చేర్చాలంటే మళ్ళీ కొత్తరకం యూనిఫారం, రెండువేలు డొనేషనూ- బాబోయ్- నా వల్ల కాదు మేడమ్. మీరు వప్పుకునేవరకూ నేను మీకాళ్ళు వదలను."

"ముందు కాళ్ళు వదులు-"
"నేను వదలను మేడమ్-"
"ఆల్ రైట్! వచ్చే యూనిట్ టెస్ట్ ఖునా అన్ని సబ్జెక్టుల్లో పాసమార్కులు రాకపోతే టి.సి. ఇవ్వడం ఖాయం!"
"అలాగే మేడమ్!"
"అయితే ఇంక కాళ్ళు వదులు!"
"థాంక్యూ మేడమ్!"
"మేరీ!" ప్రిన్స్‌పాల్ గొంతు వినిపించింది.
"యస్ మేడమ్!"
"అక్కడ విక్స్‌డబ్బా ఉంటుంది- కొంచెం తెచ్చి నా కాళ్ళకు రాయ్-మరీ నొప్పిపుట్టేలా పట్టుకున్నాడు..."
"అలాగే మేడమ్!"
మా అందరి గుండెలూ ఝల్లుమన్నయ్!
"ఆవిడ కాళ్ళు పట్టుకోవడం మరీ టూ మచ్" అన్నాడు రంగా రెడ్డి.
"అవును! దిసీజ్ టూ మచ్!" అన్నాడు శాయీరామ్.
"ఒకళ్ సంగతేమోగానీ, గిసంటిపనులు నాతోని కాదుభయ్" చెప్పేశాడు యాదగిరి. అయితే మేము కాళ్ళ పట్టుకోక పోయినా ఇంచుమించుగా అంత ఘోరంగానూ జరిగింది మా ఇంటర్‌వ్యూ!
అందరం వాచిపోయిన మొఖాలతో బయటికొచ్చాం.
హఠాత్తుగా యాదగిరి తన చైన్‌లోని చాకు తెరచి తన పన్నెండేళ్ళ కొడుకుని పొడిచేయడానికని వెంబడిపడ్డాడు. వాడు "అమ్మో, అమ్మో" అంటూ మా అందరిచుట్టూ తిరగనాగాడు.
మేమంతా నానా హడావుడిపడి యాదగిరిని బలవంతంగా పట్టుకుని కత్తి లాక్కున్నాం.

"ఏమిట్రా! నీకేమయినా మతిపోయిందా! కన్నపిల్లాడిని చంపుతానంటావేమిటి?"
"లేకుంటే ఏం కిరికిరి గురూ ఇది? ఇస్కూ మాకి- వీడు పుట్టినగ్గర కెల్లి ఒకటే పరిషాన్, పరిషాన్-
ఈడికి పాలడబ్బాలు కొననికి కిరికిరి! దేశమంత తిరిగినంగాని పాలడబ్బా మనగ్గావల్సినది దొరకదు! బ్లాకులో కొనెడిటి! ఆడికెళ్ళి స్కూల్లో ఎడ్మిషన్‌గురించి కిరికిరి! వెయ్యిరూపాయలు నగలు గిర్వీకిపెట్టి తెచ్చి డొనేషను గట్టి లోయర్ కేజీల జేర్పించిన! ఈడు స్కూలుకి పోనికి రిక్ష! నీయవ్వ-ఈడి ఫీజు నలభై! రిక్ష నలభై! ఈడి యూనిఫారం బట్టగురించి వంద దుకాణాలు తిరిగినా! అడకెళ్ళి ఈడి బూట్లు, ట్రైనింగ్ జెప్తున్నరయ్! ఈ ఇద్దరు పిల్లగాండ్రని సదివియ్యనికి పైసల్లాలక నేనూ, నా భార్య ఒక్కపొద్దే భోజనం చేస్తున్నం! గీపరిషాన్లు నేనుంటే గిప్పుడీ ప్రిన్సిపాల్ టి.సి ఇస్తననబట్టె! ఏరా-ఎందుకుర మార్కులుగన్ని తక్కువొచ్చినయ్యనడిగితే టెక్ట్స్ పుస్తకాలు తీస్కరమ్మంటడు!
నీయవ్వ ఇంకేదయిన అంటే తెస్తంగానీ గీ టెక్ట్స్ పుస్తకాలు ఏడకెళ్ళి తేవాల? అదేం బంగారమా, వెండా-తేలిగ్గ దొరకనికి?"
థూ! నీయవ్వ-గిసంటి దేశంలో పిల్లల్నెపదుపయ్యా కనమని చెప్పేదిడి?"
"మేమంతా నీతోపాటే బాధలు పడటం లేదేమిటి? అంతమాత్రాన కత్తి తీసుకుని పిల్లలను పొడిచేస్తున్నామా!" అన్నాడు రంగారెడ్డి. అందరం కాలనీకి చేరుకున్నాం.



"ఇలాక్కాదు గురూ! అందరం తలో వేపూ వెళ్ళి మొత్తం హైద్రాబాద్ అంతా వెతికి వద్దాం టెక్స్ట పుస్తకాలెక్కడయినా దొరుకుతాయేమో!" అన్నాడు గోపాల్రావ్.

"ఆ ఆలోచనతో అందరూ ఏకీభవించారు.

మర్నాడు శెలవు పెట్టి అందరం టెక్స్ట పుస్తకాలకోసం తలో దిక్కు వెళ్ళాం! మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి శాయిరామ్ ఉత్సాహంగా ఓ విషయం చెప్పాడు.

"చార్మినార్ దగ్గర ఓ చిన్న షాపువాడు ముందే డబ్బిస్తే రెండు రోజుల్లో పుస్తకాలు తెప్పించి ఇస్తానంటున్నాడు"

"నాకూ ఓ ఫ్రెండ్ కనబడ్డాడు. వాడికి డబ్బిస్తే ప్రింటింగ్ ప్రెస్ లో వాళ్ళ ఫ్రెండ్ ద్వారా తెప్పిస్తాట్ట" అన్నాడు రంగారెడ్డి.

వెంటనే అందరం ఆలోచించి ఇద్దరికీ డబ్బు కట్టేద్దామని నిర్ణయించుకున్నాం!

"ఇద్దరిలో ఏ ఒక్కరు పుస్తకాలు తెచ్చిచ్చినా రెండోవారి దగ్గర ఆర్డర్ కాన్సిల్ చేసేయవచ్చు." అన్నాడు జనార్ధన్.

వారం రోజులు గడచిపోయినయ్. అయినా ఏ ఒక్కరూ టెక్స్ట పుస్తకాలు తేలేదు.

ఆ రోజు అర్ధరాత్రి తలుపు తట్టారెవరో. నిద్ర కళ్ళతో తలుపు తెరచాను.

ఎదురుగ్గా, శాయిరామ్ రంగారెడ్డి, గోపాల్రావ్, యదగిరి కనిపించారు.

"ఏమిటి ఈ రాత్రిలో వచ్చారు?" అన్నాను నిద్రమత్తుతో.

"టెక్స్ట పుస్తకాలు టెక్స్ట పుస్తకాలు దొరుకుతున్నాయట! త్వరగా పద!" అన్నాడు శాయిరామ్ రహస్యంగా.

నా నిద్రమత్తంతా వదిలిపోయింది.

"ఎక్కడికి?"

"ష్! అదంతా సీక్రెట్! అజమ్ భాయ్ ఇప్పిస్తానంటున్నాడు."

అప్పటివరకూ నేను అజమ్ భాయ్ ని చూళ్ళేదు. వీళ్ళందరి వెనుకా నిలబడి ఉన్నాడు. అజమ్ భాయ్ కూడా మా కాలనీ వాసే! అతనికి అల్ఫా హోటల్ పక్కన చిన్న పుస్తకాల షాపుంది. మాంచి



ఇంగ్లీష్ మసాలా నవలలు అద్దెకిస్తూంటాడు.

నేను వెంటనే బట్టలుమార్చుకునివాళ్ళతో బయలుదేరాను. అందరం ఆబిడ్స్ చేరుకున్నాం సైకిళ్ళమీద. ఆబిడ్ సెంటర్‌కి దగ్గర్లోనే ఉన్న ఇరుకు సందులు ఓ అర డజను తిప్పాడు అజమ్ చివరకు ఓ పాడుబడినట్లున్న మేడముందునిలబడ్డాం.

"ఇగో, దేఖో భయ్! పోలీసులుగిట్టవచ్చి ఈడ ఎందుకు నిలబడిన్రు అంటే "టెక్స్ట్‌పుస్తకమ్" కలేకే బోల్‌నానై! సమ్‌జెకినై?"

"సముజే-సముజే!" అన్నాడు రంగారెడ్డి

"మళ్ళా ఈడ ఎందుకు నుంచున్నవు అంటే ఏం జెప్తావ్?"

తఏం జెప్పమంటావ్?'' అతనినే అడి

"దు శాయీరామ్.

గా" సెకండ్ షో సినిమాదేక్ కే అరహేహై కర్ కే బోల్‌నా! సముజెకినై?''

"సముజే!'' అన్నాడు రెడ్డి.

అయిదు నిమిషాలయిపోయింది. అందరం నిశ్శబ్దంగా. దొంగల్లా నిలబడ్డాం.

"కానీ టెక్స్ట్ పుస్తకాలేకదా మనం కొనేది? దానికింత రహస్యం ఎందుకు?" నెమ్మదిగా అజమ్‌భాయ్ పక్కన చేరి చెవిలో గుసగుసలాడాను.


"అరే బేవకూఫ్! ఇవి స్మగుల్డు టెక్స్ట్ పుస్తకాలు! మద్రాస్‌కెళ్ళి ప్రింటయి వచ్చింది. సముజే?"

"నహీ సముజే!" అన్నాను మొఖమాటం లేకుండా.

"అరె! క్యా దమాక్ హైజీ తుమారా? మన రాష్ట్రంలో టెక్స్ట్‌పుస్తకాలు దొరకటంలేదని స్మగుల్డు వస్తువుల వ్యాపారం చేసేటోళ్ళు - టేప్‌రికార్డర్లు, వాచీలు, బట్టలు, కాసెట్లు స్మగ్లింగ్ బంద్‌చేసి మన ఆంధ్రప్రదేశ్ టెక్స్ట్‌పుస్తకమ్‌లు మద్రాసులో ప్రింట్‌చేయించి బ్లాకులో అయిదు రూపాయలకు ఎక్కువరేటుతో అమ్ముతున్న కొన్ని టెక్స్ట్‌పుస్తకమ్‌లు హాంగ్‌కాంగ్, జపాన్‌నుంచి భీ" స్మగ్లింగ్ హోరైబోల్ కే సునామై?

మరో అయిదునిమిషాలు గడిచినయ్.

లాల్చీ పైజమా తొడుక్కున్న ఓ వ్యక్తి ఆ పాడుబడ్డ భవనంలోనుంచి టార్చిలైట్



తో రోడ్డుమీద కొచ్చి అటూ ఇటూ రెండుసార్లు పచార్లు చేశాడు.

రంగారెడ్డి అతనిదగ్గరకెళ్ళి "ఆకాశంలో పగలే నక్షత్రాలొచ్చాయ్!" అన్నాడు.

అతను ఓ క్షణంఆగి "నిన్నరాత్రి సూర్యుడు కూడా వచ్చాడు!" అన్నాడు.

సిగరెట్ వెలిగించుకుంటూ ఆ తరువాత ఏం చెప్పాలో రంగారెడ్డి మర్చిపోయి నట్లుంది. తన డయికీతీసి అగ్గిపుల్ల వెలుగులో చూసి "అగ్గిపుల్లకు ముళ్ళున్నాయ్" అన్నాడు.

ఆ వ్యక్తి ముఖంలో సంతృప్తి కనిపించింది.

"ఎవరు పంపించారు మిమ్మల్ని?" అనడిగాడు.

అజమ్‌భాయ్ ముందుకొచ్చాడు" నిసార్ మియా!"

"ఎంతమందికొక్కావాలి టెక్ట్సపుస్తకాలు"

"పద్దెనిమిది సెటు!" చెప్పాడు కాయీరామ్.

"మద్రాసు ఎడిషన్ లేదు! హాంగ్‌కాంగ్ ఎడిషన్ ఉంది కావాలా?"

"ఏదొక ఎడిషన్! అవి లేకపోతే మా పిల్లలకు సంవత్సరం గోవిందా అవుతుంది!" అన్నాడు గోపాల్రావ్.

"అసలు రేటుమీద ఆర్రూపాయ లెక్కవవుతుంది!"

"వప్పుకుంటున్నాంగదా!"

"అయితే డబ్బివ్వండి!"

అందరం లెక్కచూసి డబ్బు అతని చేతికిచ్చాం.

అతను ఆ భవనంలో కెళ్ళిపోయి పావుగంట తర్వాత పెద్ద "బండిల్"తో తిరిగి వచ్చాడు.

"ఇవిగో పద్దెనిమిది సెట్లు! తెలుగు టెక్ట్సులో అక్కడక్కడ ఒకటి రెండు చైనీస్ అక్షరాలు వస్తే రావచ్చు ఎడ్జస్ట్ చేసుకోండి! మళ్ళీ రిటర్న్ తీసుకోమంటే మాత్రం తీసుకునేదిలేదు. వారం పదిరోజులు వీటిని స్కూలుకివ్వకండి! సరేనా?"

"సరే!"

అందరం అతనిని కౌగలించుకుని

ముస్లిమ్ పద్ధతిలో భుజాలు కలిపి, షేక్ హాండిచ్చి కృతజ్ఞతలు తెలిపి కాలనీకి చేరుకున్నాం.

తీరా మర్నాడు ఉదయానికి రంగారెడ్డి ఫ్రెండ్ మింట్‌కాంపౌండ్‌లో తన ఫ్రెండ్ ద్వారా సంపాదించినపుస్తకాలు పార్సిల్ రిక్షాలో పంపించాడు. చార్మినార్‌దగ్గర షాపులో ఎడ్వాన్స్‌గా కట్టిన డబ్బు తీసుకొచ్చేద్దామని వెళ్ళిన శాయిరామ్ మరో పార్సిల్‌తో తిరిగివచ్చారు.

"పుస్తకాలు వచ్చేసినయ్ కనుక డబ్బు వాపస్ ఇవ్వనన్నాడు ఆ షాపువాడు!" అన్నారు దిగాలుపడి.

ఈఎక్‌స్ట్రాపుస్తకాల బెడద ఎలావది లించుకోవాలా అని అందరం చాలా భయంకరంగా ఆలోచిస్తూకూర్చున్నాం, తీరా సాయంత్రం నాలుగయేసరికి మా కాలనీ పిల్లలంతా స్కూలునుంచి వచ్చే శారు. అందరిచేతుల్లో టెక్స్‌పుస్తకాలు ...

ఖంగారుపడి "ఈ పుస్తకాలెక్కడివి?" అనడిగాం వాళ్ళను.

"మా ప్రిన్సిపాల్ ఎక్కడినుంచో తెప్పించి మా అందరికీ ఇచ్చింది. రేపు డబ్బు పట్టుకొచ్చి కట్టమంది?" అన్నారు వాళ్ళు.

మూలిగే నక్కపీద కొన్ని వందల తాటికాయలు వరసగా గంటసేపు పడి నట్లనిపించింది.

చివరకు ఆరాత్రి అందరూ కలసి ఓ తీర్పుఇచ్చాతు. నేనూ, శాయిరామ్‌కలిసి ఆ ఎక్‌స్ట్రా పుస్తకాలన్నీ ఓ రిక్షాలో వేసుకుని ఓ పెద్ద స్కూలు బయట నిల బడి కావలసిన విద్యార్థులకు అమ్మివేయా లన్నదే ఆ తీర్పు సారాంశం. ఇష్టం లేపోయినా, ఆపని ఎవరొకరు చేయక తప్పదుకనుక వప్పుకున్నాం. మర్నాడు పొద్దున్నే అనుకున్న ప్రకారం రిక్షా మాట్లాడి పుస్తకాలన్నీ వేసుకుని మా కాలనీకి కొంచెం దూరంలో ఉన్న ఓ పెద్ద స్కూలు దగ్గరకెళ్ళి నిలబడ్డాం. మా వంక ఎవరూ చూడకపోయేసరికి శాయిరామ్‌కి గట్టిగా అరవకతప్పలేదు.

"ఎవరికి మాష్టారూ టెక్స్‌పుస్తకాలు! టెక్స్ పుస్తకాలెవరికండీ! తాజా టెక్స్ట్ పుస్త – సారీ – కొత్తటెక్స్‌పుస్తకాలు– గవర్నమెంట్ టెక్స్ పుస్తకాలెవరికండీ బాబూ..."

నాలుగుసార్లలా అరిచేసరికి కొంతమంది కుర్రాళ్ళు వాళ్ళ తండ్రులూ మా రిక్షా చుట్టూ పోగయ్యారు.

"నాకు అలా పుట్‌పాత్ వ్యాపారంచేయ డం చిన్నతనంగా ఉందికాని తప్పదు కదామరి!

అయితే శాయిరామ్ ఎందుకనో ఆవేశా నికి భలే సూటయ్యాడనిపించింది.

కొంతమంది టెక్స్ పుస్తకాలు తీసి తిరగేసి చూశారు.

"జపాన్ ఎడిషన్ లేవా?" అడిగాడొక తను


"లేవుసార్! ఇవే వున్నయ్!"


"అందులో పేపర్ మంచిది వాడతారు! అందుకని అడుగుతున్నాను. కావాలంటే ఇంకో రెండ్రూపాయలెక్కువ తీసుకుని జపాన్‌వి తెచ్చిస్తారా?"

"అయ్యో మేము ఈ వ్యాపారం చేసే వాళ్ళం కాద్సార్! మా పిల్లలకు అనుకో కుండా మూడు సెట్లు కొనడంవల్ల అమ్మేస్తున్నాము"


"హలో ఉదయార్కర్" అని ఎవరో పిలవడంతో నా పై ప్రాణం పైనే పోయింది. అతను మా ఆఫీస్ లో నే వర్క్ చేస్తుంటాడు
"ఏమిటి ఉద్యోగం మానేశావా?" ఆశ్చర్యంగా అడిగాడతను.
"అబ్బే కాదు" అంటూ కంగారుగా చెప్పబోయానుగానీ అతను వినిపించుకో లేదు—
"ఓహో పార్ట్ టైమ్ అన్నమాట! అవున్లే! స్మగ్లింగ్ బెస్ట్ బిజినెస్! ఎంత మంది ఇట్టే లక్షాధికారులయిపోలేదు? హాజీమస్తాన్ చూడు! మొదట్లో తిండి కూడా గడిచేది కాదుట-"
పావుగంటసేపు హాజీమస్తాన్ కథంతా చెప్పి వెళ్ళిపోయాడతను.
"సాయిరామ్!" నీరసంగా పిలిచాను.
"ఏమిటి?"

"ఇలా లాభం లేదు గురూ! పిల్లల్ని స్కూల్ దగ్గర డ్రాప్ చేయడానికి తల్లిదండ్రులొస్తారు చూడు వాళ్ళని అడిగితే బావుంటుందిగానీ ఇలా అసహ్యంగా కేకలు పెడుతూ అమ్మటం నాకు బావుండలేదు" అన్నాను.
"నీ ఐడియా బాగానే ఉంది!" అన్నాడు సాయిరామ్.
సరిగ్గా అప్పుడే ఓ పెద్దమనిషి స్కూటర్ మీద వచ్చి వాళ్ళ పాపను డ్రాప్ చేసి తిరిగి వెళ్ళబోతూండే నేను పరుగుతో వెళ్ళి అడ్డం నిలబడ్డాను.
"మీ పిల్లలకు టెక్స్ట్ పుస్తకాలు కావాలా సార్!"
అతను స్కూటరు ఆపాడు "కావాలి!"
"రండి సార్! తీసుకోండి! రిక్షాలో ఉన్నాయ్! మేము కొన్నధరకే ఇచ్చేస్తున్నాం!"





ఓ ప్రేమ లేఖ.
ప్రియమైన దేవతా!
నీ కోసం సప్త సముద్రాలూ దాటగలను హిమాలయ పర్వతాలు ఎక్కగలను. సహారా ఎడారి దాటగలను. కాకులుదూరని కారడవుల్లో ప్రయాణం చేయగలను- ఇదంతా ఎందుకుతెలుసా కేవలం నీ ప్రేమ కోసం- ఇట్లు నీ ప్రియుడు వీర్రాజు
అన్నట్లు నిన్న రాత్రి వర్షం తుపర పడుతున్నందువల్ల నీకుమాట ఇచ్చిన విధంగా రాలేకపోయాను సారీ!



"ఐసీ" అన్నాడతను స్కూటర్‌కి స్టాండ్ వేసి రిక్షా దగ్గరకొస్తూ.
పుస్తకాలన్నీ చూశాక "ఇవన్నీకొంటాను ఇస్తారా?" అనడిగాడు.
శాయిరామ్ నేనూ ఆనందంగా మొఖాలు చూచుకున్నాం.
"ఇస్తాంసార్! అంతకంటె కావల్సిందింకేముంది?"
"అయితే నా వెంబడే రానీండి రిక్షా" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడతను.
రిక్షా స్కూటర్ వెనుకేపోతోంది, మేము సైకిల్స్‌మీద బయల్దేరాము.
"వీడెవరో స్మగ్లర్‌లాగున్నాడు! ఈపుస్తకాలన్నీ మావూలురేటుకి కొనేసి-బ్లాకులో అమ్ముకుంటాడు కాబోలు!" అన్నాను శాయిరామ్‌తో.
"ఇంకా అనుమానమెందుకూ? బ్లాక్ మార్కెట్ బిజినెస్ చేయబట్టే ఆ స్కూటర్ కొనగలిగాడు!" అన్నాడు శాయిరామ్.
"ఇక్కడ ఆపు!" అన్నాడతను రిక్షా వాడితో. రిక్షా ఆగింది.
"ఫోర్ నాట్ త్రీ-ఆ రిక్షానీ, వాళ్ళిద్దరినీ లోపలకు తీసుకుపద!" అంటూ అరిచాడు.
ఉలిక్కిపడి చూచాము.
ఎదురుగ్గా పోలీస్ స్టేషన్!
ఓ కానిస్టేబుల్ బయటికొచ్చి "లోపలకు పదండి" అన్నాడు కర్కశంగా
ఆ షాక్‌నుంచితేరుకోకముందే మమ్మల్ని లోపలికి తీసుకెళ్ళి లాకప్‌లో పడేశాడు.
ఫోన్‌లో మమ్మల్ని తీసుకొచ్చిన స్కూటర్‌వాలా గొంతు భయంకరంగా వినబడుతోంది.
"హలోసార్! యస్పీగారాసార్! గుడ్ మాణింగ్‌సార్! నేను సి.అయ్.డీ. ఇనిస్పెక్టర్ నర్సింగరావ్‌ని మాట్లాడుతున్నాను. టెక్స్ట్‌పుస్తకాల స్మగ్లింగ్ కేస్ పట్టేశానుసార్! చాలా పెద్దరాకెట్ సార్ అది! ఇద్దరు వ్యక్తుల్నీ! రిక్షాను పుస్తకాల్నీ కాన్ఫిస్కేట్ చేసేశానండీ!... మన రాష్ట్రంలో జరుగుతున్న ఈ స్మగ్లింగ్ వ్యవహారంలో ఇదే పెద్దముఠా సార్..."
మాకు క్రమక్రమంగా స్పృహ తప్పసాగింది.

సాహిత్య గళ్ళనుడికట్టు 5

చిరునామా:- ______________________

____

____

____

____

1		2		■	■	3		4
	■		■	5			■	
6	7				■	8		
■		■	■		■		■	
■	9	10		■	11		12	■
13	■		■	14	■	■		■
15			■	16		17		18
	■	19			■		■	
20			■	■	21			

ఆధారాలు


అడ్డం :

1. స్వరకల్పనలో షడ్జమ ఋషభాల ఆమ్రేడితం 3. గలభాకు పర్యాయ పదం. 5. సరిదిద్ది మప్పరా! తెలంగాణా దేవాలయాన్ని!? 6. గట్టిగా నవ్వకండి ఇది చిరునవ్వు. 8. నిరంతరం హాలికులు దాచిన పద్ధతి 9. బిళ్ళ బంగ్రోతు "ట్రేడ్ మార్క్" 11. దాతల చేతికుండదని అతిశయోక్తి. 15. కల్లు తేనీరు కలిపి విసురుకోండి 16. జన్మతః వచ్చే జ్ఞానం కాదు అంతిమ ఘడియల్లోది. 19. కూలికోసం అక్కడ చేరతారా నలుగురూ! 20. మార్క్సిస్టుల పాలనలో వున్న రాష్ట్రం మూడూళ్ళు పెట్టు 21. ఆహుతయ్యే దానం విష్ణుపు పుచ్చుకున్నాడట.

నిలువు :

1. నేను సైతం ప్రపంచాగ్నికి తెలుగు చితుకు ధారపోశాను. 2. సలసల హాలాహలంలో యోచన 3 బీదరికం కాదు ఘనత 4. చిపర హాలులో పాత నాణెములు దొరుకుతాయి. 5. పరశురాముడు, శ్రీరాముడు, బలరాముడు ముగ్గురూను 7. దేశవాళీ ఛందస్సు-వివాదం 10. వావిళ్ళ వారింట్లో కాళ్ళాగజ్జి... కూర? 12. సముద్రం కడపలో సగం పైగా వుంది. 13. పేకాటలో పెద్దది ఇంగ్లీషు దవాఖానాలో మొదటిది 14. ద్రౌపది 17. రామలింగడి వూరు 18 ధనంలోన కలిపితే మొలకెత్తేడి.

	1 చ	తు	2 రం	గ	3 ము		4 నే	5 త్ర
6 రా	త్రు		ధ్రు		7 దం	8 తి		ధ్యా
	రు		9 ము	10 డి		11 లా	స్త్ర	ము
12 పే	డు	13 క		ప్ప		దా		
దం		14 ల	కం		15 న	న		16 యో
		క		17 మే		18 ము	19 ని	శి
20 కో	కి	ల		21 నా	22 త్రా		పా	
రి		23 ము	24 ది		గ		25 ర	తి
26 క	ప్ప		27 ట	త్ర	డు	ఘ	ణ	



గళ్ళ నుడి కట్టు విజేతలు

1 శ్రీమతి టి. వి. భానుమతి రణస్థలం 2. ఎస్. శ్రీనివాసరవి. పిఠాపురం. 3. ఎమ్. వి. నాగేశ్వరరావు. విశాఖపట్నం.

నిబంధనలు: "రం × ధ్యా ×"

1 ప్రతి నెలా పూరించిన గళ్ళ నుడి కట్టు మా కార్యాలయానికి 20 వ తేదీకి చేరాలి.

2 సంచికలో గడినే వాడాలి. విడి కాయితాల పై గళ్లుగీసి నింపరాదు.

3 గళ్ళ నుడిపై మీ చిరునామా రాయడం మరవకండి.

4 నుడి కట్టు పంపే కవరుపై "ఆరుద్ర గళ్ళ నుడి కట్టు" అని విధిగా రాయాలి.

దీపావళి సంచిక

పేరొందిన రచయిత(త్రు)లు
కొత్త రచయితలు
కార్టూనిస్టులు
ఆర్టిస్టులు
గేయ రచయితలు
అందరూ కలిసి వెలిగిస్తున్న

దీపావళి ప్రత్యేక సంచిక
సర్వాంగ సుందరంగా తయారవుతోంది!

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11, Chikkadapalli, Hyd-20, & Printed by P. Ramakrishna at Raghava Printers 1-8-4/1 Chikkadapalli, Hyderabad-20.